

మూలం :
"బ్రూ"

అనుసరణ :
"చిన్నా"

స్త్రీ : ఇండిషన్లు ఇప్పించుకోడానికి డబ్బేది బాబూ ! ఊరికే ఇవ్వరుగదండీ ! ఇంకనాతప్పే ముంది బాబూ !

డాక్టర్ : నీకు పిల్లలులేరా ?

స్త్రీ : చాలా కడుపులు పోయాయి బాబూ ! మాకు పెళ్లయిన కొద్దిరోజులకే అతనికి అజబ్బంటుకొంది.

[నిశ్శబ్దం]

డాక్టర్ : (తను వ్రాసిన ఒక కాగితం ఆమెకిచ్చి) ఇది నాఇంటినెంబరు. ప్రతి ఆదివారం ఉదయంవచ్చి నన్ను కలుసుకొంటూండు. (తలుపుదగ్గరకువెళ్లి) ఇలారా ! (వెనుకనడుస్తుందామె. తలుపుదగ్గర కొంతడబ్బు ఆమెచేతిలో పడేసి విసురుగా) ఇది తీసుకొని ఇక వెళ్ళిపో—

స్త్రీ : బాబూ - అదేంటి - నేను !....

డాక్టర్ : 'నాన్సెన్స్' నాకు టైమ్‌లేదు ఇవన్నీ వినడానికి. ఊఁ! వెంటనే వెళ్ళిపో. (ఆమెను మెల్లగా తోసేసి—ప్రేక్షకులకు కనబడని ఎవరితోనో మాట్లాడుతూ) ఏమండీ ఏంకావాలి ?

పురుషుడు : (బైటనుంచే) ఈఉదయం మీరు చూచిన కుర్రాడితండ్రినండి. నేనిక్కడికి రావొచ్చునాఅని, మీతో తరువాత మాట్లాడ వచ్చునాఅని అడిగేను కదండీ !

డాక్టర్ : ఔను - జ్ఞాపకం వచ్చింది. మీఅబ్బాయి కాలేజీలో చదువుకొంటున్నాడుకదూ ?

పురుషుడు : (గుమ్మంలో) ఔనండి !

డాక్టరు : రండి లోపలికి ఫరవాలేదు - ఈ ఊరు కాదులెండి వీరిది. మాట్లాడవచ్చు.

పురుషుడు : (ప్రవేశించి) మాకష్టాలుమీకు తెలిసినవేగా! నాకొడుక్కి పద్దెనిమిదేళ్లు. ఈ వ్యాధి కారణంగా సగం పక్షవాతం వచ్చేసిందపుడే. మాది చిన్నవ్యాపారంబాబూ. వాణ్ని కాలేజీకి పంపడానికి చెమటోడ్చి సంసారం అతిక్లుప్తంగా చేసుకొంటూ వచ్చాం. ఆఖరికి....

డాక్టర్ : కూర్చోండి!

పుర : (కూర్చుంటూ) ఒకరోజు కాలేజీనుంచి వచ్చేస్తుంటే మావాడు ఆకుల్లముండల వల్లోపడ్డాడు. ఆముండలనావిధంగా బహిరంగంగా తిరగనియ్యటం న్యాయంఅంటారా? పద్దెనిమిదేళ్ల కుర్రవాళ్లని అలా దుర్మార్గానికి తిప్పుకు పోతుంటే ఇంతమంది పోలీసులూ ఏం చేస్తున్నారు? 'బ్రోదల్ఏక్టు' ఏమయింది? 'చెకింగ్' అనే వొంకతో లోపలికెళ్లి ఇంకసలు బైటకు ఊడేరాని. ఈపోలీసు ఇనస్పెక్టర్లు తమ 'డ్యూటీని' అతిసవ్యంగా నిర్వర్తిస్తారుబాబూ!

డాక్టర్ : అదికాదులే.

పుర : ఐతే ఎందుకు ఆపరుమరి?

డాక్టర్ : (వెంకటాద్రిమయ్యకేసి ఓరగాచూస్తూ) నాకు తెలీదు.

పుర : నాకొడుకుని చూడండి! కాటిలోనే కాని ఇంక బాగుపడే అవకాశంలేదు. చక్కని కుర్రాడు. వాడంటే ఎంతో గర్వంగా ఉండేదిమాకు!

డాక్టర్ : నిరాశ చెందకండి! మీవాడిని బాగుచెయ్యడానికి చేయగలిగిందంతా చేస్తాను (జాలిగా)ఇంతకాలం నాదగ్గరకు తీసుర్రాకుండా ఏం చేస్తున్నారు?

పుర : వాడికేంఉందో నాకెలా తెలుస్తుందిబాబూ! నాతోచెప్పడానికి భయపడి—అలాగే జబ్బు ముదరబెట్టుకొన్నాడు. ఇక ఆబాధకి ఆగలేక నాకుతెలీకుండా నాటువైద్యుల దగ్గరికి వెళ్ళాడు. వాడిచ్చింది కాస్తా కాజేసి ఏవోబైరాగి చిట్కాలువేసి వెనక్కి తోపేశారు బాగుచెయ్యకుండానే. యీక్యాటలాగు వైద్యుల్దికూడా న్యాయమే అంటారా? ఇలాంటి అన్యాయాలు జరుగుతూంటే ప్రభుత్వం ఏంచేసిందో చెప్పండి, సిపాయిల్ని పెంచుతోంది తప్ప. ఏదీ కొత్తగా నాలుగు హాస్పటల్సన్నా కట్టించిందా? ఎందుకీ నిధులూ, స్మారక సభలూను? ఒక్కొక్కడు చస్తే లక్షల్ని పుంజి పుచ్చుకొంటున్నారు మళ్ళీ. నా కురుపులు, బోదకాళ్లు ఎంతవరకూ రాకుండా చేశారో చెప్పండి. ఎందుకీ ఆరోగ్య శాఖలు? శానిటరీ ఇనస్పెక్టర్లు, హెల్తు ఆఫీసర్లు - ఆబ్బో! సిబ్బంది చాలా ఉంటుంది! మెడికల్ కాలేజీలో అదనంగా ఎంతమంది విద్యార్థులు చేరడానికి అవకాశం కల్పించారు? సీటుదొరకాలంటే మంత్రిగారి రికమండేషను

లేక చదువుకొనే అవకాశంలేక, మందిప్పించు కోడానికి డబ్బులేకఏడ్చే లక్షలాది అనాథ శిశువుల మాటేమిటి బాబూ? మాగోడు ఎవరువింటారు? శ్రీరామచంద్రా!

డాక్టర్ : అవును, ప్రభుత్వానికి—ఒకే నెపంఉంది. ఈ సంగతులేవీ వాళ్ళవరకూ రాలేదంటారు. భయపడకండి! మీ అబ్బాయికంటే విషమించిన కేసులు బాగు చేశాం. తక్కినవాళ్ళవిషయం అంటారా—వీలుచూచుకొని వాళ్ళనుచూదాం.

(డాక్టర్‌లేచి అతనికి దారిచూపిస్తాడు. వెంకట్రామయ్య వైపుతిరిగి)

చూస్తున్నారా—మనమూఢ విశ్వాసాన్ని రాజ్యాంగ యంత్రాన్నీ పూర్తిగా మార్చుకోవాలి. సిఫిలిస్ అనేమాట ఉచ్చరించడానికైనా తగని ఘోరపాపంకింద పరిగణించడం ముందు మానాలి. ఆవ్యాధియొక్క లక్షణాలు, దారుణఫలితాలు ప్రజలకు అసలుతెలియనే తెలియవు. అందుకే ఆవ్యాధిఇంకా దగ్ధంచేస్తోంది ప్రజల్ని—ఇలా దేశమంతటా వ్యాపిస్తోంది. ఏమిటయ్యా అంటే—'నాకుతెలీదు' అదిఎలా అంటుకొంటోందయ్యా అంటే— 'నాకుతెలీదు'. 'సరైన జాగ్రత తీసుకోకపోతే ఎంత ప్రమాదకరం అవుతుందోమీకుతెలియదా' అంటే—'నాకుతెలీదు' అంతే ప్రతిఒక్కడి సమాధానమూను — 'నాకుతెలీదు—నాకుతెలీదు— నాకుతెలీదు'. మూడవప్రపంచ యుద్ధం ఎందుకురావాలో స్కూల్సులో చెప్తారుగాని ఇలాంటి రోగాల్ని గురించి చెప్పరు.

గౌ. వెంక : ఏమైనా ఇలాంటి విషయాలు స్కూల్సులో పిల్లలకు చెప్పటం ఎలాకుదురుతుంది డాక్టర్?

డాక్టర్ : ఏం, ఎందుకు కుదరదు?

గౌ. వెంక : వాళ్ళబుద్ధిని పెడదార్లు తొక్కించదండీ!

డాక్టర్ : వాళ్ళకి చిన్నతనంలోనే అనవసరపు కుతూహలం కలుగుతోందని వాళ్ళకు విద్యచెప్పకుండా అలాంటి విషయాల్ని దాచివేసినంత మాత్రాన అభావాలు కలగకుండా చేయగలమనా మీ అభిప్రాయం? ఎలిమెంటరీ బడిలోకి వెళుతున్న ప్రతీ కుర్రాడికీ, ప్రతికుర్రదానికీ ఈ సంగతులన్నీ తెలుసు. వాళ్ళకుతూహలాన్ని అణచాలని మీరుచేసే ప్రయత్నమల్లా వారిని తప్పుదారుల్ని తొక్కిస్తూనేఉంది. ప్రేమవల్ల జీవితాన్ని పునరుత్పత్తి చేసేచర్యలో అవినీతి ఏముందో చెప్పండి? కానిమన పిల్లల అభివృద్ధి కోసమని చెప్పి, మౌనం వహించి వాళ్ళని అడ్డమైన దారుల్లోనూ వ్యభిచరించేలా చేస్తున్నాం. ఈపెద్దమనుషులంతా ఏంచేస్తున్నారో చూడండి: తమఆడపిల్లలకి సంగీతంపేర "రతిసుఖసారే గతమభిసారే" లాంటి బూతు పాటల్ని పాడిస్తున్నారు—ఇవన్నీ భక్తిలక్షణాలు కాబోలు! అవన్నీవింటూ నోరు చప్పరిస్తూ కూర్చునే ఈపెద్దమనుషులు ఇవన్నీ సశాస్త్రీయ విమర్శతో వాళ్ళకు

స్కూల్సులో తెలియజెప్పుతామంటే 'హరిహరీ' అని చెవులు మూసుకొంటారు. ఈపెద్దమనుషులంతా నాదగ్గరికి సలహాల కొచ్చేవాళ్ళే. ఇది వ్యభిచారంకాదు. శాస్త్రం. ఈజాతి భవిష్యత్తు ఈనాటిబాలబాలికల్లోనేఉంది. అల్లాంటప్పుడు తమపితాశ్రీ తాలుగా ఈరోగాల్ని అనుభవించి పెంపొందించి తమసంతతికి ప్రసాదించవలసి వస్తే ఈ జాతి ఎన్నితరాలలో శూన్యమై పోతుందో ఆలోచించండి !

గా. వెం : యువకులకి కొంత నిగ్రహం ఉండాలి.

డాక్టర్ : నిగ్రహం ఇదంతానటన ! ఇతరులముందు సహజంగా కనపడితే లోకువని భయం. కోర్కెలతో మధనపడుతూ అవిలేనట్టు కప్పిపుచ్చేందుకు జీవితాన్ని ఎన్ని వంకర్లోతిప్పి బాధపడతారు. కోర్కెలు ఎంతతక్కువగాఉంటే అంత గౌరవ నీయుడూ పవిత్రుడూను. ప్రస్తుత ప్రపంచంలో. అందరూ కోర్కెల్ని రేకెత్తించు కొనేవారే ! కాని కోర్కె కలిగిందని ఇతరులకి తెలీటం భరించలేరు. సహజమైన యవ్వాలని కప్పుచ్చే ఈ దొంగవేషాలు, వెకిలితనాలు తుడుచుకుపోవాలి. సృష్టి కార్యంలో ప్రతియువకుడూ 'స్వయం ఇన్‌స్పైర్' కావాలి; భావిసంతతియొక్క పురోభివృద్ధి వారిచేతుల్లో ఉందని గ్రహించాలి. 'సెక్సు' నీచమని బోధించటం కాదు—దాన్ని దుర్వినియోగం చేయవద్దని బోధించాలి. అపవిత్రకార్యాన్ని నిర్భంధించి, ఖండించి, శాశించడం అమానుషం !

గా. వెంక : కాని ఇంకాకొంచెం ముందుకువెళ్ళాలేమో ! ఈరోగంఎక్కడ పుట్టిందో అక్కడే మనం 'ఆపరేట్' చేస్తే తీరిపోతుందిగా ! వ్యభిచారాన్ని నిర్మూలిద్దాం. సాంఘికజీవితాన్నే విషపూరితంచేస్తున్న ఇలాంటి వేరుపురుగుల్ని—పడుపుకత్తెల్ని మనంపూర్తిగా ఏరిఅచి వేద్దాం.

డాక్టర్ : కాని మరచిపోతున్నారు—ముందు వాళ్లనేమనం విషపూరితం చేశాం, పాపం ఆలాంటిదాన్ని మీకొకామెను చూపిస్తాను. కొంచెం మోటుగా మాట్లాడినా తమరు బాధపడకండి ! ఆమె 'వేనిటీ' మీద 'ప్లే' చేసి ఆమెచేత అంతాచెప్పిస్తాను. పెద్ద సినిమాస్టార్ అవ్వాలని ఆమెకోర్కె. [తలుపు తెరుస్తాడు. ఇరవైఏళ్ల చక్కని యువతి ప్రవేశిస్తుంది. చలాకీగా సరదాగా ఉంటుంది.] ఊఁ రాలోపలికి. ఏం, ఎలా ఉన్నావ్ ? [సమాధానానికి ఆగకుండానే] సినిమాలో చేరాలని ఇంకా ఉందా ?

యువతి : ఎందుకుండదూ ?

డాక్టర్ : ఐతే—వీరికొక స్నేహితుడున్నాడు-ఒకడైరక్టర్. నీకోఉత్తరం వ్రాసిస్తారు-ఏం ?

యువతి : ఓ - అలాగే! కాని వారు నాయోగ్యతా ప్రవర్తనల గురించి అడిగేరా. బైటకు దూకేస్తా !

డాక్టర్ : అడగరులే! వీరితో నీగురించి అంతాచెప్పు. నీవు చెయ్యదలచుకొన్నదీ, ఇంత వరకూ ఏంచేసిందీ వీరితో కొంచెం మాట్లాడు!

యువతి : మాతలిదండ్రులు మంచిస్థితిలో ఉండేవారు, నన్నొకహైస్కూలుకి పంపిందారు....

డాక్టర్ : [అడ్డువస్తూ] ఆచెత్తంతా చెప్పక్కర్లేదు. ఒక్కమాటకూడా నమ్మరాయన

యువతి : ఓహో! నిజమంతా చెప్పానా—చచ్చాననన్నమాటే!

డాక్టర్ : ఫరవాలేదు! వారేమీ అనుకోరు. ఊఁ, తరువాత మద్రాసు వచ్చావు....

యువతి : ఔను.

డాక్టర్ : దాసీగా ఒక పెద్దవారింట్లో కుదిరావు.

యువతి : ఊఁ!

డాక్టర్ : అపుడు నీకెంతవయసు?

యువతి : అపుడే పదిహేడు వెళ్ళాయి.

డాక్టర్ : అపుడు నీకొక కొడుకుపుట్టేడు కదూ?

యువతి : [ఆప్రశ్నకు ఆశ్చర్యపోతూ] ఔను—మరుసటి సంవత్సరం!

డాక్టర్ : ఆపిల్లవాడి తండ్రెవరు?

యువతి : [సాధారణమైన విషయంలాగే] ఏం, ఇంటి యజమానే!

డాక్టర్ : ఊఁ, చెప్పు! యజమానురాలికి తెలిసింది. అపుడేంజరిగింది?

యువతి : [అదేధోరణిలో] నన్నుబైటకు తరిమేసింది. దానిస్థానంలో నేనేఉంటే దాన్ని గెంటించేద్దును. [ఆగుతుంది]

డాక్టర్ : చెప్పు, ఎందుకు ఆగావు? చెప్పేసేయ్. వీరిది పల్లెటూరు—ఇలాంటివేమీ అర్థం కావు.

యువతి : [కులాసాగా] అలాగే—అంతాచెప్పేస్తాను. ఒకరాత్రి అంతా పడుకొన్నతరువాత యజమాని మెల్లగావచ్చి నాపక్కలో చేరాడు; నేను కంగారుపడి లేచాను. 'నోరెత్తేవా, అవతలికి తోలేస్తా' నన్నాడు. నేనేమీ మాట్లాడలేక పోయాను. తరువాత నన్ను.... [వివరాలన్నీ చెప్పడానికి అనుమానిస్తుంది.]

డాక్టర్ : [వెంటనేఆపి] ఆగాగు! ఆల్‌రైట్! నీపని పోయిన దగ్గరనుంచి మొదలుపెట్టు.

యువతి : ఇదంతా తమాషాగా ఉందను కొంటున్నారేమో వీరు....

డాక్టర్ : ఫరవాలేదు. ఇప్పుడేం చేస్తున్నావో వీరికోచెప్పు!

యువతి : మీహాస్పటల్‌కి వస్తున్నాగా ప్రతిరోజూ?

డాక్టర్ : కాదు - నీవు హాస్పటల్‌కి రాకముందు?

యువతి : రోజుకి ఐదుగంటలూ వీధుల్లోనే....

డాక్టర్ : ఔననుకో ఏంజరుగుతుంటుందో చెప్పువీరికి. ఈయంది పల్లెటూరు—అన్నీ తెలుసుకోవాలను కొంటున్నారు. చెప్పు....

యువతి : ఇవన్నీ తెలియందెవరికండీ / ఏబస్‌స్టాండ్ దగ్గరో ఆగుతాను ఎవరికోసమో చూస్తున్నట్టు, ఎక్కడికో వెళ్ళాలన్నట్టు లేక ఏషాపుదగ్గరో ఏదోకొన్నట్టు. రైల్వేస్టేషన్‌లో ఎవరినో 'రిసీవ్' చేసుకోవడానికి వచ్చినట్టు రైలంతా వెదికేస్తాను. 'రిఫ్రెషింగ్ రూమ్స్' ఒక్కసారి అన్నీ పరీక్షించేస్తాను. ఇవన్నీ మాటులన్నమాట ఎవడోఒకడువచ్చి పడతాడు. నాతో ఏం మాట్లాడాలో వాళ్ళకెవరూ చెప్పక్కర్లేదు. అందరికీ అలవాటే. వాళ్ళవేవి రెండేమాటలు—'చాలాజోరుగా నడుస్తున్నావే' అనో లేక 'ఒంటరిగా వెళుతున్నావ్- భయంలేదూ ?' అనో అంటారు. వాటిఅర్థం ఏమిటో అందరికీతెలుసు. ఒంటరిగా నడచి వెళ్లిపోతుంటే ఒకపెద్దమనిషి కారులో వెనకాలే వచ్చి 'లిఫ్ట్' ఇమ్మంటావా ? అని అడుగుతాడు. దాని అర్థంకూడా తెలుసు - ఏబీచ్‌కో, లేక ఏమారుమూల రెస్టరెంటుకో అని. కొంచెం ఖరీదైనవేట ఇంకోటుంది. కాలేజీ గర్ల్‌లా తయారై చేతిలో పుస్తకాలతో ఏ 'బసోటా'కో వెళతాను, ఎవరినో వెదుకుతున్నట్టు. రకరకాల వ్యక్తులు తాగుతూ, తింటూ కూర్చుంటారు. ఎవడైతే కొంచెం సరదాగా నాకేసిచూస్తాడో వాడివద్దకేవెళ్ళి అతినాజూగ్గా చెంపమీద వేళ్ళతో తట్టి పక్కనే కూర్చుంటాను. కొత్తవాడైతే ఖంగారు పడతాడు. అన్నీమనమే చెప్పాలి. పాతవాడికి అంతాతెలుసు. అక్కడనుంచి నేనే ఆర్డరు ఇస్తుంటాను, తరువాత అంతా సెటిల్ అవుతుంది — టేక్సీవస్తుంది, ఏహోటల్ గదులు ఖాళీగా ఉన్నయోచూద్దం—మిష్టరూ. మిస్సెస్సూ....అంతే !

డాక్టర్ : ఎలాంటివాళ్ళు వీళ్ళంతా ? టేక్సీ డ్రైవర్లు, షాప్ గుమస్తాలు....

యువతి : కాదండోయ్ / చాలాపెద్దమనుషులే

డాక్టర్ : ఔను—అలాగే అంటారు.

యువతి : పెద్దపెద్దసూట్లు వేసుకొని — కాలేజీస్టూడెంట్లూ, ఆఫీసర్లు, క్లబ్ శెక్రిటరీలు టెన్నీసు ఆటగాళ్ళు—ఎందరెందరో నన్ను తీసుకు పోతుంటారు, కేన్ మెరాలు, శేసినోలు, బీచిలు, బోటుషెర్లు—అబ్బో, నేను వెళ్ళందేముంది, చూడందేముంది? ఒకోసారి ఐదారుగురు స్నేహితులు, పెద్దమనుషులు, ఆఫీసర్లు కలిసి నన్నుతీసుకు పోతుంటారు—ఏదో కాంప్ వంకపెట్టి ఏటాత్రివలర్సు బంగాళాకో — ఏ ఎక్స్‌కర్షన్‌కో. ఇంకచూచుకొండి—వాళ్ళందరికీ సమాధానం చెపుతూండాలి. వాళ్లమధ్య కూర్చోబెట్టుకొని....క్రిమంతప్పి వాళ్లవాంఛలు తీర్చుకొనేందుకు తగిన విరామం కల్పించుకొంటారు. నాముద్దులతో వాళ్ళ చిరాకుల్ని తుడిచివెయ్యాలి, నానేర్పుతో. చమత్కారంతో వాళ్ళకోర్కెల్ని రేపాలి. తరువాత నరాలకు చల్లదనం కల్పించాలి

డాక్టర్ : ఔను—అదంతా తెలుసులే. నీకొడుకుగురించి చెప్పు. ఏమయింది తరువాత?

యువతి : కన్నచోటే ట్రిప్లికేన్‌లో వదిలేశాను.

డాక్టర్ : [వెంకటాత్రిమయ్యతో] గోషాహాస్పటల్‌లో....?

గొ. వెంక : అలా వాదిలెయ్యటానికి నీకు చేతులెలావచ్చినయ్?
యువతి : నావీపు మీద వేసుకొని వాణ్ణికూడా తిప్పి ఆకలితో మాడ్చి చంపమంటారా ?
గొ. వెంక. ఏమైనా నీకొడుకేకదూ ?
యువతి : ఐతే వాడితండ్రి సంగతి ? అతనికొడుకు కూడాను, కాదా ? చూడండి ! ఇంకీవిషయం వదిలేసి—మీ రిద్దరూ చెప్పండి. ఆపరిస్థితిలో నేను చేసేదేమిటో ? ఒకనర్సుకి అప్పజెప్పమంటారా ? అలానేచేద్దును — చేతినిండా డబ్బుంటే ! ఇంకోచోటకు పని కోసం వెళ్ళాలను కొన్నాను. కాని అక్కడిచ్చే దాసీజీతంతో నర్సునీ, పిల్లవాణ్ణీ ఎలా పోషించగలనో చెప్పండి ! నీతిగా బతకాలంటే—ఆపిల్లవాణ్ణి నాదగ్గరే ఎలాఉంచుకోగలను ?
గొ. వెంక , దారుణం !

[వెంకట్రామయ్యను ఆగమన్నట్టు డాక్టర్ చెయ్యి ఎత్తుతాడు]

యువతి : [మంటగా] నిజం చెపుతున్నాను, అంతకంటే నేనింక ఏంచెయ్యగలను ? మీరేనాపరిస్థితిలోఉంటే—మీరుకూడా అంతేచేసేవారు. [తగ్గుతూ] ఇవన్నీ దాచుకొంటే వచ్చేదేమిటి ? 'నువ్వునీచంగా బతుకుతున్నావ్' అంటారుమీరు. ఇంకేముంది, అంతకంటేవేరే దారేది ? ఎందుకో పనిచేస్తున్న ఒక్కచోటా ఉండలేకపోయాను. ఆకలేస్తుంటే ఎవరైనా భోజనం పెడతా రమ్మంటే — అక్కర్లేదని ఎవత్తె వద్దంటుందో ఏదీ చూస్తాను ?—ఒకసారి నాకు జ్వరంవస్తే ఒకహోటల్‌లో ఉండిపోవలసివచ్చింది వారంరోజులు. ఇంకచూసుకోండి—పంచకట్లు, గూడకట్లు సూట్లు, ఒకటేమిటి—నన్ను వేపుకుతిన్నాయ్. జబ్బుతో ఉన్నానని ఒక్కడికీ జాలిలేదు. మందిప్పించాలని ఒక్కడికీ తోచదు. వెధవలు, చచ్చువెధవలు, కులుకుతూ వచ్చి వాళ్ళ కుళ్ళుజబ్బులన్నీ అంటిస్తారు. ఏం, అలాంటి కుక్కల్ని ఎందుకు జైళ్ళలో పెట్టకూడదు ? గవర్నమెంటు ఏంచేస్తోంది ? మేంలోకువ యీ పోలీసు వాళ్లకు.
డాక్టర్ : నీవేంపుచ్చుకొన్నావో దానికి నాల్గురెట్లు ఎక్కువగానే ఇచ్చావ్ వాళ్ళకు, ఔనా ?
యువతి : [కులాసాగా] ఐనా నా నడుం ఏమీజారిపోలేదులెండి [వెంకట్రామయ్యగారితో] మీకుఇంకా పూర్తిగా వినాలని ఉందనుకొంటాను [ఆగి] కొంచెం తేరుకొన్నతరువాత ఆహోటల్‌లోంచి నన్ను పంపించివేశారు. జోరుగా నడిచి వెళ్ళిపోతున్నాను. రోడ్డు మీద నాఎదుట ఎవరుకన్పించారో తెలుసా ? నా పాతయజమాని ! సంతోషంతో అతన్ని చూచాను. లోపలనుకొన్నాను—'రా, చిట్టినాన్నా ! నాకు బాకీఉన్నదంతా పడ్డీతోసహా ఇచ్చేద్దువుగాని' అని. తమాషాగా నవ్వుతూ కన్నుకొట్టాను. పడిపోయాడంటారా ? క్షణంపట్టలేదు. [దీనంగా] అతను దులుపుకు వెళ్ళిపోయింతరువాత

ఇంక నాకేమయిందో తెలీదు; మతిపోయిందేమో అనుకొన్నాను. కనిపించిన ప్రతీ వాడినీ రమ్మన్నాను—డబ్బిచ్చినా ఇక్వకపోయినాసరే! అందగాళ్ళు యువకులు, మెడికల్ స్టూడెంట్లు....నాకిచ్చినదానికి రెండురెట్లు ఎక్కువేఇచ్చాను. అసహ్యించుకొని నామీద ఉమ్మిఉేసేవాళ్ళ పతివ్రతలూ, పిల్లలూ యుగాలవరకూ పురుగులుపట్టి శిథిలమై పోయేట్టు ఆజబ్బులన్నీ వాళ్ళకే ప్రసాదించి నాకసిఅంతా తీర్చుకొన్నాను. ప్రేమ మొదటేలేదు — ఈద్వేషాన్నైనా కటాక్షించిందివిధి. [ఆగింది] ఇంకేఆశలూ మిగల్లేదు; నేనేమైపోతేనేం, అనుకొన్నాను తరువాత. దేనికీ లెక్కలేక పోయింది. ఎందుకు ముఖంముడుచుకోవాలి? అంతాఒక్కసారి తలుచుకొంటే నవ్వొస్తుంది. తిరిగి గౌరవంగా ఎలా బతుకుతాను? నీచవృత్తితో కుంగిపోయి మంచిజీవితం ఎలాజీవించగలను? అలవాటైపోయింది—ఈజీవితం! సంఘజీవనంలో అడుగుపెట్టడానికి నాకుఅధికారం ఏదీ? జన్మెత్తినందుకు కొంచెమైనా — ఒక్కరాత్రైనా ఒక్కగంటైనా ఆదరం పొందగలిగానంటే, నాకున్న ఒక్క అవకాశం—ఈశరీరం నేనేకాదు — ఇలా బతికేవాళ్ళు చాలామందున్నారిక్కడ! ఏం, ఎందుకు చేస్తున్నారిలా? బతకాలి — బతకాలనే కోర్కె — ఊపిరిపీల్చుకోవాలనే కోర్కె — బతకాలి — పొట్టకోసం, తిండికోసం! జబ్బుగాఉన్నా—ఆకలితోమాడి చచ్చిపోతున్నా—బతకాలి కాబట్టి! [ఆగి] ఎందుకీ బొ్రితల్ఏక్టులు? ఏఆఫీసరైనా మాదగ్గరికి రాకుండా ఉన్నాడు గనకనా? ఔను—నీతిగానే బతుకుతాం. ఈవృత్తి మానేస్తాం. ఏదీ, మాకువేరేదారి చూపించమనండి గవర్నమెంటుని! తిండీబట్టా ఇవ్వమనండీ! ఈనీచవృత్తిలో ఇంకెందరు ఉంటారో చూస్తాను! మదమెక్కి, కావ్వేకిక్కూర్చోలేదిలా విటులకోసం! మాకు సరదా అనుకొన్నారా—ఈకుళ్ళుజబ్బులన్నీ అంటించుకోటం! సంస్కర్తలు బైలుదేరి మమ్మల్ని ఉద్ధరించాలని ఏవేవో ఏక్టులు పెట్టమంటారు; పెళ్ళిళ్ళు చేసుకోమంటారు: ఒక్కడితోనే ఉండిపొమ్మంటారు. నిజంగా పెళ్ళిచేసుకోవాలనే ఉంది. ఒక్కడితోనే ఉండిపోవాలనే ఉందినాకు. రమ్మనండి, ఆపెళ్ళిచేసుకొనే సంస్కర్తని!

**డాక్టర్** : ఇంతమంది వస్తుంటారే, ఏమైనా గడించావా?

**యువతి** : [నవ్వి] ఇదిగో—చూడండి! ఈగిల్టుగాజులు నాల్గు రూపాయిలరకం; ఈఇమిటేషన్ హారం ఆరురూపాయిలరకం; ఈఉంగరం, గాజురాయి. తెలివైన వ్యాపారస్తుడెవడైనా ఈవిషయాల్లో సంబంధం పెట్టుకొంటే—నాగుండెలమీద ఐదురూపాయిలని గుర్తువేసి ఉండేవాడు. (ఆగి నవ్వుతుంది) ఎందుకులెండి ఇవన్నీ! నాపేరు

ఆడైరెక్టర్‌గారితో చెపుతారా? డాక్టర్‌గారు ఇస్తారు నాఎడ్రెసు.

గౌ. వెంక : తప్పకుండా !

యువతి : నమస్కారం—రేపువస్తాను డాక్టర్‌గారూ!


[వెళ్ళిపోతుంది.]

డాక్టర్ : ఆఖరువరకూ ఆమెజీవితం చెప్పించటం అనవసర మంటారా ? చూడండి ఆమెబతుకు! ఏకారణాలవల్ల, ఏపరిస్థితుల్లో అలాతయారౌతున్నారో ఆలోచించండి! మనసమస్యఅంతా ఆస్త్రీలోనే ఇమిడిఉంది. ఈమెఒక ఉదాహరణ ! ఈవ్యాధి అంతటికీ కారణం ఈవిపరీతాలన్నింటికీ మూలం ఈస్త్రీయే! (వెంకట్రామయ్యగారు లేస్తారు. డాక్టర్ ద్వారంవరకూ వెళతాడు — నమస్కారంచేస్తూ ఆజోడించిన చేతులు అలానేఉంచి) ఇంతకంటే తమకు చెప్పేదేమీలేదు. రేపుతమరు 'కౌన్సిల్' లో కూర్చోబోయేముందు తమరు విన్నదీ కన్నదీ ఒక్కసారి దీర్ఘంగా, నిజంగా, బలంగా ఆలోచించు కొంటే—మనశ్రమంతా వృధాచేశామనుకోను.

(తె ర)



# తల్లి-పిల్లా



రచన : డాక్టరు. బెంజిమన్ స్పోక్.

బిడ్డల్లో బొటనవేలు చీకటాన్ని మనం సర్వసాధారణంగా చూస్తూనే వుంటాం. దీనివిషయమై శాస్త్రజ్ఞులందరూ ఏకాభిప్రాయానికి రాలేదు. కొంతమంది ఇదిదురలవాటన్నారు; మరికొంతమంది కాదన్నారు. ఏమైనా బిడ్డ మొదట్లో బొటనవేలు చీకటానికి ప్రయత్నించినప్పుడు తల్లి వాణ్ని ఆ అలవాటుకు గురికాకుండా వుంచేందుకుగాను శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తుంది.

ఇది మొదట్లో ఒక దురలవాటని చెప్పలేము. బిడ్డ ఆహారాన్ని తీసుకోవటానికీ చీకటానికీ ఎంతో దగ్గరి సంబంధంవుంది. ఆ చీకే ప్రకృతిసహజమైన వాడివాంఛ ఆహారాన్ని తీసుకున్నా తృప్తిచెందకపోవటం వల్లనే బొటనవేలిని చీకటంద్వారా వాడుతృప్తి చెందుతున్నాడని కొంతమంది అభిప్రాయం.

దీనివిషయంలో పరిశోధనలు చేసిన డాక్టర్ డేవిడ్ లెవీఅనే ఆయన— ప్రతి 4 గం. కూ పాలుతాగే అలవాటున్న బిడ్డలకన్న, ప్రతి 3 గం. కూ పాలుతాగే అలవాటున్న బిడ్డల్లో బొటనవేలు చీకటం తక్కువగా వుంటుందని నిర్ధారణగా తేల్చాడు. పాలపీక రంధ్రాలు పెద్దవిగా వుండటంవల్ల 10 నిమిషాల్లోనే పాలు పీల్చేసుకునేబిడ్డ, పాలపీక రంధ్రాలు సన్నగావుండటంవల్ల 20 నిమిషాలసేపు పాలుపీల్చేబిడ్డకన్న, ఎక్కువగా బొటనవేలు చీకటానికి గురవుతాడు. తల్లి రొమ్ములనుంచి పాలుతీసుకోకుండా, వేరే బొట్లనుకార్చే యంత్రంతో కొన్నికుక్కపిల్లలకు పాలు ఆహారంగా ఇవ్వబడినప్పుడు, అవి తమ పాదాలనూ, పక్కనున్న ఇతర కుక్కపిల్లల పాదాలనూ, చర్మాన్నీ ఎంతో

బలంతో గాయమయ్యేట్టుగా సాకటం సాగించినవి. వీటినిబట్టి ఆహారం చాలక పోవటంవల్లనే బొటనవేలు చీకటానికి బిడ్డ అలవాటవుతాడనేది నమ్మదగ్గ కారణం కాదు. ఆహారంచాలినా దాన్ని పొందేప్పుడు వాడి ప్రకృతిసహజమైన చీకే వాంఛకు పూర్తిగా తృప్తి కావలసివుంటుంది. ఇదిగాక, బిడ్డను ఆడించేవాళ్ళు లేకున్నా, బిడ్డదృష్టి మరిదేనిమీదా లగ్నంగాక, తనకుతానుగానే కాలం వెళ్ళ బుచ్చవలసి వుంటే, దానికి బొటనవేలు చీకి ఒకరకంగా కాలక్షేపం చేయటం కూడా ఒక కారణంగానే ఒప్పుకోవాల్సి వుంటుంది.

బిడ్డ బొటనవేలు చీకటం మొదలెడితే, వాణ్ని ఆపేందుకు ప్రయత్నించటం కన్న, తల్లిరొమ్ముల దగ్గరకానీ, పాలబుడ్డిదగ్గరకానీ వాడు చీకే ప్రకృతిసహజమైన వాంఛ చల్లారే అవకాశాన్ని కలగజెయ్యటం మంచిపద్ధతి. ఇక్కడ రెండు ముఖ్యవిషయాల్ని గుర్తించాలి—ఒకటి : బిడ్డరోజుకు ఎన్నిసార్లు ఆహారాన్ని తీసుకుంటున్నాడనేది; రెండు : ఒక్కోసారి ఎంతసేపు ఆహారాన్ని తీసుకుంటున్నాడనేది.

బొటనవేలు చీకేవిషయంలో తల్లిదండ్రులు ఎప్పుడు జాగర్త వహించాలనే ప్రశ్నవొస్తుంది. బిడ్డ దానికి ప్రయత్నిస్తున్నప్పుడే, ఏదన్నా ప్రక్రియ ఆలోచించాలికాని, బిడ్డ ప్రయత్నించి సాధించిన తరువాతమాత్రంకాదు. ఇక్కడ ఇంకోముఖ్యవిషయం చెప్పవలసివుంది. మొదటి నెలల్లోబిడ్డ తాలూకు కాళ్ళూ, చేతులూ వాడి స్వాధీనంలో వుండవు. బొటనవేలుచీకే ప్రయత్నంలో బిడ్డ మోచేతిని పైకిఎత్తటానికి ప్రయత్నిస్తూ, తనకు అందుబాటులోలేని దేని కోసమో తడవటం గమనించదగ్గ సామాన్యసంఘటన. అదృష్టవశాత్తు ముంజేయి వాడికి చిక్కినట్టయితే, అది అందుబాటులో వున్నంతసేపూ దాన్ని చీకుతాడు. ఇలాటి సంఘటనలోకూడా, బొటనవేలు చీకేందుకు అలవాటుపడ్డ బిడ్డవలెనే వీడికీ చీకే సహజవాంఛ, పాలుతాగే సమయంలో తీరవలసిన అవసరం వొకటి వుందని తల్లి గ్రహించాలి.

బిడ్డచాలా చిన్నవయస్సులో వున్నప్పుడే ఎక్కువ జాగ్రత అవసరం. మొదటినుంచికూడా వాడి చీకే వాంఛతీరుతున్నట్టయితే, వేలుచీకటం అనే అలవాటునుంచి తప్పించుకోవచ్చు. యీ సహజవాంఛ మొదటి 6నెల్లలోనూ మరీ ఎక్కువగా వుంటుంది: ఆతరువాత క్రమంగా తగ్గుమొహం పడుతుంది. అందుకనే కొంతమంది బిడ్డలు 8 నెలల వరకూ చీకటాన్ని వొదలలేరు; మరికొంత మంది బిడ్డలకు యీ అలవాటు సంవత్సరంవరకూ వుంటుంది.

అందరు బిడ్డల్లోనూ యీవాంఛ తాలూకు తీవ్రత ఒకేవిధంగా వుంటుందని చెప్పలేము. ఒకోబిడ్డ పాలుతాగటానికి 15 నిమిషాలు తీసుకొని, ఒక్కసారికూడా, బొటనవేలిని నోటిదాకా తీసుకొని రాకుండానూ ఉండొచ్చు;

ఇంకో బిడ్డ పాలుతాగేందుకు 20 నిమిషాలు తీసుకొనికూడా, బొటనవేలు చీకే వాంఛను, విపరీతంగా ప్రదర్శించనూవొచ్చు. యీ బొటనవేలు చీకేవాంఛ తీవ్రత ఆయాకుటుంబాల తాలూకు వంశపారంపర్యతలమీద ఆధారపడి వుంటుందని, కొంతమంది శాస్త్రజ్ఞులనమ్మకం.

ఆహారం తీసుకునేముందు కొద్ది నిమిషాల పాటు బొటనవేలు చీకినట్లయితే దాన్నిగూర్చి ఎక్కువగా పట్టించుకోనక్కర్లేదు. వాడికి ఆకలైనందువల్లనే యీ పనిచేసి తనఅవసరాన్ని తెలియపరుస్తున్నాడని అర్థం చేసుకోవాల్సి వుంటుంది. పాలుతాగాక కానీ, తాగుతూ కానీ బొటనవేలు చీకటాన్ని విశేషంగా ప్రయోగించే బిడ్డ విషయంలోనే ఎక్కువశ్రద్ధ తీసుకోవాల్సి వుంటుంది. చాలామంది పిల్లల్లో యీ అలవాటు 3 నెలల వయసు రాకపూర్వమే బయలుదేరుతుంది.

వేలుచీకటం, లేదా ముంజేతిని చీకటం, నమలటం—సర్వసామాన్యంగా 3, 4 నెలల మధ్య బిడ్డదంతాలను పెంచుకోవటం ప్రారంభమైన దశలో జరుగుతుంది; కనుక బొటనవేలు చీకటానికి పైవాటితో సంబంధంలేదు. అంతకు క్రితమే బొటనవేలు చీకేందుకు అలవాటైన బిడ్డ, దంతాలు వొచ్చేసమయానికి, బొటనవేలిని ఒకసారి చీకటం, ఇంకోసారి నమలటం చేస్తూంటాడు.

పోతపాలమీద పెరిగేబిడ్డకన్న, తల్లిపాలమీద పెరిగేబిడ్డలో బొటనవేలు చీకటం తక్కువ. దీనికి కారణం లేకపోలేదు. బిడ్డకు ఇష్టమైనంతసేపూ తల్లి రొమ్మును కుడవనిస్తుంది. తన రొమ్ములో పాలులేవనే సంగతి ఆమెకు తెలియదు కనుక ఆవిషయాన్ని బిడ్డకే వొదిలేస్తుంది. కాని పోతపాలమీద పెరిగేబిడ్డ విషయంలో—పాలబుడ్డిలోని పాలుఐపోగానే తల్లిబుడ్డిని లాగిపారేయటం జరుగుతుంది; అంతేగాక, వొట్టిగాలిని పీల్చటం బిడ్డకు ఇష్టంవుండదు. కనుక వాడే ఆగిపోతాడు. అందుకని తల్లిపాలమీద పెరిగేబిడ్డతాలుకు చీకేవాంఛ తృప్తి చెందే అవకాశం ఎక్కువగా వుంటుందని మనం నమ్మవొచ్చు.

ఐతే తల్లిపాలమీద పెరిగేబిడ్డ, బొటనవేలు చీకినట్లయితే వెంటనే ఒక ప్రశ్న బయలుదేరుతుంది; వాడికి అవకాశం ఇచ్చినట్లయితే; మరింతసేపు పాలు తాగేవాడా? అందుకని వాడికి ఇష్టమైనంతసేపూ—40 నిమిషాలవరకూ వాడికి రొమ్మును వొదిలేసి చూడొచ్చు; యీ పద్ధతిలో వాడు అజీర్ణాన్ని నిరూపించక పోయినట్లయితే, మరేమీ ఇబ్బందిలేదు. నిజానికి మొదటి 5,6 నిమిషాల్లోనే బిడ్డ తనకు కావలసిన పాలను తల్లిరొమ్మునుంచి తీసుకోవటం జరుగుతుంది. మిగతా కాలమంతా బహుకొద్దిపాలు వొస్తున్నప్పటికీ, దానిద్వారా వాడిఆకలి తీరటం గాక, చీకేవాడి స్వభావసిద్ధమైన వాంఛ తృప్తిచెందుతుంది.

ఒకో సమయంలో వాడుఎక్కువసేపు రొమ్మును అంటిపెట్టుకొని వుండటం ఇంకోసారి తక్కువ కాలంలోనే రొమ్ముదగ్గర తృప్తిచెందటం జరుగుతుంది.

ఉదాహరణకు ఒక్కోసారి 10 నిమిషాలు రొమ్ముదగ్గర వుండి, వాడుఇక అయిష్టత కనబరచటం, ఇంకోసారి 40 నిమిషాలదాకా రొమ్ముదగ్గర వుంటేనేకాని వాడికి తృప్తికలగక పోవటం జరుగుతుంది. రెండింటా వాడిఆకలి తీరినప్పటికీ, వాడి చీకేవాంఛ తృప్తిచెందక పోవటంవల్లనే యీకాలంలో ఇంత పెద్దభేదం కనిపిస్తుంది. అదీగాక యీవాంఛ తీవ్రత ఒకేబిడ్డలో, అన్నిసమయాల్లోనూ ఒకే మాదిరిగా వుంటుందని కూడాచెప్పలేము. ఇలాటి ఇబ్బందుల్ని గడిచే అవకాశం ఎక్కువగా తల్లిపాలమీద పెరిగేబిడ్డలకే వుంటుంది.

ఒకోసారి ఒక్కరొమ్ముద్వారానే బిడ్డఆహారం తీసుకోవటం సాధారణంగా జరుగుతుంది. ఆ ఒక్క రొమ్ముమీదా తనకు కావలసినంతసేపూ వుండికూడా, బొటనవేలుచీకే బిడ్డవిషయంలో చేయగలిగిందేమీ లేదు.

ప్రతిసారీ రెండు రొమ్ములద్వారా తనఆహారాన్ని తీసుకుంటూ కూడా బొటనవేలు చీకేందుకు అలవాటైనబిడ్డ ఒకగడ్డు సమస్యగా తయారౌతాడు. 10 నిమిషాలసేపు ఒకరొమ్ముద్వారా పాలను పీల్చుకొన్నాక, తల్లివాడికి రెండో రొమ్ము ఇచ్చిందనుకుందాం. అప్పుడు నిజంగా జరిగేదేమంటే— మొదటిరొమ్ము నుంచేవాడు తనకుకావలసిన పాలను పీల్చుకున్నాడు; రెండోరొమ్ముకు వెళ్లిన 5 నిమిషాలకల్లా వాడికి ఆహారం ఎక్కడి తొక్కిడవుతుంది. ఆపరిస్థితిల్లో వాడిచీకే వాంఛ తీరకపోయినా, రొమ్మునుంచి విముఖత్వాన్ని ప్రదర్శిస్తాడు. కనుక వాడికి గత్యంతరంలేక బొటనవేలు చీకనారంభిస్తాడు.

ఇలాటి సందర్భంలో రెండువిధాల ప్రక్రియల్ని ప్రయోగించి చూడొచ్చు; ఒకోసారికి ఒక్కరొమ్మే ఇస్తూ, వాడికి కావలసినంతసేపూ దానిమీదనే ఉండ నివ్వటం; యీపద్ధతివల్ల ఒక్కరొమ్మునుంచి వొచ్చేపాలతో వాడిఆకలి తీరక పోయినట్టయితే, చాలా సేపటి వరకూ—ఒక 20 నిమిషాలనుకుందాం— మొదటి రొమ్ముమీదనే వుండనిచ్చి, ఆ తరువాత రెండో రొమ్ముమీదకి తీసుకొని వెళ్లటం. యీపద్ధతివల్ల వాడిఆకలి తీరటంతోపాటు, చీకేవాంఛకూడా తృప్తిపడుతుంది. అంతేగాక వాడికి కావలసిన దానికన్న ఎక్కువ ఆహారం తీసుకోవటం, అజీర్ణానికి గురికావటం జరగదు.

పోతపాలమీద పెరిగేబిడ్డల్లో యీ బొటనవేలు చీకటాన్నిగూర్చి తెలుసుకుందాం; మొదట్లోబిడ్డ 20 నిమిషాలపాటు పాలపీకద్వారా ఆహారాన్ని తీసుకో వాల్సివుంటే, అదేఆహారాన్ని ఏ 10 నిమిషాల్లోనో తీసుకోవటంనేర్చుకున్నప్పుడే, బొటనవేలు చీకటానికి అలవాటవుతాడు. ఇలా జరిగేందుకు కారణం ఏమిటి? బిడ్డ పెరుగుతూన్నకొద్దీ బలవంతుడు కావటం, రోజులు గడిచేకొద్దీ పాలపీక తాలూకు రబ్బరు శక్తిహీనం కావటమూను.

దీనికి ప్రక్రియల్నిగూర్చి ఆలోచిద్దాం. పాత రబ్బర్ పీకల్ని తీసెయ్యటం, కొత్తవి తెచ్చి, పాత వాటివలెనే రంధ్రాల్లో మార్పులేకుండా ప్రయత్నించి చూడాలి. యీపద్ధతివల్ల బలంగావున్న రబ్బర్ పీక, పాలుతాగే కాలాన్ని పొడిగించేందుకు ఉపయోగపడొచ్చు. ఐతే పీకలో, రంధ్రాలు మరీసన్నగావుండటం వల్ల ఇంకో ప్రమాదం వుంది. తనుప్రయత్నించినా తగినన్ని పాలు రాకపోవటం వల్ల విసుగెత్తి కొంతమంది బిడ్డలు, వెంటనే తమ విముఖత్వాన్ని ప్రదర్శించటం జరగొచ్చు. కనుక పాలపీక రంధ్రంద్వారా పాలబుడ్డిలోని పాలు బిడ్డనోటికి వొచ్చేకాలం కనీసం 20 నిమిషాలు వుండేట్టుగా సరిచూసుకోవాల్సి వుంటుం . అంతేగాని, బిడ్డ కొంతసేపు పాలుతాగాక, కొంతసేపుఆగి, ఆతరువాత మళ్ళీ పాల బుడ్డి అందించటం మాత్రం జరగకూడదు. మొదటినుంచీ చివరిదాకా ఒకేధారగా పాలసరఫరా వుండాలి.

బాగా బలంగా పెరిగేబిడ్డ, కొత్తపాలపీక వున్నప్పటికీ, సన్నటి రంధ్రాల ద్వారాకూడా, బలంగా పీల్చటంవల్ల పాలన్నీ 10, 12 నిమిషాల్లోనే పూర్తి అవుతవి. అలాటప్పుడు రంధ్రాలులేని పాలపీకలు తెచ్చి, సన్నటి సూదినికాల్చి మూడింటికి బదులు రెండే రంధ్రాలుచేసి పాలుతాగేకాలాన్ని పొడిగించవలసి వుంటుంది.

బొటనవేలు చీకటమనేది, కేవలం పాలు తాగేకాలం మీదనేగాక, పాలు తాగే సంఖ్యమీదకూడా ఆధారపడివుంటుంది. పైనచెప్పినవిధంగా తల్లిపాల మీద పెరిగేబిడ్డకూ, పోతపాలమీద పెరిగేబిడ్డకూ కూడా—పాలుతాగేకాలాన్ని పొడిగించటంవల్లకూడా, బొటనవేలు చీకేఅలవాటు తప్పనట్టయితే, అప్పుడు పాలుపట్టేసంఖ్యను తగ్గించవలసి వుంటుంది. ఉదాహరణకు 3 నెలలబిడ్డ రాత్రి 10 గం. కు పాలుతాగి హాయిగా నిద్రిస్తున్నట్టు కనిపించినా, బొటనవేలు చీకటంలో తక్కువశ్రద్ధనూ, కోరికనూ కనబరచనట్టయితే, రోజులో వాడికి ఇచ్చే ఆహారం తాలూకుకాలాన్ని పొడిగించి, అంతకుక్రితం 8 సార్లు పాలుఇస్తే ఇప్పుడు 7 సార్లకే తగ్గించి ప్రయత్నించవలసి వుంటుంది.

ఇన్నిచేసినా బొటనవేలు చీకటాన్ని పూర్తిగా వొదలని బిడ్డకూడా ఉండొచ్చు. అంతమాత్రాన తల్లి నిరుత్సాహపడటం, బిడ్డను దూషించటం, విసుగు చెందటం కూడదు. వాడికి బొటనవేలు చీకే అలవాటును పూర్తిగా తొలగించలేకపోయినా, బొటనవేలు చీకవలసిన అవసరాన్ని చాలాభాగం తగ్గించటం జరిగింది. అదేజరక్కపోయినట్టయితే చాలాకాలంగా వాడు యీ అలవాటుకు గురయేవాడు; ఆప్రయత్నాలు జరిగినవి కనుక, చాలాతక్కువ కాలంలోనే వాడా అలవాటును వొదిలించుకోగలుగుతాడు. అంతేకాని వాణ్ణి బలవంతాన ఆపేం

దుకు ప్రయత్నించరాదు. ఇంకేవిధంగానూ చీకే వాడివాంఛతీరనప్పుడు, అది బొటనవేలుచీకటం ద్వారానన్నా సరే తృప్తిచెందవలసి వుంటుంది. యీ పద్ధతి వల్ల అతిత్వరిత కాలంలోనే వాడు బొటనవేలు చీకటాన్ని వొదిలించుకోగలుగుతాడు.

బొటనవేలు చీకటంవల్ల, బిడ్డదవడకూ కొత్తగా బయలుదేరే దంతాలకూ ఏమైనా హానికలుగుతుందేమోననే భయం చాలామంది తల్లులకు కలుగుతుంది. యీ విషయంలో దంతశాస్త్రజ్ఞులుకూడా ఇదిమిద్ధంగా ఏమీ చెప్పలేకుండా వున్నారు. కాని వొకటిమాత్రం నిజం; కొత్తగా పళ్లువొస్తూన్న బిడ్డలో—బొటనవేలు చీకేఅలవాటువల్ల, వాడిపైపళ్లు ముందుకు పొడుచుకొని రావటం, కిందిపళ్ళు లోనికి తోసుకొనిపోటం జరగొచ్చు. ఇదిసరిగ్గా ఇలాగే జరుగుతుందా, లేదా ఆనేవిషయం—బొటనవేలు నోటిలోవుండే స్థానాన్నిబట్టి వుంటుంది. మరి కొంతమంది దంతవైద్యులు ఇంకోకొత్త అభిప్రాయంలో వున్నారు; వరుసగా లేని దంతాల్ని బొటనవేలు చీకటంద్వారా బిడ్డ తనంత తానుగానే ఒకవరసలోకి తెచ్చుకుంటాడనీ, అందువల్ల వాడిదవడలకు కానీ, శాశ్విత దంతాలకుకానీ హానిజరగదనీ వారు అంటున్నారు. కనీసం 6-వ సంవత్సర ప్రాంతానికన్నా యీ బొటనవేలు చీకేఅలవాటు వొదులుతే, శాశ్వితదంతాలు అంతగా దెబ్బ తినవు. చాలామంది బిడ్డలకు వంకరగా దంతాలు రావటం నిజమేకాని, అది కేవలం బొటనవేలు చీకటంవల్లనే వొచ్చిందని చెప్పలేము; దానికి కారణాల్లో వంశపారంపర్యత మొదటిదిగా పేర్కోవాల్సి వుంటుంది, వంకరపళ్లున్న పిల్లల్లో నూటికి 25 మంది మాత్రమే బొటనవేలు చీకేఅలవాటును చాలాకాలంగా వొదిలించుకోలేని వారు!

బొటనవేలు దంతాల్ని పాడుచేసినా చేయకపోయినా, బిడ్డను ఆ అలవాటునుంచి ఎంతత్వరగా తప్పించగలుగుతే అంతమంచిది. బలవంతాన వాణ్ని ఆపేందుకు ప్రయత్నించటంకన్న, పాలు తాగేకాలాన్ని పొడిగించి, అదీ చాలక పోతే బొటనవేల్ని చీకనివ్వటమే చాలామంచిపద్ధతి.

చేతుల్ని కట్టివేయటంకానీ, చేతులకు అల్యూమినంతో తయారుచేయబడ్డ తొడుగుల్ని తొడకటంకానీ ఎందుకు చేయరాదని కొంతమందికి సందేహం కలుగవచ్చు. అది వాణ్ని నిరాశతో కూడుకొన్న క్రౌర్యానికి గురిచేస్తుంది. అంతేగాక వాడివాంఛ పోతుందనేనమ్మకంలేదు. వాడికి ఆకలైనట్టయితే, వాడినోటికి ఏడవకుండా ఏదన్నా అడ్డంపెట్టినంతమాత్రాన వాడిఆకలి ఏవిధంగాతీరదో, అదేవిధంగా వాడి యీ సహజవాంఛ బలవంతాన ఆపేందుకు ప్రయత్నించటం మాధ్యం. రోజుల తరబడిగా కాకుండా, నెలల తరబడిగా ఇలాటి కృత్రిమ విధానాల్లో తమబిడ్డలతాలూకు బొటనవేలిని చీకేఅలవాటును అరికట్టేందుకు శ్రమ

పడ్డ తల్లులు అనేకమంది ఇదిబొత్తిగా లాభంలేని పద్ధతని తెలుసుకోగలుగుతారు. ఏ క్షణాన్నయితే బిడ్డచేయి, నోటిదాకా పోకుండా కాపాడే నిర్బంధం తొలగించబడిందో, ఆక్షణానే వాడిచేయి నోటిదాకాపోయి తీరుతుంది.

యీ పద్ధతివల్ల తమబిడ్డల్లో బొటనవేలు చీకే అలవాటును తప్పించగల కేస్‌లు లేకపోలేదు; కాని అవిబహుకొద్ది. ఆబిడ్డలతాలూకు తల్లులు, తమ తెలివితేటలవల్లా, తమయీ కృత్రిమ సాధనాలవల్లా తమబిడ్డల దురలవాటును పారద్రోల గలిగామనుకోవచ్చు. కాని ఇందులోని రహస్యమేమిటంటే — చాలామందిబిడ్డల్లో బొటనవేలు చీకేవాంఛ చాలాబలహీన స్వరూపంలో వుంటుంది. ఆయాతల్లులు, యీ కృత్రిమవిధానాలు ప్రయోగించకపోయినా, అంత కొద్దికాలంలోనే ఆబిడ్డలు యీ అలవాటునుంచి దూసుకునేవారు.

ఇంతవరకూ మనం తెలుసుకున్నదల్లా బిడ్డ మొట్టమొదటి నెలల్లోని బొటనవేలుచీకే అలవాటునుగూర్చి. మరిపెద్దపిల్లల్లోని యీ అలవాటు సంగతేమిటి ? ఏడాదినిండుతూం డేప్పటికి వాడిబొటనవేలు చీకటం వేరొకరూపం దాలుస్తుంది. కొన్నిప్రత్యేక సమయాల్లో యీ బొటనవేలు చీకటంద్వారా వాడుకొంత సుఖాన్ని అనుభవించటం జరుగుతుంది. వాడుఅలసినప్పుడు, కోపంతో బాధపడ్డప్పుడు, విసుగెత్తినప్పుడు, తనకు నిద్రకావలసినప్పుడు బొటనవేలు చీకటాన్ని ఆయాసౌఖ్యాలకు ఉపయోగించుకునేందుకు అలవాటవుతాడు. పెద్దయినా తనుచేయవలసిన పనులువాడికి అసాధ్యంగాకనిపించినప్పుడు, లేక తగిన శిక్షణ లేనప్పుడు—చిన్ననాటి అలవాట్లవైపు మళ్ళుతాడు. చిన్నతనంలో వాడు తనంత తానుగా పొందేసౌఖ్యమల్లా యీ బొటనవేలు చీకటంద్వారానే సాధించి వుండటంవల్ల ఆదేఅలవాటు తిరిగి అంతకన్న తీవ్రతరంగా పునరుద్ధరించ బడుతుంది.

ఏడాదిదాటాక వాడి ఇతర తృప్తులకోసమై యీ బొటనవేలు చీకటం ఉపయోగించి నప్పటికీ, దానికి పునాదల్లా—బిడ్డ చిన్నతనంలోని తనస్వభావసిద్ధమైన యీవాంఛను తీర్చుకునే ఉపాయమేకదా! ఏడాదివరకూ బొటనవేలు చీకటం ఎరగని బిడ్డ, ఏడాదిదాటాక ఆపనిచేయటం బహుఅరుదు.

యీ బొటనవేలు చీకటానికీ వయస్సుకూ సరిగ్గా 'ఇలాటి' సంబంధం వుందని తేల్చిచెప్పటం కష్టం. 1, 2, 3 సం, ల వరకూ కూడా బొటనవేలు చీకే అలవాటున్న బిడ్డలు లేకపోలేదు. వారినిగూర్చి ఆతల్లిదండ్రులే, తమలోతాము సంప్రదించుకొని, వాడికి ఇతరవిధానాల్లో సౌఖ్యాన్ని కలుగజేసే ప్రయత్నాలు చేసి, వాడిమనస్సును ఇతరత్రా తిప్పేందుకు ప్రయత్నించాలి.

వాడికన్న పెద్దపిల్లలఅలవాట్లను నేర్చుకోలేక, వాడువిసుగెత్తుతే, రోజులో కొంతసేపు వాణ్ని వేరేవుంచటం మంచిది. మరికొంతమంది బిడ్డలు, ఎక్కువగా ఇతరపిల్లల్ని భరించలేరు. ఇంకొంతమంది బిడ్డలకు తగినన్ని ఆటవస్తువులు లేక పోవటంవల్ల వారెంతో ఇబ్బందినీ, బాధనూ వ్యక్తపరుస్తారు. 1½ సం. ల వయసున్న బిడ్డవిషయంలో- పూర్వం వలెనే తల్లి వాణ్ని అంటిపెట్టుకొని వుండటం వాడికి ఇష్టంవుండదు; ఎందుకనంటే, వాడుతన ఇష్టప్రకారం కాకుండా, తల్లి ఇష్టప్రకారం ఆడుకోవాల్సిన బాధవుంటుంది కనుక!

ఇతర పిల్లల్తో కలిసి ఆడుకోవటం అలవాటైనా, వాళ్లముందు బొటనవేలు చీకేందుకు వాడుసిగ్గుపడ్డా, జాగర్తగా ఎవరూలేకుండాచూసి, ఆ అలవాటును వాడుకొనసాగిస్తూనే వుంటాడు. యీ వ్యాసం చదవటం తటస్థించిన ప్రతితల్లీ, తండ్రీకూడా—బొటనవేలు చీకే ప్రతీబిడ్డనూ ఒకగడ్డుసమస్యగా తీసుకోనక్కర్లేదు; నిజానికి యీసమస్య అనుకున్నంత క్లిష్టం కాక పోయినప్పటికీ, అనేకమంది బిడ్డల తాలూకు మనస్తత్వాలూ, వారిఅలవాట్లూ వాటిని తప్పించే ఉపాయాలూ ఇక్కడ చెప్పబడుతూన్నవి. అంతేగాక ఎంతోబాగా, తృప్తికరంగా పెరిగేబిడ్డలుకూడా బొటనవేలు చీకేఅలవాటును అప్పుడప్పుడు ప్రదర్శిస్తూనే వుంటారు. వేరేఉపాయాలతో వారిని శ్రమపెట్ట నక్కర్లేదు. ఏదిచేసినప్పటికీ, బొటనవేలు చీకటంద్వారా వాడుపొందే ఆసౌఖ్యాన్ని ఇతరత్రా వాడికి అందించే ప్రయత్నం మాత్రమే చేయవలసి వుంటుంది.

చేతులకు అల్యూమినం తొడుగుల్ని వేయటం, చేతివేళ్లకు వెగటనిపించే పెయింట్లూ మొదలైనవి వేయటంవల్ల పెద్దపిల్లల్లోకూడా బొటన వేలుచీకే అలవాటుపోదు. ఆపనులవల్ల వాడికి బాధకలుగుతుందేకాని, ఆవాంఛ చావక, అవకాశందొరుకుతే రెట్టింపుగా బైటపడేందుకు సిద్ధంగా వుంటుంది. అంతేగాక యీ నిర్బంధాలవల్ల ఆ అలవాటు మరింతకాలం వేళ్లూనే అవకాశం ఏర్పడుతుంది. ఇదే విధంగా, నోటిలోవున్న వాడివేలిని బలవంతాన లాగెయ్యటం, వాణ్ని తిట్టటం, కొట్టటంవల్లకూడా పరిస్థితి మరింతగా విషమిస్తుంది. కనుక వాడికి ఏకొత్త ఆటవస్తువోఇచ్చి, వాడిమనస్సును మళ్లించటంద్వారా యీ అలవాటును దూసుకోవచ్చు.

ఒకొక్క సమయంలో వాడికి లంచమివ్వటంకూడా చేయవలసివుంటుంది. ఏ ఐదోఏటనో వాడి యీ అలవాటు పోకపోవటంవల్ల, వాడిశాశ్వత దంతాలు దెబ్బతింటవేమోననే భయంవున్నట్టయితే, వాడికి తినుబండారాలిచ్చి డబ్బులిచ్చి, ఇతరత్రా లంచాలిచ్చి వాణ్ని ఆఅలవాటునుంచి దూరంచేయవలసివుంటుంది. కాని ఏ 2,3 సం. ల వయసప్పుడో ఇదిసాధ్యంకాదు; ఎందుకనంటే ఒకబహుమతికన్న

వాడి యీ స్వభావసిద్ధమైన వాంఛేఎక్కువ తీవ్రంగా పనిచేస్తుంది. కనుక ఆయా పరిస్థితుల్నిబట్టి ప్రవర్తించవలసివుంటుంది.

బొటనవ్వేలు చీకేఅలవాటున్న బిడ్డల్లో ఇంకోఅలవాటును మనం సామాన్యంగా గమనించవొచ్చు. 1-1½ సం. ల వయసప్పుడు ఆబిడ్డ బొటనవేలును చీకుతూ, పక్కబట్టను చేత్తోరాయటం, లేక పక్కదుప్పటిదారాల్ని పీకటం, చేతికందిన మెత్తని గుడ్డను నలపటం గమనిస్తాం. మరికొంతమంది బిడ్డలు తమ జుట్టులోకి చేతులుపోనిచ్చి జుట్టుమెలితిప్పటం చేస్తుంటారు. ఇంకోబిడ్డ ఏమెత్తని గుడ్డనో మొహంమీద ఉంచుకొని దాన్ని తనముక్కుతోనూ, పెదవులతోనూ తాకేందుకు విశేషంగా ప్రయత్నిస్తాడు. వీటినిబట్టిమనం—ఆబిడ్డచిన్నతనంలో తల్లిరొమ్ములదగ్గరా, పాలబుడ్డిదగ్గరా—పక్కబట్టల మెత్తదనాన్నీ తల్లిశరీరం తాలూకు మెత్తదనాన్నీ స్పర్శద్వారా పొందుతూ 'చీకే' తనఅలవాటును, యథాతథంగా అనుభవించేందుకు ప్రయత్నిస్తున్నాడని, గ్రహించవలసివుంటుంది. యీ పైఅలవాట్లు, బొటనవేలు చీకటం మానటంతోపాటు మాయమౌతవి.

మరికొంతమంది బిడ్డలు బొటనవేలు చీకకపోయినా, తమనాలుకల్ని నోటిలోకి ముడుచుకొని, దాన్నే చీకటంద్వారా తృప్తిని సంపాయిస్తారు. ఇలాటిది ఆవుదూడల్లో చూడనవుతుంది. యీపరిస్థితి వొచ్చేందుకు, పైనమనం పరామర్శించిన కృత్రిమవిధానాలవల్ల—వాడిచేతినికానీ, బొటనవేలినికానీ నోటిదాకా తెచ్చుకునే అవకాశంలేనందువల్ల, తననాలుకను తానే చీకటంద్వారా తృప్తి పొందేందుకు ప్రయత్నించటం జరుగుతుంది. ఇలాటిపరిస్థితుల్లో యీనాలుకచీకటం పూర్తిగా అలవాటుకాక పూర్వమే, బొటనవేలు చీకటానికివాణ్ని అనుమతించటం అన్నివిధాలామేలు. ఎందుకనంటే నాలుకచప్పరించటంకన్న, బొటనవేలు చీకేఅలవాటు త్వరగా వొదులుతుంది.

పైవిధానాల సహాయంతో బిడ్డ బొటనవేలు చీకేఅలవాటుకు గురికాకుండా తల్లి దండ్రులు ప్రయత్నించవలసి వుంటుంది.



# రక్షాబంధం



రచన: జయ

'గాలేనా ?'

'అడగరాదూ ఆంజనేయుణ్ణి.'

'అంత దృష్టమా ?'

'చెబుతాను గదూ? పిలిస్తే ప్రత్యక్షం మనకా అస్ఖలిత బ్రహ్మచారి !'

'ఆఁ.'

'ఖర్చుకు జంకితేకాదు సుమా, ఇంతకూ పనినెరవేరటం ప్రధానంకాని ఓరెండుపచ్చ కాయితాలకు వెనకాడరనుకుంటాను.'

'చిత్తం.'

'రేపురాత్రి సరిగ్గా తొమ్మిదికొట్టే సంకి గుళ్ళోకిరండి. హనుమంతుడికి ఆకుపూజా, పానకం వడపప్పు, కొబ్బరికాయలూ, పట్టు తాబితా.... అబ్బో, చాలా తతంగం వుంది లెండి, మావాణ్ణడగండి.'

'చిత్తం, సెలవు.'

అత్తాకోడళ్లకు ఆత్మీయత అనేది ఎక్కడన్నా వుందంటే అది కోదండరామయ్య విషయంలోనే అనిచెప్పాలి. లక్ష్మీసరస్వతులు అతన్ని అంతగా ఆశ్రయించాయన్నమాట. తాతలనాటి నుంచీ కలిగిన కుటుంబమేమో, సంపదను సద్వినియోగంచేసి తండ్రి కొడుక్కు చదువుబాగాచెప్పించాడు. అదుపాజ్ఞల్లో పెరగటంవల్ల ఆముక్కలు నాలుగూ అతనికిఅంటినై. అనుకోకుండానే ఆరెండక్షరాలూ గవర్నరు చేతిమీదుగా అందుకున్నాడు. భారతదేశంలో అక్షరజ్ఞానం శూన్యమైనా అందానికి అమ్మాయిలు కొరవడి ఉండకపోవటాన ఒక చక్కని చుక్క పదివేల కట్నంతోసహా అతన్ని

వెతుక్కుంటూ వచ్చిందంటే ఆశ్చర్యపడ వలసిన విషయం అవగింజంతన్నా లేదు.

'ఇహ ఏమిటయ్యా కోదండరామయ్యకు తీపు దిగదీస్తా ?' అని మీరడగొచ్చు. ఇదిగో ఇక్కణ్ణే అతనికి గ్రహాలుకొంచెం వక్రించింది. భార్యకాపరానికొచ్చి రొండేళ్లైనా అతను ఆ అమ్మాయితో అంతకలిసికట్టుగా వుండటంలేదనే చెప్పాలిమరి అతని మాటల్నిబట్టి. లోపం ఎవర్లోవుందో బ్రహ్మదేవుడికే తెలియాలి ! పగలల్లా చాలా అన్యోన్యంగానేకనబడేవాళ్ళు. 'అబ్బ' అనుకూలదాంపత్యమంటే అలావుండాలి సుమా అని ముక్కుమీద వేలేసుకున్న వాళ్ళల్లో నేనూ ఒకణ్ణి. చెప్పొద్దూ ? మా యిళ్ళు రొండూ ఎదురు గుమ్మాలేకావటాన ఆ అమ్మాయి తరుచూ మాయింటికి వొస్తూ పోతూవుండేది; అలావచ్చినప్పుడు పిచ్చాపాటీ మాట్లాడు కోటంలో మావాళ్ళతో చెబుతుండేది గూడాట. తనను తన భర్త ఎంతో ప్రేమగా చూస్తాట్ట. ఇరవైనాలుగ్గంటలూ తనచుట్టూ తిరుగుతూనే వుంటాట్ట. తనమాటన్ను సుగ్రీవాజ్ఞగా పాలిస్తాట్ట. తనూ ఆయనమనస్సు కనిపెట్టి సంతోషపరుస్తుంటుందిట. వొట్టుసుమండీ, మా వాళ్ళకూ నాకూ మధ్య అప్పుడప్పుడు వచ్చే ప్రణయ కలహాలు గూడా ఆ అమ్మాయే తీర్చిదిద్దుతుండేది. ఉన్నట్టుండి కోదండ రామయ్య నాతో—నాతోనే ఏమిటి, కనపడ్డ ప్రతివాడితోనూ యిలావెళ్ళబోసు కుంటున్నాడంటే, యెలానమ్మటం ? ఎక్కడో . సీల వొదులైవుండాలనుకున్నాను.

ఉమర్ ఖయ్యాం రుబాయత్తులూ, కాళిదాసు మేఘసందేశం, షేక్స్పియర్ఆంటొనీ అండ్ క్లియోపాత్రా, వెంకటచలంచిత్రాంగి క్షుణ్ణంగా చదివి జీర్ణించుకున్న వ్యక్తి అని చెబితే కోదండరామయ్య మనస్తత్వం కొంత మటుకన్నా బోధపడుతుందను కుంటాను. ఆ అమ్మాయంటారా ఏదోసంసార పక్షం. పెళ్ళనేది పెద్దవాళ్ళఆజ్ఞ నెరవేర్చటానికనీ. నలుగురితోపాటు మర్యాదగా ఓ అయ్యతో కాపరం చెయ్యటం విధిఅనీ అందులో ఎవరి యిష్టాయిష్టాల ప్రసక్తి ఏమీలేదనీ ఏదో ఓ కూనపుడితే యిల్లు నిలుస్తుందనీ అనుకునే మనిషి. ఇలాంటి పరిస్థితుల్లో ఏనాడైనా కోదండరామయ్య బయటపడక తప్పదని నామనసు మటుకు పీకుతూనేవుంది మొదణ్ణించీ.

రానురాను కోదండరామయ్య దిగులు మరీఎక్కువై పోయింది. ఇప్పుడతని ఆలోచన ఇరవైనాలుగ్గంటలూ పెళ్లాన్ని గురించే. ఆదేం ఖర్మమో తన్నుఎప్పుడూ బెరుగ్గానే చూస్తుందిట. బుజ్జగించి పిలిస్తే దగ్గిరికొస్తుందిటగాని పాపం. ఆఅమ్మాయిని ఎదురుగా ఉంచుకుని 'ఆహా! నీమోహం తామర పువ్వుల్ని పరిహసిస్తున్నది. నీకళ్లు నల్లకలవల్ని నాశనం చేస్తున్నై' అని పొగుడుదామని ఎంతో ఉబలాటపడితే, 'చాల్లెండి మీవేళాకోళం. కవిత్వం వప్పజెబుతున్నారు మరీను. నాకళ్ళేం దిష్టికళ్లను కున్నారా వాటినీ వీటినీ నాశనం చెయ్యటానికి ?' అని నవ్వుతూ తుర్రున పరిగెడుతుందిట. అంతేగాని తనమెడచుట్టూ చేతులుమెలేసి తన

కన్నీళ్ళకి గుచ్చుకుపోయేట్టు ఒకనాడన్నా మాట్లాడుట. అతనికిచెప్పరానంత కోపమూ, అసహ్యమూ వస్తున్నై. కాని ఏంచేస్తాడు? అతగాడు మంచివాడు కనుక ఓర్పుతో అలా నెట్టుకొస్తున్నాడు కాలాన్ని—ఒహనాటిగ్గాక పోతే ఒహనాటికన్నా ఆవిడ దోవకు రాక పోతుందాఅన్న ధైర్యంతో....ప్రదక్షిణాలు చేయించాడు, తిరుపతి వెంకటేశ్వరస్వామికి ములుపుదోపు చెల్లించాడు. బెజవాడ కొండ మీది సాధువుదగ్గిర తీర్థం తెచ్చిచ్చాడు. పౌరోహిత్యపు పున్నయ్యకు దంపతిపూజ చేసి దక్షిణ సమర్పించుకున్నాడు. ఎన్ని జేస్తేఏంలాభం? ఉహూ(! ఆ అమ్మాయి ముచ్చటకన్నా ఓమాటు అతని చేతుల్లో వొచ్చివాలందే?

శంకర సరస్వతీ స్వాములవారు లోక కళ్యాణానికై అహోన్నిశం చంపుకున్న రాజ యోగి. పన్నెండేళ్లగా ఉపాసన చేస్తున్నా డేమో, హనుమంతుడు ఆయన కనుసన్న లలో అజస్రమూ మెలుగుతూంటాడు. రాజవైద్యంలో ఆయన తరవాతనే ఎవర్ని చెప్పినా. గాలులున్నా, ధూళులున్నా, దిష్టి దోషాలున్నా ఆయనోమాటు కీర్తిగంట అలా చూచి కుంకం మంత్రించి యిస్తే చాలు. అదేం చిత్రమో యిట్టేమాయమైపోతై. నమ్మిండీ పుచ్చుకోడుగద మళ్ళీ! ఎంతెంత లక్షాధికార్లూవచ్చి పదీ, యిరవై, వందా యివ్వొస్తారా కృతజ్ఞతకొద్దీనీ, ఈ చేత్తో పుచ్చుకుని ఆచేత్తో బీదలకు ఇచ్చేస్తాడంతే. వెంటవచ్చే పూజారి గవరయ్య మాత్రం కానుకలు కాదనలేక పోతున్నాడు హను మంతుడినిత్యనైవేద్యానికీ అన్నదానానికీనని.

స్వాములవారు యోగసమాధిలో వున్నారు. కోదండరామయ్యా ఆయనభార్యా హనుమంతుణ్ణి ఆరాధిస్తున్నారు గవరయ్య మంత్రానికి అనుగుణంగా. చుట్టూజనం కిట కిటలాడుతున్నారు. 'జైహనుమా, జైహనుమా' అనే భజనలతో భూనభోంత రాళాలు దద్దరిల్లి పోతున్నై. ఉన్నట్టుండి గవరయ్య వెర్రికేక పెట్టాడు. గప్చిప్. చీమచిటుక్కుమంటే వినిపించేంత నిశ్శబ్దం. స్వామివారు ప్రబుద్ధులై ఆంజనేయదండకం పఠించి హనుమంతుణ్ణి ఆహ్వానించారు. చిత్రం! అంతమంది జనంలోనించీ ఓకోతి అడ్డంగా పరుగెత్తి స్వామివారికి కుంకపు బరిణ అందించింది! నిలువుగుడ్లడి పోయాయి చూచేవాళ్లకు! అలావుండాలి సత్యమంటే!!! జనమంతా ఒక్కసారిగా ఆంజనేయ విగ్రహం ముందు సాష్టాంగ పడ్డారు. చీకటిబజార్లో దొంగలెక్కలు రాసిన గురవయ్యా, రూపాయికి రోజుకణా వడ్డీకి అప్పులిచ్చి ప్రజలను ఆదుకున్న నారాయణా, రోజూకోర్టులో అబద్ధమాడనని దేవునియెదుటప్రమాణంచేసే సీతారామయ్యా అప్పటికప్పుడు తలావందా బీదలకు అన్న ప్రదానానికి సమర్పించుకుని దేవుడికి నలు గురూ చూసేట్టుమొక్కుకుని లెంపలు వాయించుకున్నారు.

స్వామివారు ఒక తాటాకుతీసుకుని మంత్రించి బీజాక్షరాలురాసి కళ్లకద్దుకుని పసుపు కుంకుమలతో పూజించి రాగిరేకులో చుట్టి ప్రసాదించారు కోదండరామయ్యకు. వివరాలు మటుకు తెలియకముందే యోగ నిద్రలోకి వెళ్ళిపోయారు స్వామీజీ. ఉంత

బట్టలేక 'స్వామీ, ఈతాయత్తుతో మాకోరికలు సఫలమౌతాయాండీ!' అని కోదండ రామయ్య వేసిన సూటిప్రశ్నకు ముభావంగా ఊరుకున్నారు స్వాములవారు. అర్థంగాక అవస్త పడుతున్న కోదండరామయ్యకు 'ఓపికపట్టమని' భాష్యంచెప్పాడు గవరయ్య.

వందలైతే హనుమంతుడికి ముట్టాయి గాని కోదండరామయ్య గురగురలు మాత్రం వీసమైనా తగ్గలేదు! ఐతేఒకటి. ఏమాట కామాటే చెప్పాలి, ఆఅమ్మాయిని మాత్రం కసురుకోవటం పూర్తిగా మానేసి 'ఓపిక' ను దీక్షగా సాధిస్తున్నాడు. ఏమో,తనవిధిని నెర వేర్చగ్గదా తాయత్తుమహిమ తెలియాలి?

ఆ అమ్మాయి మటుకెంత చలాకీదనుకున్నారు! మీకు తెలియదుగావును, మావాళ్లను ఆటపట్టిస్తుందిట, "అక్కగారవ్వగారై పోతున్నారు, బావగారు మీసాలకు రంగేసి మరిదిగా మారుతుంటే!" అని.

కోదండరామయ్య రోజూ నా కోసం వొచ్చేవాడు. బాగా గంటా గంటన్నర వరకూ తనసొద వెళ్ళబోసుకునిగాని వెళ్లేవాడుగాదు. రాను రాను అతనిగొడవవిని ఆదరించెందుగ్గూడా నేనొక్కణ్ణే మిగిలి పోయాను. అతను రోజు రోజుకూ చెప్పే విషయాలను బట్టిచూస్తే వెంటనే ఏదో ఘనాపాటైన గోసాయి చిట్కా వేస్తేనే తప్ప అతని మనస్థైర్యానికే దెబ్బతగిలేటు కనిపించింది. మా రాజ్యంతో గూడా ఇదే అన్నాను. పాపం రాజ్యం ఎంతో యిదైంది, క్షణమాలోచించి, "అదంతానాకు వొదిలెయ్యండి. మీరుమాత్రం అవసరమైనప్పుడు నాయక పాత్రను జాగ్రత్తగా నిర్వహించండ"ని హెచ్చరికచేస్తూ చెవులోగుసగుస లాడింది.

ఇద్దరు మగవాళ్ళు ఇన్నాళ్ళు తల బద్దలు గొట్టుకుంటే అంతు తెలియని విషయం అర నిమిషంలో ఉఫ్ఫున ఎగరగొట్టేసింది ఆడ గూతురు!

మర్నాడు ఉదయం ఆఫీసురూములో ఫైల్సుతిరిగేసు కుంటున్నాను. తొందరైన సెషన్సుకేసు ఉండటంవల్ల పూర్తిగా ఆలోచనలోమునిగి పోయాను. 'కాఫీచల్లారి పోతున్నది తాగరూ?' అన్న సుకుమారమైన కంఠం లీలగా వినిపించింది. కాఫీతాగిగ్లాసు స్టూలుమీద పెట్టేసి యాదాలాపంగా 'రాజ్యం టైంప్రకారం కాఫీతెస్తావు, నేనంటేనీకెంత శ్రద్ధ!' అనే ప్రశంసా వాక్యం ఒకటి ఖర్చుపెట్టి చెయ్యిపుచ్చుకుని పక్కన కూర్చోబెట్టుకున్నాను ఫైల్సులోదించిన తల యెత్తకుండానే. ఏదోచెప్పరాని ఆనందం నావొళ్లంతా పాకినట్టై, ఆగిలిగింతలో తల యెత్తి యిలా,చూద్దునుగదా, రాజ్యంకాదు— ఆ అమ్మాయి! రంభలా తయారై నాపక్కన ఉంది!! నా ఉలికిపాటుచూచి కొంచెం ఖంగారుగాలేచి అల్లంత దూరాన నిలబడి నావంక క్రీగంట చూస్తున్నది ఎడంకాలి బొటనవేలుతో నేలమీద రాస్తూ. విస్తుపోయి ఓమాటు కళ్లనులుముకుని మళ్లీ చూచి శ్యామలేఅని నిర్ధారణ చేసుకునే సరికి నాగుండెలు కొట్టుకున్నై స్నేహితుడికి అపకారం చేస్తున్నానే అని. కాని మా రాజ్యం చేసిన హెచ్చరికను జ్ఞాపకం చేసుకుని, ఆలస్యమైతే ఐందని ఫైల్సునవతల పారేసి. "ఏమమ్మాయి, ఇలావచ్చావు? రాజ్యం లేదూలోపల?" అనడిగాను అనునయంగా.

'మీకోసమే. ఏంరాగూడదూ?" అడిగింది శ్యామల చిరునవ్వు దొంతరలు చిలకరిస్తూ.

"అబ్బే దానికేం? అహం, మరేంలేదు రాజ్యం పక్కగదిలో ఉందేమోనని." నీళ్ల నమిలాను బొంగురు గొంతుతో.

శ్యామలనవ్వి. "మరేం భయం లేదు లెండి. అక్కయ్యగారే నాకిడ్యూటీ అప్ప గించారీవేళ. కాఫీబాగుందాండీ?" అనడి గింది గోముగా.

"అమృతం లాగుంది" అనేశాను అడి గిందే తడవుగా సూపర్లేటివ్ గుణగణాలతో సర్టిఫికెట్లు రాసిచ్చే అలవాటు ప్రకారం.

"నిలబడే వున్నావేం! కూర్చోఅలా," ఎదురుగా కుర్చీచూపించాను.

"ఏదో ముఖ ప్రీతి కంటున్నారుగాని అక్కయ్యగారి చేతిరుచి నాకెక్కణ్ణించి వస్తుందిలెండి?' అన్నది వయ్యారంగా కుర్చీలో కూలబడి. స్వస్తిక్ హెయిరాయిల్ గుమగుమలతో మత్తెక్కిస్తున్న జడఏదురు రొమ్ముమీన కృష్ణసర్పంలా కదులాడేట్టు కెంపు రిబ్బను సవరించుకుంటూ.

"అమ్మమ్మ! ఈరుచి దానికేంచేతౌను? ఇవాళనిజంగా బ్రహ్మానందంగా వుంది. ఇంతకమ్మని కాఫీ యింత అందమైన అమ్మాయి చేతినుంచి అందుకున్నానని."

"నిజంగా? అంతందంగా వున్నానా? అక్కయ్యగారు నాకేంతీసిపోరే?"

"దాని మొహం గాదూ? ఎప్పుడూ పోట్లాడుతూనే వుంటుంది. ఏంచెప్పను నాఅవస్థ! కోర్టునుంచి నా నా హైరానాపడి యింటి కొస్తానా? ఇలా అప్సరసలా అలంకరించుకువచ్చి పక్కనకూచుని కాస్సేపు కులాసా కబుర్లు చెప్పగూడదూ? అబ్బే! దానికో సరసమూ తెలియదు చట్టుబండలూ తెలియదు. పోదూ. అదీ ఓ ఆడదేనుట!" విరక్తి సూచించాను సోఫాను కొంచెం దగ్గిరసా లాక్కుంటూనే.

"పొండి! మీరుమరీకుర్రాళ్లైపోతున్నారు. పోతానమ్మా." సిగ్గుతో సొట్టలుపడుతున్న బుగ్గలతో పారిపోబోతున్న శ్యామలను చెయ్యిపట్టుకుని సోఫాలో పక్కన కూచోబెట్టుకుని అన్నాను అప్యాయంగా చెంపలు నిమురుతూ.

"మీగడలా మిసమిసలాడే ఈశరీరాన్ని ఆదౌర్భాగ్యుడు—"

"చేతకావొద్దూ? ఎందుకు లెండి? చెప్పుకుని యేంలాభం? పూజలనీ పునస్కారాలనీ ఉపోషాలతో నలగ్గొట్టి నాశనం చేశారు, పద్దెనిమిదేళ్లన్నానిండని నాకు దేనికిచెప్పండి ఈకర్మ కాండంతా, సుఖంగా ఆడుతూ పాడుతూ తూగుటుయ్యాలల్లో తేలిపోవాలిసిన రోజుల్లో? అసలీ మగాళ్లకు అరిచేతులో వొలిచిపెట్టిన అరిటిపండుగూడా తినటం చాతగాదు!" అభిమానాన్ని దెబ్బగొడుతున్న కొంటె, చూపులతో నావంక ఓరగా చూచింది. ఆచూపులకూ, సన్నని జార్జెట్టులోనించి తొంగిచూసే ఆలేయవ్వనపు వంపులకూ, ఆ అమ్మాయి తలలో తురుముకున్న సన్నజాజులు సౌరభానికీ వళ్లుపరవశమై పోతున్నా తమాయించుకుంటున్నాను. ఆఅమ్మాయి మటుకు ఒక్కొక్కమెట్టే ఎక్కుతున్నది గాని తగ్గటంలేదు.

"ఇంత ఉషారైన పిల్లను అర్థంచేసుకోలేని కోదండరామయ్య తెలివితక్కువకు విచారపడుతున్నా నన్నాను," పరామర్శగా

"అబ్బా, పోనిద్దురూ, నన్నర్థంచేసుకున్నవారు మీరొకళ్లైనా వున్నారుగా?" అమాంతం భుజాన చేతులువేసి తుమ్మెద రెక్కల్లాంటి ఆకాటుక కళ్లతో కితకితలు పెట్టేట్టు నాకళ్లలోకి చూచింది. ఆనిమిషాన నామెదడులో ఏయేభావాలు పరుగులెత్తిందీ చెప్పలేనుగాని ఆఅమ్మాయిని లాలనగాచేతుల్లోకి తీసుకున్నానని మాత్రం వొప్పుకుంటాను.

సమయానికి తలుపు నెట్టుకు చక్కా వచ్చింది రాజ్యం పానకంలో పుడకల్లే. ఇదా తోడుదొంగలు కూడి ఆడుతున్న భాగోతం? వీరేగావును ఏకపత్నీ వ్రతస్థులమని గొప్పచెప్పుకునే మొనగాళ్ళు!" అకస్మాత్తుగా ఉరిశిక్షవిన్న ముద్దాయిలా అదిరిపడి శ్యామలను వొదిలేసి అలానే నిలబడిపోయాను నిలువు గుడ్లేసుకుని. నాకేం తెలుసు వీళ్లపన్నాగం? అప్పచెల్లెళ్ళిద్దరూ పొట్టచెక్కలయ్యేట్టు విరగబడి నవ్వుకున్నారు తమవిజయానికి. చేసేదిలేక నేనూ పళ్ళికిలించాను.

ఆరాత్రిపడగ్గదిలో అన్నాను, "రాజ్యం, ఏమిటీ అల్లరి? శ్యామల నన్ను నిజంగానే ప్రేమించింది. సమయానికి నువ్వురాకనే పోతే ఏంజరిగుండేదో!"

"అంతటి ఘనులని తెలిసే ఓకంటకని పెట్టి వున్నాను, పాపమా పిచ్చిపిల్ల నాతో పందెం గెలిచానని పొంగిపోతున్నది అసలు సంగతి తెలుసుకోలేక"

ఆవెళ్లటం వెళ్లటం వారం రోజులపాటు శ్యామల మళ్లీకనిపించ లేదునాకు. కోదండరామయ్య రోజూవస్తూనే వున్నాడుగాని యిప్పుడు నసుకుడూ చిరాకూ మరీ ఎక్కువైనై, ఎదట మనమున్నామన్న గమనం కూడాలేకుండా తనలోతాను గొణుక్కునేవాడు. ఏమిట్రా మనవల్ల ఇంత అన్యాయం జరిగిందా అని పస్తాయించేవాణ్ణి. ఉపాసన సరిగాజరక్క హనుమంతుడు దెబ్బతీశాడో ఏమోనని పాపం కళ్ళనీళ్ళ పర్యంతం ఔతుంటే సముదాయించి "స్వామీజీ ఓపిక పట్టమన్నాడుగదా భయపడతావేం?" అని ధైర్యంచెప్పి పంపేవాణ్ణి. ఏమిటి చెయ్యటమా అని నాలోనేను ఉక్కిరి బిక్కిరైపోతున్నాను. రాజ్యాన్ని సలహా అడిగితే కథ సొంతం కానియ్యండని నవ్వుతుంది కొంటెగా! నాకుమాత్రం గుండెలు పీచుమంటూనే వున్నై.

ఆరోజు రాజ్యం మేనల్లుడి భారసాలకని పుట్టింటికి వెళ్లొస్తానంది. పనిజాస్తిగా వుండటాన మనకెలాగూ తీరనే లేదు, పోనీ అదన్నా వెళ్ళరాకపోతే బాగుండదుమరీని, సరే ఒక్కరోజు భాగ్యమేగధా ఎలాగో ఓలాగా చెయ్యికాల్చుకో లేకపోతాముల్లే అని ఒప్పుకున్నాను. చీకటితో లేస్తూనే రాజ్యం కాఫీ పెట్టేసింది. ఇద్దరంతాగాము, స్టేషనుకు వెళ్లి టిక్కట్టదీ కొనిచ్చి, లేడీస్సెకండ్ క్లాసులో కూచోబెట్టి మాచెల్లెల్ని అడిగానని చెప్పమన్నాను, బండికదిలేటప్పుడు 'ఇల్లు జాగర్త సుమండీ అని హెచ్చరించి మరీ వెళ్ళింది.

చెంబూ తప్పాలాలు పని మనిషికి పడేసి పొయ్యిరాజేస్తున్నాను ఎంత కిరసనాయిలు

పోయినా మానె తగలకుతున్నదేగాని కష్టాలు వచ్చినా మందటంలేదు. రామరామా, ఒళ్లి వచ్చిముద్దులు. ఊదివూది దవడలు పడి పోతున్నై. పొగతో ఎర్రబడ్డకళ్లు నులుము తుంటూ వెనక్కుతిరిగి ఇలా చూతును, మోహినీ విగ్రహంలా నిలబడివుందిశ్యామల నవ్వు వెన్నెలలు వలకబోసుకుంటూ, ఎప్పు డొచ్చిందో ఏమోమరి!

'బావగారు అగ్నిహోత్రుడితో కుస్తీపడు తున్నట్టున్నారు!'

'ఏంచెయ్యనమ్మాయ్. నన్నిలా వొదిలేసి పుట్టింటికి చక్కాపోయింది మీఅక్కయ్య'

'ఆమాత్రం శిక్షఉండకపోతే మగాళ్లు మాటవినరు. లేవండి, నేనుండగా మీ కెం దుకిఅవస్థ?'

'సరే' అవసరసమయంలోని సాను భూతి అగస్త్యుణ్ణైనా లొంగదీస్తుంది.

పాపం చాలా శ్రద్ధగా వంటచేసింది. అది చేసింది ఇదిచేసింది అనిచెప్పి మీ చేత కొట్టలు ఖేయిస్తే ప్రయోజనమేమిటిగాని ఆ రోజు అమృతం రుచిచూశానంటే ఒక్క మాటలో చెప్పినవాణ్ణవుతాను.

భోజనంచేసి శ్యామలకు థాంక్స్ చెప్పి పడగ్గదిలో నిద్దరొచ్చేదాకా కాలక్షేపానికని పత్రిక తిరగేస్తున్నాను. ఇంతలో తనుగూడా భోంచేసి వెండిపళ్ళెంలో ఆకులూ, చెక్క ముక్కలూ తీసుకుని చక్కావొచ్చింది గది లోకి శ్యామల, ముసిముసి నవ్వులు నవ్వు కుంటూ.

'అయ్యో నువ్వింకా యింటికెళ్ళనేలా? ఇవాళ కోదండరామయ్యకు మడత గుడు ములేనన్నమాట'.

'అదేంఖర్మమండీ? చీకటితోనే వం టంతా చేశేసి భోజనంపెట్టి రీసెర్చి లైబ్రరీకి పంపంచి మరీవచ్చాను పాపం ఒక్కరూ మీరేమవస్థ పడుతున్నారోఅని,శాకపాకాలు, రోజులావున్నాయాండి, చాలా అప్పీలింగ్ గా అడిగింది సన్నాయి నొక్కులు నొక్కుతూ,

'లేవు', ముఖంలోకి చూశాను ఎఫెక్టు కోసం. పాపం, ఎంతోఇదై, "బొన్లెండి ఎం దుకు బాగుంటై ఆపేక్షగలవాళ్లు వండి పెట్టంది? అసలెలావున్నాయంటారింతకూ?"

"దివ్యంగా!"

"అబ్బ, చెబుదురూ, ఎగతాళి పట్టించక. ఏదన్నా లోటుంటే రాత్రి వంటలో సరి జేస్తాను."

"చెప్పానుగదూ? మరంతే ఇంకో మాట దొరకటంలేదు. ఐతేరాత్రికి మళ్ళీ తిప్పలుపడతావా ఇక్కడా అక్కడా?" బెట్టుసరికి చెప్పాను, "వద్దులే అమ్మాయ్, బాగుండదు రాత్రిళ్ళు రావటం. నేనూ ఒం టరిగా ఉన్నాను, ఎవరన్నాచూస్తే యామను కుంటారు?"

"మరేం కష్టంలేదులెండి. ప్రత్యేకం మీ యింటికని పనిగట్టుకురావటం లేదుగా! వెంకాయమ్మత్తయ్యగారి దగిర ఆంజనేయ దండకంచెప్పించుకునేందుకు రోజూ యెలాగూ వస్తూనేవుంటానాయె,మావార్నడిగి మూణ్ణిమి షాల్లో యిన్ని బియ్యం పొంగించిపోయే దానికి మీచేతమళ్ళి గరిటపటించాలా ఏమి టండీ?" అన్నది ఆప్యాయంగా, నవనవ లాడే కవటాకులు మరీ నవనవలాడే చేతుల్తో చిలకలు చుట్టిస్తూ.

"ఒక్కసంగతి చెప్పండి నాకు తెలియ కడుగుతాను, నేనిక్కడికి రావటం మీగ్గూడా యిష్టంలేదా ?" చేపకు ఎరవేసే ఎర్రల్లే కందిపోయింది, శ్యామలముఖం సిగ్గుతో.

"అబ్బే, ఛీఛీ, ఎప్పుడన్నానామాట ?"

'అహఁ, మీరన్నారని కాదులెండి, అక్కయ్యగారేమన్నారో తెలుసా ? ఎందుకులెండి, ఆలుమగలమధ్య తగూ పెట్టటం" వయ్యారం వొలికించే ఆ కళ్ళలో అప్పుడే అసూయ రగులుకున్నది.

'భయంలేదు చెప్పు శ్యామలా, యామన్నదేం ?"

'అనటమేకాదు అమ్మలక్కలకు చెప్పి అల్లరిగూడా చేసింది, నేనేమో తన బంగారాన్ని కొరుక్కు తింటున్నానని ఆనోటా ఆనోటా మావారి చెవుల్దాకాగూడాపోయింది'

'నిజం ?'

'నిజమెలా ఔతైలెండి పరాయివాళ్ల మాటలు !'

'అబ్బే, నీమాటనమ్మక పోవటం లేదమ్మాయ్, ఐతే, గట్టిచిక్కే వచ్చిందే ? యిహ నేను వూళ్ళో తలెత్తుకు తిరిగే అవకాశం లేదన్నమాట, యింకానయం కోదండరామయ్య ఓర్పుగలవాడూ, యోగ్యుడూ కనక సరిపోయింది, నడిరోడ్డుమీద నిలేసి అడిగితే ఏమిటి చెప్పుకోటం ?' అసూయగా మారిన ప్రేమభావం నిమిషంలో జుగుప్సతో కూడిన ఆశ్చర్యంగా మారింది శ్యామల కళ్ళల్లో.

'ఎందుకండీ అలాపరీక్షిస్తారు నన్ను ? మావారి యోగ్యత రెండేళ్లనించీ చూస్తూనే వున్నాను. వచ్చిన చిడుపేరేదో రానే వచ్చింది, తక్షణం ఈవూరు విడిచి లేచిపోదాం పదండి.'

శ్యామల తెగువకూ ఆత్రితకూ నిర్ఘాంతపోయి. "ఏమిటమ్మాయ్, నీకేమన్నా మతిపోయిందా ? యింతప్రాక్టీసుకు నీళ్ళొదులుకోమనేనా నీసలహా?"

"పోతేపోయింది లెద్దురూ, బోడిప్రాక్టీసు మునిగిపోయిందట. నేను పండంటి సంసారానికి నీళ్లొదులు కుంటుండగా లేంది; తెలివితేటలున్నవాళ్ల ఈమాత్రం ప్రాక్టీసు మరే వూళ్లోనైనా సంపాదించుకో గలరులెండి!"

'నువ్వు మాత్రం కాస్తవెనకా ముందాలోచించుకో వొద్దమ్మాయ్? పండంటి సంసారమంటున్నావా ? చూస్తూ చూస్తూ చిక్కుల్లోయిరుక్కోటం తెలివైన పనాచెప్పు."

"ఏదోమాట వరసకన్నానంతే పండంటి సంసారమని. కాకపోతే ఏమానంద మనుభవిస్తున్నా నక్కడ?"

"పొరపాటు పడుతున్నావేమో? నాకంటె కోదండరామయ్య చిన్నవాడూ, అందమైనవాడూ, బుద్ధిమంతుడూ, ఒనరున్నవాడు-"

"ఎన్నివుండి ఏంప్రయోజనం లెండి మనసులు కలవక పోయినాక ? మంచికో చెడ్డకో ఆడది తనజీవితంలో ఒక్కసారే ప్రేమిస్తుంది. ఆప్రేమకోసం సమస్తమూ త్యజిస్తుంది; అదిఫలిస్తే ఆనందిస్తుంది, విఫలమైతే నశిస్తుంది"

"ఎందుకీ చిన్నయీడుకే యింత వేదాంతం ? జరిగిన అల్లరేదో జరిగింది గాని నేనురాజ్యం పోరుపడలేను, నీప్రేమను హరాయించు కోనూలేను. ఇలా బతకనియ్యి."

"నెత్తినమొత్తే పెళ్ళాంమాట కుండే విలువ నువ్వేసమస్తమూనని ప్రాధేయపడే వాళ్ల ప్రార్థన కెలావుంటుంది లెండి ?" కళ్ళు నీళ్లు పైటకొంగుతో తుడుచుకుంది ఉబికి వచ్చే ఉక్రోషం దిగమింగుకుని.

"కోదండరామయ్యల్లే పంతంపట్టి నెగ్గించుకునేశక్తి నాదగ్గిరలేదు. కనుక మనసత్తా ముందుగానే తెలుసుకుని పరిస్థితులకు లొంగి నడవటం ఉత్తమం. ఈవూరొచ్చిఎటువంటి మంచిపేరు పడ్డానో తెలుసునా? చాలా సాత్త్వికుణ్ణనీ, ఘరానా పెద్దమనిషిననీ, ఊళ్లో ఆకతాయిలను మందలించి చెప్పగల సమర్థుణ్ణనీ, పరస్త్రీని తల్లిలా చూస్తాననీ. ఇన్నేళ్లు కష్టపడి సంపాదించిన గౌరవం నీకోసమని నాశనం చేసుకోలేను. ఎటొచ్చీ నలుగురూ మనను లేచొచ్చిన వాళ్ళమంటారు గాని, ప్రణయదంపతులమని దీవించరు! కోదండరామయ్యా నీకోసం ఎంతైనా త్యాగంచెయ్యటానికి సిద్ధంగావున్నాడంటే అతనికీవూళ్లో పేరా? ప్రతిష్టా పోయి పోతుందను కోటానికి?"

"ఆపండి మీఅధిక ప్రసంగం! మేడిపండు రంగుకు మురుసుకుని పొట్టలో పురుగుల్ని కానకపోయాను. వలచివచ్చిన ఆడదాన్ని వద్దుపొమ్మనని మొగాడెవరులెండి! మీపేరూ ప్రతిష్టా మీరూ ఉట్టిగట్టుకు ఊరేగండి కాని యిల్లుదాటి గడపలో అడుగు పెట్టలేని మీబోటి పిరికిపందలతో పోల్చకండి మావారిని"


"శ్యామలా!"


దెబ్బతిన్న లేడిపిల్లలా సర్రున పారిపోయింది పిలుస్తున్నా వినిపించుకోకుండా.

మర్నాడు కోదండరామయ్య ఈలపాట పాడుతూవచ్చి మావాళ్ళులేక నేను బాధపడుతున్నందుకు విచారించి

"చూశావా స్వామీ జీవమహిమ? మీమరదలిప్పుడు మనం ఎటాడిస్తే అటాడుతుంది బొమ్మల్లే!"

తాయెత్తు కళ్ళకద్దుకుని మీసం మీద చెయ్యి వేశాడా పురుష సింహుడు.






బలవంతంగానో, వధువు ఇష్టప్రకారమో ఆసాంఘిక వాతావరణంనుంచి బైటపడి చేసుకునే వివాహాలు రాక్షస వివాహాలు అనబడుతవి. యీనాటికీ ఇలాటివివాహాలు అనేకజాతుల్లో అమల్లోఉన్నవి. ప్రతిదేశం తాలూకుపురాణాలు, చరిత్రా తిరగవేస్తే ఇలాటి వివాహాలు ఒకప్పుడైనా విరివిగాఅమల్లో వుండేవనిఅర్థమవకపోదు. పురాతనమానవులమధ్య జరిగిన యుద్ధాలకు ఇలాటి వివాహాలే కారణంగా కనిపిస్తవి.

మెక్‌లినన్‌లాటి చరిత్రపరిశోధకులు — పురాతన మానవసమాజాల్లో భార్యను సంపాయించటం రాక్షస వివాహంచేసుకోవటం అతి సామాన్యంగా వుండేవని చెపుతూన్నప్పటికీ, ఇదమిద్ధంగా ఇదొక్క విధానమే పూర్వీకుల్లో అమల్లో వుండేదని చెప్పలేం. కాని రాక్షస వివాహాల తాలూకు కొన్ని ఆచారాలు యీనాటికీ లోకంలోని అనేక సంఘాల్లో కనిపిస్తవి.

పూర్వీకుల్లో 'దిష్టితగలటం' అనేదాన్ని ఎంతో పట్టింపుగా చూసే ఆచారంవుండేది. కొంతవరకూ ఆదిష్టితగలటాన్ని తప్పించుకొనేందుకూ, ఎంతో సిగ్గుపడే వధువు మర్యాదను కాపాడేందుకూ, యీరాక్షస విధాన చిహ్నాలు ఆధునిక వివాహపద్ధతుల్లోకూడా ప్రతిఫలిస్తున్నవని మరికొంతమంది పరిశోధకులు అంటున్నారు. వీటినిబట్టీ, ఇతర ఆధారాల్నిబట్టీ బలవంతాన ఒక స్త్రీని పొందటం,

...వివాహమాడటం పురాతన మానవసమాజాల్లో తప్పుగా ఎంచబడక పోవటమేగాక, అదొక అతిసామాన్య విషయంగాకూడా పరిగణించబడేది.

'ఒకానొక పురాతన పద్యాన్ని పరిశీలించి నట్టయితే, ఐర్లండ్ చరిత్రలో పిక్ట్స్‌జాతివారు గేల్స్‌జాతితో యుద్ధంచేసి, తమవిరోధుల తాలూకు 300 ల మంది స్త్రీలను అపహరించారు. ఆపరిస్థితుల్లో ఆరెండు జాతులూ రాజీపడటంకూడా ఆపద్యంలోనే ఉదహరించబడింది.

మాధ్యమికయుగంలో ఇటలీలో—కాస్త డబ్బువుండి, సాంఘికంగా మంచిస్థానంలోవున్న యువతుల్ని బలవంతంగా ఎత్తుకొనిపోయి వివాహమాడే ఆచారం వుండేది. యీ విధంగా అపహరించబడ కుండా వుండేందుకూ, • తమ కుమార్తెల శీలం పాడుగాకుండా వుండేందుకుగాను, ధనిక కుటుంబీకులు పాయుధదళాల్ని రక్షణకుగాను నియమించటం జరిగేది.

ఫ్రాన్స్‌లో మాధ్యమిక యుగంలో ఒక యుద్ధవీరుడు ఒక పడుచును వెంటపెట్టుకొని బైటికి వెళ్ళినప్పుడు, ఇంకోయుద్ధవీరుడు ఆ పడుచు మీద నే కన్నువేయటం జరిగినట్టయితే, ఆ ఇద్దరు యోధులూ యుద్ధంచేయటం, గెలిచిన వారు ఆపడుచును అనుభవించే అర్హతను సంపాయించటం జరిగేది. ఇలాటి సందర్భంలో ఆ గెలుపొందిన యోధుడికికానీ, ఆ యువతికి కానీ సాంఘిక విలువలు ఏ మాత్రమూ తగ్గవు.

బలత్కారంగా వివాహమాడే పద్ధతి దక్షిణ స్లావ్స్‌లో, 19—వ శతాబ్దం ఆఖరువరకూ అమల్లోవుండేది. ఇక ఆల్బేనియాలో నిన్న మొన్నటిదాకా, రాక్షసవివాహాలు సాంఘికాచారంగానే వుండేవి. ఇతర అడవిజాతులవారు, తమకన్న సాంఘికంగా మంచిస్థితిలోవున్న కుటుంబాలలోని స్త్రీలకోసం దొంగ చాటుగా కాపలావేయటం, సమయంచిక్కినప్పుడు వారిని ఎత్తుకొనిపోయి తమ స్వంత ఆస్తివలెనే అనుభవించటం నేటికీ సాగుతూనేవుంది.

ఆదిమ మానవ సమాజాల్లో ఎప్పుడైతే స్త్రీలకొరత ఏర్పడుతుందో, అప్పుడు రాక్షస వివాహాల ప్రాముఖ్యత హెచ్చటం జరిగేది. ఆహారకొరత ఏర్పడినప్పుడు, కొత్తప్రదేశాల్ని స్వాధీనం చేసుకోవటంవలెనే, వివాహాలకు గాను తగినంతమంది స్త్రీలు లేనప్పుడు, ఇతరజాతులతో యుద్ధంచేసి, వారిని గెలిచి వారి స్త్రీలను వివాహమాడటం జరిగేది. అంతేగాక, ఓడించబడిన జాతి తాలూకు స్త్రీలను అనుభవించటం ఒక ఆచారంగానూ, ఒకహక్కుగానూ, భావించబడేది. పెళ్ళిచేసుకోకపోయినా, వారిని అనుభవించటం, ఉంపుడుకత్తెలుగా ఉపయోగించటం జరిగేది.

బలాత్కారణ అనేది సంస్కారంలేని బర్బర జాతుల్లో సర్వసామాన్యంగా వుండేది. వారుదాన్ని ఒక నేరంగాకాక, బలాత్కారంగా స్త్రీని సంపాయించిన పురుషుణ్ని ఒక వీరుడుగాకూడా భావించేవారు.

రోమనుల పురాణంలో చెప్పబడ్డ శాబైన్స్ జాతుల తాలూకు స్త్రీలను బలాత్కారంగా ఎత్తుకొని పోవటం, వారిని బలవంతాన అనుభవించటం — పురాతన కాలంలో భార్యల్ని సంపాయించే యీ రాక్షస విధానాన్ని స్పష్టీకరిస్తుంది. రామాయణంలో సీతను రావణుడు ఎత్తుకొనిపోవటం, మహాభారతంలో సైంధవుడు బలవంతాన ద్రౌపదిని ఎత్తుకొని పోవటం, భీష్ముడు అంబికా అంబాలికలను బలాత్కారంగా ఎత్తుకొని వెళ్ళటం, భాగవతంలో శ్రీకృష్ణుడు రుక్మిణిని ఎత్తుకొనివెళ్లి వివాహమాడటం మొదలైన ఉదాహరణలు పూర్వీకుల్లో రాక్షసవిధానం ఎంతపరిపాటిగా వుండేదో తెలియ పరుస్తున్నవి.

ఇలాటి ఉదాహరణలే అనేకదేశాల పురాణాల్లోనూ, ఇతర మత గ్రంథాల్లోనూ కనిపిస్తవి. చివరకు బైబిల్ లోకూడా ఇలాటి ఉదాహరణలు ఉన్నవి. పూర్వీకుల్లో భార్యనుకూడా ఆస్థిలోని ఒకభాగంగా పరిగణించే ఆచారం వుండేది. పరాయిసొత్తును, కేవలం తన భుజబలంవల్ల ఆక్రమించుకున్నట్టే, పరదారను బలవంతాన తన స్వంతం చేసుకోటంకూడా ఒక ఆచారంగానే చలామణి అయేది.

ఆస్ట్రేలియన్ జాతుల్లో రాక్షసవివాహం చాలా పరిపాటిగా వుండేది. పరాయి తెగలోని స్త్రీకోసమై, ఆపురుషుడు వారిగూడెం సరిహద్దుల్లో కాపలావేయటం, ఒంటరిగా ఇతర రక్షణేమీ లేకుండా స్త్రీ తన దరిదాపుకు రాగానే ఆమెమీదకు ఉరికి ఒక్కదెబ్బతో ఆమెను స్పృహ తప్పేట్టుచేసి, ఎత్తుకొని తన గూడానికి తీసుకొనివెళ్ళటం, అక్కడ తన కులపెద్దల సమక్షంలో ఆమెను తనతోనే వుండమని బలాత్కరించటం, ఆమె అందుకు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా అక్కడే ఆమెను చెరిచి తన ఆస్థిగా చేసుకోవటం జరిగేది.

రాక్షస వివాహం తాలూకు చిహ్నాలు మరికొన్ని తెగల్లో నేటికీ వేరొకరూపంలో కనిపిస్తవి. దక్షిణచైలీలో వరుని తాలూకు స్నేహితులు పిల్లను వధువుగా ఇమ్మని కోరుతూ, పిల్లతండ్రితో సంభాషించే సమయంలో, చాటుగా ఎవరికీ తెలియకుండా కాబోయ్యేవరుడు కాబోయ్యేవధువును పట్టుకునేందుకు ప్రయత్నించే ఆచారం నేటికీవుంది. అంతేగాక, ఆమె చిక్కినట్టయితే, ఆమెను బలవంతానైనాసరే మోసుకొని దగ్గర నేవున్న అడవిలోకి పరుగెత్తటం జరుగుతుంది. ఆ ఇరుగు పొరుగులు యీవిధంగాలేచిపోవటాన్ని నిరశిస్తూ కేకలువేసి గోలచేస్తూ, దాన్ని నిరోధించేందుకు ప్రయత్నిస్తారు. ఏమైనా పట్టుదలతో వరుడు ఆ వధు

వుతో పాటు అడవిలోకి పారిపోగలుగుతేమాత్రం, ఆమె అతనిభార్యగానే భావించబడుతుంది. రెండు కుటుంబాల పెద్దలూ, వారిసమాజమూకూడా ఇందుకు అంగీకరిస్తవి. యీ వివాహం విషయంలో ఆ రెండుకుటుంబాల తాలూకు పెద్దలు ఏకారణం చేతనైనా అంగీకరించకపోయినప్పటికీ, ఆ వధూవరులు దంపతులుగానే పరిగణించ బడవలసి వుంటుంది.

ఇలాటి ఆచారమే మస్క్విటో ఇండియన్‌లలో కూడావుంది. వివాహానికి అన్నిఏర్పాట్లూ జరిగి, పెళ్లికుమార్తెకు చెల్లించవలసిన ధర ఇవ్వగానే, వరుడు, వధువును ఎత్తుకొనిపోవటం, దాన్ని అడ్డగిస్తూ వధువుతాలూకు ఆడజనమంతా వరునితో వేళాకోళంగా యుద్ధంచేయటం, చివరకు వరుడు వధువుతోపాటు దగ్గర నేవున్న అడవిలో మాయంకావటం జరుగుతుంది. నేటి పశ్చిమదేశాల నాగరికతలోని—వివాహంకాగానే వధూవరులు ఏదూరదేశానికో వెళ్ళి కొద్ది రోజులు స్వేచ్ఛగా గడిపిరావటం దీన్నే హనీమూన్ (honey moon) అని వివాహాచారంగా పరిగణించటం, రాక్షస వివాహ క్రతువుతాలూకు ఒక చిహ్నమని చెప్పవొచ్చు.

ఆస్ట్రేలియన్ జాతుల్లో సామాన్యంగా ఇద్దరు మొగవాళ్లు కలిసి స్త్రీని దొంగిలించేందుకు ప్రయత్నించే ఆచారంవుంది. ఏ అర్ధరాత్రిపూటో—అందరూ గాఢనిద్రలో వున్నప్పుడు, శత్రుశిబిరంలోకి చల్లగా జొరబడటం, చప్పుడు కాకుండా ఒకడు స్త్రీ జుట్టును తన ఈటెకు చుట్టటం, రెండోవాడు యీటె మొనను ఆమె రొమ్ములదగ్గర వుంచటం మెల్లిగా ఆమెను నిద్రలేపటం జరుగుతుంది. నిద్రమెలుకూరాగానే తన ప్రాణం అపాయస్థితిలో వుందని వెంటనే గ్రహించిన ఆమె కేక వేసేందుకు సాహసించదు. మెల్లిగా ఆమెను దూరంగా తీసుకొనివెళ్ళి, అక్కడవొక చెట్టుకు కట్టివేసి, ఇదేవిధంగా ఇంకో స్త్రీని కూడా దొంగిలించేందుకు తిరిగి శత్రుశిబిరానికి రావటం, చివరకు ఇద్దరు స్త్రీలతోనూ విజయవంతంగా తమగూడానికి తిరిగి రావటం జరుగుతుంది.

యీవిధంగా పట్టుబడ్డస్త్రీలు సామాన్యంగా తిరగబడక, వెంటనేలొంగిపోతారు. ఎందుకనంటే వారిజీవితాల్లోనూ, ఆ అడవి జాతుల ఆచారాల్లోనూ ఇవి సర్వసాధారణ సంఘటనలుగానేవుంటవి, చిన్నతనంనుంచీ ఆజాతుల్లోని స్త్రీలు బలవంతాన చెరచబడటమనేదాన్ని అర్ధంచేసుకోవటం, దానికి లొంగి వుండటం నేర్చుకొనేవుంటారు. ఆసమాజాల్లోని చిన్నపిల్లల ఆటల్లో యీ బలాత్కరించబడటం ఒకసన్నివేశంగా వుండటం, పిల్లలందరూ అందులో పాల్గొని ఆనందించటంకూడా జరుగుతుంది.

ఆస్ట్రేలియన్ జాతుల్లోని అందగత్తె జీవితమల్లా, ఆమెను ఎత్తుకొనివెళ్లేందుకు పురుషులు పన్నినపన్నాగాలూ, అందులోకొనసాగి బలాత్కారంగా చెరచబడ్డ సన్నివేశాలూ నిరూపిస్తవి. అంటే ఎంతమంది తనకోసం కాపుకాచి తనను ఎత్తుకొని వెళ్లేందుకూ, లేదా బలవంతాన రమించేందుకు ప్రయత్నిస్తే తను అంత అందగత్తెనని ఆమె తెలుసుకోవటం, ఇతరులు ఆమెసౌందర్యాతిశయాన్ని గుర్తించటం జరుగుతుందన్నమాట! యీబలాత్కారాల్లో ఆమె అనేకసార్లు గాయాలకు గురికావటం జరుగుతుంది. అంతేగాక ఆమె తీసుకువెళ్ళబడేకొత్త గూడెంలోని స్త్రీజనం—ఆమె అందానికి యీర్ష్యతో ఆమెను బాధపెట్టడం, అవమానించటం, ఎలాగైనా ఆమెను బైటికి పంపేందుకు, లేదా చంపేందుకు ప్రయత్నాలుచేయటంకూడా జరుగుతుంది. తనజన్మస్థలంనుంచి కొన్నివందల మైళ్లుకూడా ఆమె ఎత్తుకొని పోబడవొచ్చు. యీ చేతులు మారటం జరిగేప్పుడు, ఆమెగడపవలసిన జీవితానికి ఒక నిర్ణీత స్థలమంటూ వుండటం కష్టం.

ఐతే బలాత్కారంగా తనజాతి స్త్రీని ఎత్తుకొనిపోయిన ఇతరజాతిమీద కసితీర్చుకొనే బాధ్యతకూడా ఆజాతికివుంది. జాతి రక్షణార్థం, సాంఘిక శాంతికోసం ఆరెండు తెగలమధ్యా యుద్ధంతప్పదు. కాని యుద్ధంవల్ల శాంతి ఏర్పడినా, యుద్ధంవల్ల ఉభయపక్షాలకూ పెద్దనష్టం వొచ్చిపడుతుందికనుక, రెండుతెగలలోని పెద్దలూ కలుసుకొని ఏమాత్రం అవకాశమున్నా రాజీచేసేందుకు ప్రయత్నిస్తారు. సామాన్యంగా స్త్రీని ఎత్తుకొచ్చిన పురుషుడు — స్త్రీతాలూకు జాతికి లొంగిపోవటం, వారితో వివాహ సంబంధాన్ని ఏర్పరచుకొని, ఆ స్త్రీనే వివాహమాడి బంధుత్వాన్నీ తద్వారా మిత్రత్వాన్నీ పొందటం జరుగుతుంది; ఇదికాని పక్షంలో ఆయాజాతుల పెద్దలు నిర్ణయించే శిక్షనూ, జరిమానానూ ఒప్పుకోవలసివుంటుంది.

యీ శిక్షకూడా చాలా తమాషాగా వుంటుంది. చెట్టుబెరడును ముఖకవచంగా ధరించి 40 గజాల దూరంలో దోషి నిలబడతాడు. హానిజరిగిన జాతిలోని 10 మంది పురుషులు ఒక్కొక్కరు రెండుమూడు బాణాల్ని వాడిమీద విసురుతారు. ఏదో మానసికమైన ప్రతీకారాన్ని తీర్చుకోవటమే ఒక గౌరవంగా భావించేవారు - ఆబాణాల్ని కావాలని పక్కకు విసరటమో- గాలిలోకి వొదిలెయ్యటమో జరుగుతుంది. అది పూర్తికాగానే రెండు తెగలమధ్యా శాంతి నెలకొల్పబడుతుంది.

ఇలాంటి ఆచారమే ఫిజీదీవుల నివాసులలోనూ, న్యూగినియాలోని పాపుయాన్స్‌లోనూ వున్నవి. రక్షణలేని స్త్రీనిపురుషుడు ఎత్తుకొని పోవటం, ఆతరువాత ఆస్త్రీకిగాను ప్రతిఫలాన్ని ఇచ్చేవిషయంలో మధ్యవర్తులద్వారా మాట్లాడించటం జరుగుతుంది. కావాలని కానీ, పరిస్థితులు వొత్తిడివల్లకానీ బలత్కారంగా స్త్రీని

చెరచటం, అదివొక పురుష చిహ్నంగా పరిగణించబడటం ఆజాతుల్లోకద్దు. అంతేగాక యీహక్కు పురుషులకు ఉన్నట్టు, స్త్రీధర్మప్రకారం ఆమె లొంగిపోక తప్పదనే సాంఘికాచారం వున్నట్టు తోస్తుంది. యీవిధమైన క్రియలనూ, ఆచారాల్ని శాశించే ఒకానొక దేవతారాధనకూడా ఆజాతుల్లోవుంది. బలాత్కరించబడ్డ స్త్రీ తన రక్షకుని దగ్గరకు వెళ్ళటమో, మానటమో జరిగాక, ఆ తెగలోని వారు పెద్ద విందుచేసుకుంటారు. ఇలాటివి సామాన్యంగా వరుని తల్లిదండ్రులూ, వధువు తల్లిదండ్రులూ ఇతర కులపెద్దలూ కూడా అంగీకరించే దాంపత్యాలుగానే పరిణమిస్తవి.

వివాహసంస్థ ఎన్నో పరిణామాలకు గురై—యీనాటి రూపాన్ని ధరించటంలో, రాక్షస వివాహాలుకూడా ఒక సమయంలో పెద్దమార్పుకు కారణమైనవని చెప్పవలసి వుంటుంది. కొంతమంది చరిత్రకారులు రాక్షసవివాహాన్ని బలాత్కారంగా చెరచటంగానే భావిస్తున్నారు. ఐతే యీ వివాహాన్నికూడా, ఇతర వివాహాలవలెనే పవిత్రభావంతో వారు చూసేవారు. యీవివాహాలు మానవ ప్రకృతికి దూరంగా వుండటం వల్లనే వీటిని రాక్షస వివాహాలనీ, బలవంతాన స్త్రీని అనుభవించటం, కేవలం పురుషబలంతో స్త్రీని లొంగదీసుకోవటం రాక్షస లక్షణమనీ భావించినప్పటికీ, ఆవివాహ పద్ధతికూడా శాస్త్రీయంగానే భావించబడేది.

ఉత్తర అమెరికాలోని ఇండియన్‌లలో ఎన్నడూ రాక్షస వివాహపద్ధతి అమల్లో వున్నట్టే తోచదు. యీ వొక్క పద్ధతినీ వారెందుకు అమలు జరపలేదో చెప్పటంకష్టం. మళ్ళీ దక్షిణ అమెరికన్ ఇండియన్‌లలో యీ పద్ధతివుంది, మరీ వెస్ట్ ఇండీస్‌లోని కెరబియన్ ఇండియన్స్‌లో రాక్షస వివాహాలు సర్వసామాన్యంగా జరుగుతూనే వుంటవి. అమెరికాలోని ఉత్తర దక్షిణ దిశల్లోని యీభేదంలో ఒక్కటే రహస్యంవుంది. ఉత్తర దేశీయులు—ఏపరిస్థితుల్లోనైనా, తమ తెగలోకాకుండా, బైటితెగనుంచి వివాహాలు చేసుకోవటాన్ని మొదటినుంచీ నిరోధిస్తూనే వున్నారు. ఇది కారణంగా రాక్షస వివాహ పద్ధతిని వారు ప్రవేశపెట్టకుండా ఉండగలిగారు.

పురాతన మానవ సమాజాల్లో యుద్ధానంతరం శత్రువుల తాలూకు స్త్రీలను బందీలుగా తెచ్చుకోవటం గెలుపొందినవారికి హక్కుగాను, ఆచారంగానూ వుండేది. సాధారణంగా యీ ఆడయుద్ధఖైదీలు, గెలుపొందినవారి స్త్రీలకు సహాయంగా, వారికి సేవచేసేందుకుగాను నియమించబడేవారు. గెలుపొందిన తమ భర్తలనుంచి, వారి భార్యలు కొంతమంది దాసదాసీజనాన్ని బహుమతుల రూపంగా పొందేవారన్నమాట.

కాని యీ బందీలను నీచంగా చూసేవారుకాదు. తక్కువ జనాభా కావటం వల్ల, పనిపాటల్లో వారిని ఉపయోగించుకోవటం, జనవిస్తరణకు ప్రయత్నించటం జరిగేది. ఇది సాధారణ సంఘటనగానే, ఆరోజుల్లో భావించబడేది కనుక, ఖైదీలుకూడా వెనువెంటనే లొంగిపోవటం, తమ యజమానులదయకు పాత్రులయేందుకు ఎంతో అణకువతో వారి పనిపాటల్లో సహాయపడటం జరిగేది. యజమానులుకూడా వారిని నీచంగా చూడకుండా, ఎంతోదయతో చూడటం, త్వరలోనే వారంతా ఒకేతెగ మనుషులవలె కలసిపోవటం జరిగేది. ఆతరువాత ఆ తెగ స్త్రీలకు వలెనే, యీ బానిస స్త్రీలుకూడా సరిసమాన హక్కుల్ని పొందటం, వివాహాలకు అర్హురాండ్రుగా భావించబడి, ఆ తెగ అభివృద్ధికి ఉపయోగపడటం జరిగేది. జాతివిస్తరణకూ, సాంఘికశాంతికీ కారణమైన పురుషులు యీ స్త్రీల ద్వారా జాత్యాభివృద్ధికి పాటుపడటం, తమవంశాన్ని బలంచేసుకోవటం సాంఘికాచారంగానే వుండేది.

బలవంతాన బందీగా పట్టుకొచ్చిన స్త్రీని వివాహమాడటంలో ఇంకో ప్రయోజనంకూడావుంది. తన బాహుబలంతో, ఇతరపురుషులకన్న ఎక్కువను నిరూపించి, ఆమెను బందీగా తెచ్చుకో గలిగినందుకు, పురుషుడు తన పురుషత్వాన్నిగూర్చిన గర్వానికి గురవుతాడు. అంతేగాక, తాను కష్టించి సంపాయించుకున్న వ్యక్తికనుక, ఆమెమీద ఒకవిశిష్టభావం ఏర్పడటం, ఆ తలపువచ్చినప్పుడల్లా ఒకరకం తృప్తికీ, గర్వానికీ గురికావటం జరుగుతుంది. ఇక స్త్రీకికూడా ఇదొక గర్వకారణంగానే కనిపిస్తుంది. ఇతరపురుషులకన్న, ఎక్కువధైర్యాన్నీ. వీరత్వాన్నీ నిరూపించి, తనకోసమై ప్రాణాల్ని సయితం లెక్కచేయని యీపురుషునిమీద ఆమెకొక అభిమానం ఏర్పడి, క్రమంగా అది అనురాగంగా మారుతుంది. తేలిగ్గా సంపాయించబడ్డ ఇతర స్త్రీలవలె గాక, పురుషుని ధైర్యసాహసాల్ని పరీక్షించ గలిగిన తన అందచందాలూ, ఆకర్షణశక్తీ తనస్త్రీత్వానికి తానే గర్వపడేట్లు చేస్తుంది.

ఇది కారణంగానే తమ తెగలో, స్త్రీలను సాధారణపద్ధతిలో వివాహమాడిన వారికన్న, ఇతర తెగలలోని స్త్రీలను రాక్షసవివాహమాడిన పురుషులకు, ఒక ప్రత్యేక గౌరవం వుండేది. అంతేగాక, ఇతర తెగనుంచి దిగుమతైన యీ స్త్రీలనుంచి పొందే సంతానంలో, పరాయితెగల్లోని రక్తంకూడా యీ తెగకు కలవటం, వారి గుణగుణాలు కూడా దిగుమతికావటం, జరుగుతుంది. దీనికితోడు అనాది మానవుడు భయపడి ఏర్పరచుకొన్న మూఢనమ్మకాలూ, ని[illegible]ాలూ—నిబంధనలూ—పరాయి తెగలోని స్త్రీల కోసమే ప్రయత్నాలు, చేయవలసిన అవసరాల్ని ఏర్పరి నవి.

ఫిలిప్పైయిన్ దీవుల్లోని నిగ్రోటాస్ జాతిలో నిన్న మొన్నటిదాకా, వారి తెగలోని సంబంధాల్ని చేసుకునేవారు కాదు. పక్క తెగలలోని స్త్రీలను రాక్షస వివాహ పద్ధతిలో భార్యలుగా తెచ్చుకునే ఆచారం వుండటం వల్ల, ఆ అడవిజాతుల్లో యుద్ధాలు చాలా పరిపాటిగా జరుగుతూండేవి.

ఖుక్‌చీ జాతిలో ఒక యువకుడు, ఒక యువతి ప్రేమలో తలక్రిందులుగా పడ్డప్పుడు, అతని స్నేహితులందరూ కలిసి ఆమెకోసం దారులుకాచి, అవకాశం చిక్కగానే ఆమెను ఎత్తుకొనివెళ్లి తమ స్నేహితునికి అప్పగిస్తారు. ఇది పక్క తెగలవారు మాత్రమే అనుసరించే విధానం కాదు; ఆ తెగలలోనే సాధారణ పద్ధతిలో వివాహాన్నిపిల్ల తల్లిదండ్రులు అంగీకరించక పోయినట్టయితే, చివరకు బంధువర్గాల వారుకూడా రాక్షస వివాహ పద్ధతినే అనుసరిస్తారు. యీ సంఘటన జరిగినంత మాత్రానఆ రెండుకుటుంబాలమధ్య విరోధం పెరిగేందుకు కాని, ద్వేషాగ్ని రగిలేందుకుకాని ఇది కారణంగా వుండటాన్ని తెగలోని పెద్దలెవరూ ఆమోదింపరు. సామాన్యంగా స్త్రీని కోల్పోయిన తెగవారు, లేక కుటుంబంవారు రాజీ పడేందుకుగాను కొంతమొత్తాన్ని జరిమానాకింద తీసుకోవటం, లేక దెబ్బకు దెబ్బగానే ఇంకో స్త్రీని ఆకుటుంబంనుంచి కానీ, తెగనుంచికానీ తీసుకోటం జరిగేది.

టిబెట్‌లోని పూరాంగ్ జిల్లాలో ఏయువకుడైనా, ఒకయువతిని ప్రేమించి పెళ్లాడ దలచినట్టయితే, ఇద్దరు ముగ్గురు మిత్రుల సహాయంతో ఆమెను దారులు కాచటం, అవకాశం చిక్కగానే బలవంతాన ఎత్తుకొని పోవటం ఆచారం. తన ఇంటికి తెచ్చుకున్నప్పటినుంచీ ఆమెను ఎంతో గౌరవంగానూ, దయగానూ చూడటం మొదలు పెడుతాడు. తన ఇంటిలోనే వుంచుకొని ఆమెను బాధపెట్టి బలవంతపెట్టి వివాహమాడక, ఆమెను వేరే ఇంటిలోవుంచి, గౌరవంగా చూస్తూ క్రమంగా ఆమె అనురాగాన్ని సంపాయించేందుకు ప్రయత్నించి, విజయాన్ని సంపాయించి వివాహ మాడుతాడు.

ఏ పరిస్థితుల్లోనైనా ఆమె అతనికి లొంగకపోయినా, ఆమె తల్లిదండ్రులకు యీ వివాహం అభ్యంతరమైనా—యీ విషయాన్ని గ్రామపెద్దలు పంచాయితీ చేస్తారు. అక్కడ ఏవిధంగానైనా రెండు కుటుంబాలమధ్యా స్నేహభావం పునరుద్ధరించబడే ప్రయత్నాలు జరుగుతవి; సామాన్యంగా ఇలాటిది సాధ్యమాతుంది. అదికాగానే ముహూర్తం నిర్ణయించబడి, పెద్ద విందులతో వివాహం జరుగుతుంది.

ద్రవిడజాతుల్లోని గోండ్స్‌లో రాక్షస వివాహం సామాన్యపద్ధతి. ఆయువతికి యువకుడంటే ఇష్టంలేకపోవటం, లేదా ఆమె తల్లిదండ్రులు యీ వివాహా

నికి అనుమతించక పోవటం జరుగుతే, ఆయువకుడు తన స్నేహబృందంతో సమయం కోసమై దారులుకాచి ఆమెను బలవంతాన ఎత్తుకొని పోతాడు. ఆనాటినుంచీ ఆమె తప్పించుకొని వెళ్లేందుకు వీల్లేకుండా రక్షణ వుంటుంది. ఆమె తన మనస్సును మార్చుకున్న క్షణంనుంచే వారిద్దరూ దంపతులుగా భావించబడతారు.

న్యూబ్రిటన్‌లోని గజిలీపెనిన్సులాలోని జాతుల్లో యువతుల్ని వారిపుట్టింటి నుంచి దొంగిలించటం సామాన్య విషయం. ఒకోసమయంలో కన్యల్నేగాక, కాపరంచేస్తున్న పడుచుల్ని కూడా దొంగలించటం, బలాత్కారంగా ఎత్తుకొని వెళ్లటం జరుగుతుంది. ఆమనుషులు విరుద్ధమతాల వారైనట్టయితే వారిమధ్య ఒకపెద్ద యుద్ధం తప్పదు. చాలా సంఘటనల్లో పలుకుబడివున్న కులపెద్దలే మధ్యవర్తిత్వాన్ని వహించి రాజీచేసేందుకు ప్రయత్నిస్తారు.

కాంగోనదీ ప్రాంతంలోని మంగాలా జాతిలో పురుషుడు స్త్రీని బలాత్కారంగాఎత్తుకొనివెళ్లి,అడవుల్లో కాపరంపెట్టి,వేటతో కొంతకాలం గడపుతూ, ఆమె నుంచి సంతానాన్ని పొందినప్పుడు మాత్రమే తిరిగి తన గ్రామనికి జేరుకునే ఆచారం వుంది. ఇంటికి తిరిగి వొచ్చాక, తనకుబిడ్డను కన్నందుకుగాను తన యీ తాత్కాలిక భార్యకు, వేటలో సంపాయించిన ఆస్థిలో సగమిచ్చి ఆమెను అంతటితో వొదిలించుకుంటాడు.

హిందూ మతధర్మ ప్రకారం రాక్షస వివాహ పద్ధతి శాస్త్ర సమ్మతమైనదిగానే భావించ బడింది. మన ధర్మశాస్త్రంలో వివరించబడ్డ ఎనిమిది రకాల వివాహాల్లోను ఇదొకటి. సామాన్యంగా క్షత్రియులూ, ఇతర యుద్ధవీరులూ యీ పద్ధతిలోనే వివాహ మాడిన అనేక సంఘటనలు హిందూపురాణాల్లో విరివిగా కనిపిస్తవి.

రాక్షస వివాహపు చిహ్నాలు నేటికీ కొన్ని వివాహవిధానాల్లో కనిపిస్తవి. బ్రిటిష్ న్యూగినియాలోని కోరోజాతిలో—వివాహానికి ముహూర్త నిశ్చయమయాక, వరుని తరఫున కొంతమంది, వధువు ఇంటికి వెళ్ళటం, వారితో పోట్లాటకు ఉపక్రమించే పద్ధతిలో వారిని తిట్టడం, పెద్దగా కేకలువేసి గోలచేయటం జరుగుతుంది. యీసమయంలో తాను భయపడినట్టు నటిస్తూ వధువు పరుగెత్త నారంభిస్తుంది. ఆమెను వెంటాడే వరుని బంధువులతో ఆమె కొంతసేపు స్వరక్షణార్థం పోట్లాడ వలసి వుంటుంది.

ఇదేసమయంలో వరుడు మరికొంతమందితో కలసి వధువు ఇంటిమీద దాడీ ప్రారంభిస్తాడు. వరునికి కాబోయే అత్తగారు, కర్రను తీసుకొని తనకుఅందిన ప్రతివస్తువునూ బాదుతూ శాపనార్థాలు పెడుతుంది. పిల్లను పోగొట్టుకొన్న తన

క్రోభను వ్యక్తపరుస్తూ ఆమె నానాతిట్లు తిడుతుంది. ఆమె యీ ఏడుపుల్లో ఆమె తరఫు బంధువర్గంలోని స్త్రీలుకూడా కంఠాలు కలుపుతారు. వధువుతల్లి తన విచారాన్ని 3 రోజులపాటు ప్రదర్శిస్తూనే వుంటుంది; ఆమెతప్ప మిగతా బంధువర్గమంతా వధువు అత్తవారింటికి వెళ్తారు.

ఇదంతా ఒక వినోద కార్యక్రమంగా జరిగినప్పటికీ, రాక్షస విధాన విహాన్ని తిరిగి ఇలాటి ప్రదర్శనద్వారా వ్యక్తపరచి, ఆతృప్తిని పొందటం జరుగుతోంది.

ఉత్తర బంటూలోని బనియాంకోల్ జాతిలోకూడా ఇలాటి ఆచారమే వుంది. వరుడు కొంతమంది బంధుమిత్రులతో వధువు ఇంటిలో జొరబడి, తన కోసం వేచివున్న వధువు కుడిచేతిని పట్టుకొని, వివాహ మండపానికి తీసుకొని వెళ్తాడు. వరునితాలూకు బంధువులు ఒక బలమైన తాటితో వధువుకాలు కట్టేస్తారు. అప్పుడు రెండుకుటుంబాల్లోని పురుషుల్లో కొంతమంది, అటూఇటూ ఆతాటిని లాగటానికి ఉపక్రమిస్తారు. తాను వివాహంద్వారా తెచ్చుకున్న స్త్రీని ఆమె పుట్టింటివారు లాక్కొని పోకుండా కాపాడుకునేందుకు, వరుని బంధువులు ప్రయత్నించటం, తమస్త్రీని తామే తీసుకొని వెళ్లేందుకు వధువు బంధువర్గం ప్రయత్నించటం జరుగుతుంది.

యీ సమయంలో వధువు ఏడుస్తూ నిలబడి వుంటుంది. తాను పుట్టిపెరిగిన వాతావరణంనుంచి దూరంచేయ బడుతూన్నందుకే ఆమె యీ దుఃఖం. వరుడు మాత్రం ఆమెకు ధైర్యం చెపుతూన్నట్టు, ఆమె కుడిచేతిని పట్టుకొని ఆమె పక్కనే నిలబడి వుంటాడు. ఇదంతా కేవలం వినోదార్థం జరిగే కర్మకాండ కనుక, వరుని బంధువర్గంవారే తాడులాగటంలో గెలుస్తారు. వెంటనే వరుడు, వధువు కాలికి వేసిన ముడివిప్పేసి, అల్లంతదూరంలో తమకోసమై వేచివున్న బంధువుల దగ్గరకు ఆమెను ఎత్తుకు వెళ్తాడు. వారంతా కలసి వధూవరులతోసహా వరుని ఇంటివైపు పరుగెత్తటం, వధువు బంధువర్గంవారు వారిని వెంబడించటం జరుగుతుంది.

మంగోల్స్‌లో వివాహవిధానం ఇలావుంటుంది. వరుడు బాణాన్నీ, అంబుల పొదినీ తీసుకొని, తన బంధుమిత్రులతో కలసి వధువుఇంటికి వెళ్తాడు. అక్కడ ద్వారంలోనే వధువు అన్నగారు అడ్డగించి 'యీ జనమంతా ఎందుకు ఇలా వొచ్చారు ?' అని ప్రశ్నిస్తాడు. 'మేము నీయింటిలో జొరబడాలి' అంటారువాళ్లు. 'దానికిఒక యుదం అవసరం' అనేజవాబు వొస్తుంది. ఆతరువాత ఉభయ పక్షాల వారూ పోట్లాటలో పాల్గొంటారు. కొంతసేపయాక వధువు తరఫువారు ఓడిపోయి

నట్టు ఒప్పుకొని, గెలుపొందిన వరుని తాలూకు బంధుమిత్రుల్ని ఇంటిలోకి ఆహ్వానిస్తారు.

వధువును పట్టుకోవటం, ఆమె పట్టుపడకుండా తప్పించుకొనేందుకు ప్రయత్నించటం మొదలైన వినోద సంఘటనలు వివాహ విధానాల్లో మిళితమై చాలా పశ్చిమదేశాల్లో నేటికీ అమల్లో వున్నవి. ఇటలీలోనూ, హాలెండ్ లోనూ పెళ్లివారు వధువుతో ఇంటికి వెళ్ళేప్పుడు, అనేక తావుల్లో ఆటంక పరచబడటం, వారంతట వారుగానే మరి కొన్నిచోట్ల ఆగటం ఒక ఆచారంగా నేటికీ కనిపిస్తుంది.

ఇలా ఆగటానికి ఇంకో కారణంకూడా వున్నదని మరికొంతమంది చరిత్ర పరిశోధకుల అభిప్రాయం: పురుషుని బుర్రలో పనిచేసే అనేక దుష్టగ్రహాల తాలూకు శక్తుల్ని వొదిలించుకునేందుకు, యీమజిలీలు ఉపయోగపడుతవని; ఆదిమ మానవులనుంచీ, అధునాతన మానవులవరకూ నమ్ముతూనే వున్నారు. పెళ్లిలో ఆనందంతోనూ, కులాసాగానూ బూతులు మాట్లాడటం, కావాలని బంధువులు తగాదాలు పెంచుకోవటం కూడా చాలా యూరపియన్ రైతు కుటుంబాల్లో వంశ పారంపర్యా వొస్తున్న ఆచారంగానే కనిపిస్తుంది. యీతిట్టుకోవటం, కొట్టుకోవటం అనేది తమ బంధువులమీద గాక, ఆదుష్టశక్తులమీదనే ప్రయోగించినట్టు వారంతా భావించేవారు.

మరికొన్ని వివాహ విధానాల్లో పెళ్లికూతురు పల్లకీ ముందు కత్తిసాములు ప్రదర్శించటం కర్ర తిప్పటం మొదలైనవి కూడా, రాక్షస వివాహ లక్షణాల్ని నిరూపిస్తవి. ఆధునిక ప్రపంచంలో వీటికి మారుగా వధూవరుల ముంగు ఒక మోకు పరచటం, లేక ఒకపూల చెండును విసరటం జరుగుతోంది. ఇలా జరిగినప్పుడు, పెళ్లికుమారుడు కొంత లంచమిచ్చి, దాన్ని దాటి పోవటం ఆచారంగా వుంది.

పెళ్లివారిని మోకువేసిఆపటమనేది ఇంగ్లండ్ లోనూ వేల్సులోనూ ఆచారంగా వుంది.మరీ వేల్స్‌లోనిన్న మొన్నటి దాకా,వధూవరుల్ని ఆపటం ఎంతోవినోదంగా భావించబడేది. వివాహం నాటిఉదయం వరుడు, వధువును ఒక అధికార స్వరంతో కోరటం, ఆమె తాలూకు బంధుమిత్రులు నిరాకరించటం, ప్రతీకారంగా ఇద్దరి మధ్యా కొంతవాగ్వాదాం పెరిగి చిన్న పోట్లాటలోకి దిగటం జరిగేది. వధువు, తన బంధువుల్లో ఒకని భుజంమీద ఎక్కిపొయ్యేందుకు ప్రయత్నించడం, వరుని తాలూకు జనమంతా కేకలు వేసుకుంటూ ఆమెను అడ్డగించి, వరుడు విజయవంతంగా వధువును తనతో తీసుకొని పోవటం వివాహ కాండగా భావించబడేది. ఇలాటి నటనే స్కాట్ లండ్ లోనూ, ఐర్లండ్ లోనూ జరిగే వివాహాల్లో కూడా జరుగుతూండేది.

ఆర్కిటిక్ ప్రాంతాన్ని పరిశోధించిన నాన్సెన్ అనే ఆయన కథనం ప్రకారం—గ్రీన్‌లండ్ తూర్పుతీరంలో—పురుషునికి భార్య కావలసి వొచ్చినప్పుడు—తనకు ఇష్టమైన స్త్రీ ఇంటికి వెళ్లటం, ఆమెను జుట్టుపట్టుకొని తన ఇంటికి లాక్కురావటం ఆచారం గావుండని తెలుస్తోంది. యీ బలాత్కారాలకు ఇంకో మానసికమైన కారణం కూడా వుండివుండాలి. కన్యలు ఎంతో సిగ్గును ప్రదర్శిస్తూ, తమ ఇష్టాయిష్టాల్ని సౌమ్యపద్ధతిలో వ్యక్తపరచలేని స్థితిలో వుంటారు. అలా చెప్పగలిగే స్త్రీ సిగ్గు లేనిదిగా భావించబడుతుంది. కనుక ఆమె సిగ్గు చెడకుండానూ, మొత్తం బాధ్యతనంతనూ పురుషుడే భరిస్తూ రాక్షస వివాహపద్ధతిని అమలుజరిపేవాడు. ఇంతకు ముందు మనం తెలుసుకున్న గ్రీన్‌లండ్ వాసుల్లో ఇరుగుపొరుగుల సఖ్యత బాగా వుంటుంది. కనుక, ఒకరి వ్యవహారాల్లో ఇంకోరు జోక్యం కలుగజేసుకోరు. అంతేగాక వారిసమాజంలో ఇదే వైవాహిక విధానమైనప్పుడు, అందరూ దానికి కట్టుబడే వుంటారు.

ఎస్కిమోలలో వేరే వివాహ విధానమేమీ లేదు; భుజబలంతో ఆహారాన్ని సంపాయించుకున్నట్టే, భార్యనుకూడా బల ప్రదర్శనతోనే సంపాయించుకోవాలి. ఇక్కడ తన భావిజీవితానికి బలమైన ఆ పురుషుడే భర్త నే సంగతి వధువుకు తెలిసినా, తను లొంగిపోక తప్పదని ఆమె అందుకు సిద్ధపడ్డా, స్త్రీత్వ చిహ్నంగా భావించబడే సిగ్గును ప్రదర్శించేందుకు గాను ఆమె నిరాకరణను సూచిస్తూ కొంతవరకూ పెనుగులాడుతుంది. అందుకనే పుట్టింటి దగ్గర గడపవలసిన మొదటి శోభనపురాత్రి ఆమె వరుణ్ని దరిజేరనియ్యకుండా ఎంతో పెనుగులాడి, రక్కి, కొరికి నానారభసా చేస్తుంది; కాని అత్తవారింటికి వెళ్లిన క్షణానే ఆమె తన భర్తకు ఇట్టే లొంగిపోతుంది. ఇదేగాక ఎస్కిమోలలో పురుషుడు మొదటగా ఒక పెద్ద సీల్ చేపనుచంపి, తన పురుషత్వాన్ని ప్రదర్శించినప్పుడే అతనికి వివాహార్హత ఏర్పడుతుంది.

కొరియాజాతిలో ఇదే ఆచారం ఇంకోరూపంలో వుంది. తనకుమార్తె వివాహ వయస్కురాలు కాగానే ఆమె తండ్రి, తన కాబోయే అల్లునికి ఆమెను ఎత్తుకుపొమ్మని ఆదేశిస్తాడు. వధువు తల్లి యీ ఏర్పాటు జరిగింది కనుక, జాగర్తగా వరుని అనుసరించమని తన కుమార్తెకు బోధిస్తుంది. అంతా సక్రమంగా జరిగి, వారిద్దరూ నూతన దంపతులవుతారు.

వరుని విశేషంగా ప్రేమించినప్పటికీ, అతనికి వెంటనే లొంగిపోక కొంత పెనుగులాట వధువు పక్షాన వుండితీరాలనే ఆచారం అన్నిజాతుల్లోనూ వుంది. వివాహానికని నిర్ణయించబడ్డ గుడారంలో వధువు వివస్త్రగా నిద్రించే సమయంలో, తనకు వీలుగావున్నది కదాని వరుడు ఆమెను పొందేందుకు ఎలాటి ప్రయత్నాలూ

చేయరాదు. పోతే వధువు చూపే ఆ పెనుగులాటంతా, ఆమె తన సౌశీల్యాన్ని నిరూపించేందుకు పనే అవస్నే! అందుకనే వధువుకూడా పురుషవేషాన్ని వేసుకొని తన లాగూ చివర్లను గట్టిగా కట్టుకుంటుంది; యీ విధంగా ఆమె, చాలా సేపటి వరకూ తనశీలాన్ని కాపాడుకునే అవకాశాన్ని కలిగి వుంటుంది.

ఇక ముహూర్తంనాడు, వధువును పట్టుకునేందుకు వరుడు వెంటాడినప్పుడు, ఆమె తప్పించుకొని పరుగెత్త నారంభిస్తుంది. సమయం చూచి వరుడు ఆమెను బలవంతాన పట్టుకొని, ఆమె దుస్తుల విషయంలో ఆమెపడ్డ జాగర్త లన్నిటినీ కత్తితో ఖండించి వేస్తాడు. తన కామె ఎన్నాళ్ల నుంచో తెలిసివున్నట్టు, తన అనురాగమంతా ఆమె కోసమే నన్నట్టు ఆమెను తాకుతాడు; ఆస్పర్శతో ఆమె వెంటనే అతనికి లొంగిపోయి, తన గుడారానికి స్నేహభావంతో తీసుకు వెళ్లడంతో వివాహకాండ పూర్తయినట్టు భావించబడుతుంది.

బర్మా-చైనా సరిహద్దుల్లోని లిసూజాతిలో వరుడు కొంతమంది బంధుమిత్రులతో, ముహూర్తంనాడు వధువుఇంటికి వెళ్లటం, ఆమెను అమాంతం ఎత్తుకొని రావటం ఆచారం. ఆమెతనను ఎత్తుకెళ్లేవాళ్లను గిచ్చటం రక్కటం దూషించటం ద్వారా స్వరక్షణాన్ని నిరూపిస్తుంది. ఆమె తల్లిదండ్రులు తామేమీ చేయలేని స్థితిలోవున్నట్టు ఏడుస్తూ వూరుకుంటారు. గ్రామ సరిహద్దులదాకా యీ ప్రదర్శన జరుగుతుంది. అక్కడ వధువును వొదిలేస్తారు. అక్కడినుంచి ఆమె తన భర్తతో అత్తవారింటికి ఆనందంతో వెళ్తుంది.

పురాతన గ్రీస్‌లో—విశేషించి స్పార్టాలో రాక్షస వివాహాలు సామాన్య సంఘటనలుగా భావించబడేవి. యుక్తవయస్కురాలవగానే వధువును, వరుడు బలవంతంగా ఎత్తుకొని వెళ్లటం జరిగేది. వివాహ నిశ్చయం కాగానే వధువు తల వెంట్రుకల్ని ఆమె బంధువులు కత్తిరించి, ఆమెకు పురుషవేషం వేసి, ఆమెను ఒక చీకటికొట్లో పెట్టేసేవారు; వరుడు రహస్యంగా వెళ్లి ఆమెను ఆ చెరనుంచివిడిపించి ఇంకో శయ్యమీదికి జేర్చేవాడుఇదంతా ఎవరికీ తెలియకుండా వుండేట్టుగా, రహస్యంగాజరుపబడే కార్యకలాపంగా భావించబడేది. యీవిధంగా వధూవరులిద్దరూ కూడా తగినసమయాల్ని నిర్ణయించుకోవటంలోనూ, దొరికిన సమయాన్ని జాగర్తగా ఉపయోగించుకోవటంలోనూ, తెలివితేటల్ని ప్రయోగించేవారు. దీన్ని కూడా రాక్షస వివాహ పద్ధతిగానే గుర్తించవలసి వుంటుంది.

సాంఘికంగా ఉన్నతమైన స్థానాల్లోవున్న వారి వివాహ విధానంలో యీ రాక్షసత్వం మరింత సున్నితరూపాన కనిపిస్తుంది. వధువు జుట్టును కొద్దిగా ఒక బల్లెంమొనతో తొలగించటం, అదీ ఏ యుద్ధంలోనో ఎక్కువ మానవరక్తాన్ని చవిచూచిన బల్లాన్ని ఎన్నుకోవడం జరిగేది. యీకాండ జరగగానే వధువు వరుని

ఇంటికి తీసుకొని వెళ్ళబడుతుంది. అక్కడ ఆమె గుమ్మాల్ని దాటకూడదు. వరుడే ఆమెను ఎత్తి గుమ్మాన్ని దాటుతాడు. అప్పుడామెను బలాత్కారంగా రాక్షస వివాహ విధానంలో భార్యగా తెచ్చుకోవటం పూర్తవుతుంది. వధువు గుమ్మాన్ని దాటకూడదనే యీ ఆచారం దాదాపు లోకమంతటా వున్నదే! ఇండియా, జావా, చైనా, మొదలైన తూర్పు దేశాల్లోనూ, దాదాపు అన్ని పశ్చిమ దేశాల్లోనూ నేటికీ ఆచారంగానే నిలబడివుంది.

వధూవరులు తమలో తామే ప్రేమించుకొని, ఎవరికీ తెలియకుండా లేచి పోయి వివాహమాడటం, ఆధునిక ప్రపంచంలోని యువతీయువకులే కనిపెట్టారనుకోవటం పొరపాటు; దానికీ బోలెడు చరిత్రవుంది. మానవ సమాజాల్లో వధూవరుల తల్లిదండ్రుల ఆజ్ఞల్ని ధిక్కరించి వివాహం చేసుకునే పద్ధతి ఇదొక్కటేనని చెప్పవచ్చు. ఇక మిగతా కారణాల విషయంలో—వివాహపు అంత్యస్థితి అయిన, శోభనపురాత్రిని మొదలు పెట్టేందుకుకానీ, వధూవరుల స్వేచ్ఛను నిరూపించుకునేందుకానీ, యీ 'లేచి పోవడం' ఆదిమ మానవుల నుంచే అమలు జరుపబడేదిగా వుంది.

దంపతులయేందుకు, లేచిపోవట మొక్కటే ఆచారంగా కొన్నిజాతుల్లో పాతుకొని పోయింది. డకోటా ఇండియన్‌లలో రెండురకాల పెళ్లిళ్లు వున్నవి. ఒకటి వధువును కొనుక్కోవటం, రెండు ఎవరికీ తెలియకుండా వధువుతో లేచి పోవటం. ఇలా లేచిపోయిన వధూవరుల్ని, ఇతర దంపతులవలెనే సంఘం ఆమోదిస్తుంది; ఏనాటికైనావారు తిరిగివొస్తే వారి పూర్వగౌరవం పునరుద్ధరించ బడుతుంది. మరికొన్ని సంఘాల్లో—వధువు తండ్రికి కోరినధనమిచ్చి, అతనే యీ లేచి పోవటానికి తగిన సదుపాయాలు కల్పించి, తన కుమార్తెకు పెళ్లయిందనిపించుకోవటంకూడా వుండేది.

అరిజోనాలోని హెవాసుపాయ్ జాతిలో వధువు తల్లిదండ్రులు తమ కుమార్తెను అమ్మేందుకు ఒప్పుకోనప్పుడు, వరుడు ఆమెను తనతో లేవదీసుకొని పోగలిగితే, ఆమె తల్లిదండ్రుల ఆటంకాలన్నీ తీరినట్టే! ఆ సమాజాచారాల్ని బట్టి వధూవరులమధ్య స్త్రీ పురుష సంబంధం ఒకసారి జరిగినట్టయితే, వారిని విడదీసేందుకు ప్రయత్నించేహక్కు ఎవరికీ వుండదు.

ఇదేవిధంగా థామ్సన్ ఇండియన్‌లలో—లేచిపోయిన తనకుమార్తెను తిరిగి ఇంటికి తెచ్చుకోగలిగిన ఆమెతండ్రి, ఆమెను లేపుకుపోయిన యువకునికి మర్యాదగా తిరిగి అప్పగించవలసిన సాంఘికాచారం వుంది.

యీ లేచి పోవుటమనేది ఆస్ట్రేలియా అడవి జాతుల్లో మరీ విపరీతంగా కనిపిస్తుంది. వారిలో వివాహాలు అయేందుకు ఇదొక్కటే అవకాశం. ఎందుకనంటే ఆ జాతుల్లో స్త్రీలు తక్కువ కావటమే కాకుండా, కుల పెద్దలూ, గ్రామపెద్దలూ,

ఇతరత్రా పటుకుబడి వున్నవారు, ఎక్కువమంది భార్యల్ని స్వంతంచేసుకోవటం వల్ల, మిగతా యువకులకు భార్యల కొరత ఏర్పడటం, అది ఇలా లేచి పోవటం ద్వారానే తీరటం పరిపాటి.

ఐతే లేచిపోయి వివాహమాడటాన్ని అంగీకరించే సమాజాల్లోనే ఇంకో ఆటంకం కూడా వుంది. వధూవరుల తాలూకు బంధుత్వాలు వివాహార్హతను కలిగి వుండనందువల్ల, ఆవివాహాన్ని సమాజం ఆమోదించదు; అలాటి పరిస్థితుల్లో వారిద్దరూ లేచిపోయి దంపతులైతే మాత్రం వారికి కఠినశిక్ష తప్పదు. ఇలాటి నిషేధాలూ నిబంధనలూ ఎంతో పట్టింపుగా భావించబడేవి.

యీ వరసల పట్టింపులేనట్టయితే, లేచిపోయిన యువతీ యువకులు దంపతులవలెనే జీవితాల్ని గడపే అవకాశం వుండేది. కాని వధువును ప్రధానంగా బడసిన యువకునితో యీకొత్త వరునికి యుద్ధం మాత్రం తప్పదు! ఒక వేళ ఆమె, అంతకు పూర్వమే వివాహిత ఐనట్టయితే, ఆమె భర్తతో కయ్యం తప్పనిసరి! మరికొన్ని సందర్భాల్లో ఉభయ పక్షాలా కొంతమంది జనంపోగై యుద్ధంచేసి, గెలిచిన పక్షంలోని పురుషుడే ఆస్త్రీని భార్యగా చేసుకునే హక్కును, సంపాయించవలసి వుండేది.

వల్లారీ జాతిలో—పరపురుషుని భార్యతో లేచిపోయిన వానికి విధించే శిక్ష విచిత్రంగా వుంటుంది. అతనికి ఒకే ఒక బల్లాన్ని ఇచ్చి, యువతి తాలూకు స్త్రీలందరికీ తలా వొక బల్లాన్ని ఇస్తారు. ఆయువకుడు యీస్త్రీలందర్నీ జయించినట్టయితే, ఆమెను తన భార్యగానే వుంచుకోవొచ్చు.

టూకొక్కమాన్స్ జాతిలో కన్యవివాహం, ఆమె తల్లిదండ్రుల ఇష్టాయిష్టాల ప్రకారం జరక్కపోయినా, ఆసమాజాచారలు అంగీకంస్తవి. తల్లిదండ్రులు అనుమతించనప్పుడు, యువతి యువకునితో లేచిపోయి, పొరుగు జాతిలో తలదాచుకుంటుంది. ఇదొక ఆచారంగా పరిగణించబడటంవల్ల, ఆజాతుల్లో ఇలాటి దంపతులకు స్వాగతంవుంటుంది; యీలోగా ఆరెండు జాతుల పెద్దలూ కలిసి మాట్లాడటం, తమ కన్యకుగాను ఆమె తల్లిదండ్రులు కొంత ధరను కోరటం, అది చెల్లించబడగానే, వారీ వివాహానికి అంగీకరించటం, ఆదంపతులిద్దరూ తిరిగి తమ జాతిలోకి వొచ్చేయటం జరుగుతుంది. ఐతే ఏ 6 నెలలపాటో, సంవత్సరంపాటో వధువు పుట్టింటిలోనే వుండాలి; యీకాలంలో వరుడు రహస్యంగా ఆమెను కలుసుకుంటూనే వుంటాడు. ఆతరువాత వారిద్దరూ దంపతుల వలెనే వేరే కాపరం చేస్తారు.

మెజియన్ అరబ్బులలో రాక్షస వివాహంతోపాటు లేచిపోవటంకూడా మిళితమైన ఒక ఆచారంవుంది. వరుడు, వధువును పట్టుకునేందుకు ప్రయత్నించినప్పుడు, ఆమె చిక్కకుండా పరుగెత్తి అంతకు ముందుగానే ఆమె బంధువర్గాల

వారు సిద్ధంచేసిన ఒక రహస్యస్థలానికి వెళ్తుంది. యీ ప్రదేశం సామాన్యంగా ఏకాంతంగా వుండి, కొన్నిరోజులపాటు సరిపడే ఆహారపదార్థాలతో నిండి వుంటుంది. ఆమెను వెన్నాడిన వరుడు, యీ ప్రదేశంలోనే ఏకాంతంగా ఆమెను కలుసుకొని, కొన్నాళ్లపాటు అక్కడే కాపరంచేస్తాడు. తరువాత వారిద్దరూ దంపతులుగా తమ గ్రామానికి వెళ్లటం, అప్పటికి ఆమె గర్భంధరించినట్లయితే ఒక సంవత్సరంపాటు పుట్టింటిదగ్గరేవుండి, ఆ తరువాత అత్తవారింటికి వెళ్లటం ఆచారం.

ఇండియాలోని సాలిగాస్ జాతిలో—యువతి వివాహానికి తన అంగీకారాన్ని తెలియపరిచాక, యువకునితో కలిసి లేచిపోవటం, ఆతరువాత తమ గ్రామానికి తిరిగివొచ్చి, బంధుమిత్రులకు పెద్దవిందులివ్వటం ఆచారం.

చిట్టగాంగ్ పర్వత ప్రదేశాల్లోని ఛుకుమా జాతిలో—లేచిపోయి వివాహమాడే పద్ధతిని శాస్త్రీయంగానే పరిగణిస్తారు. మొదటిమూడుసార్లు ఎవరికీ తెలియకుండా యువతీయువకులు లేచిపోవటం గాక, నాలుగోసారికూడా విజయవంతంగా వారు లేచిపోగలిగినప్పుడే వారిని దంపతులుగా పరిగణిస్తారు. ఐతే వివాహానికి వేరే ఆటంకాలేమీ లేనప్పుడు యీ లేచిపోవటమనేదాన్ని వారు చూసీ చూడనట్లే వూరుకోవటం జరుగుతుంది.

ఆధునిక వివాహ పద్ధతుల్లో రాక్షస వివాహ చిహ్నాలు ఎంతో స్పష్టంగా నేటికీ కనిపిస్తవి. ఒక్క చరిత్రద్వారానే కాకుండా, వివాహసంస్థ ఆదేశించిన కట్టడుల్లోకూడా యీ రాక్షస పద్ధతికి ఎంతో స్థానంవున్నట్లు తెలుస్తుంది. ఐతే యీ పద్ధతులు వేరువేరు జాతుల్లో వేరువేరు రూపాల్లో మాత్రమే కనిపిస్తవి.

వధువుతోపాటు ఆమెతాలూకు ఆడజనం విచారాన్ని సూచించటం, ఏడవటం మొదలైనవన్నీ కూడా— తమ తాలూకు స్త్రీని ఇతరులే ఎత్తుకొని పోతూన్నప్పుడు కలిగేబాధను వ్యక్తపరుస్తవి. అంతేగాక స్త్రీత్వ చిహ్నమైన వారిసిగ్గు యీ కన్నీటి రూపంలో రుజూచేయ బడుతుంది.

స్త్రీనికూడా ఆస్తివలె చూడటం, ఆమెమీద సర్వాధికారాల్నీ పురుషుడు కలిగివుండటం అనేక సమాజాలు అంగీకరించిన హక్కులు. పురుషుడే తనఉంగరాన్ని భార్యకు ఇవ్వటంతో, తన అముద్రతో ఆమె తనకు స్వాధీనమైన చిహ్నాన్ని నిరూపించటంగా మనం చెప్పుకోవొచ్చు. పూర్వీకుల్లో బలత్కారంగా బందీలుగా తెచ్చుకోబడ్డ స్త్రీలతాలూకు బానిసత్వ చిహ్నమే, వివాహంలో వరుడు, వధువుకు బహూకరించే ఉంగరంద్వారా వ్యక్తమౌతుంది.

ఇలాటి ఆచార వ్యవహారాలే లోకంలోని వివాహ విధానాల్లో ప్రచ్ఛన్న రూపంలో వున్నవనేందుకు ఎలాటి సందేహమూ అక్కర్లేదు.

—[ x ]—



# * శాపగ్రస్థులు *

రచన:
మొపాసా

అనువాదం:
'శేషబాబు

స్పెలవల్లో స్నేహితుణ్ని చూసేందుకు వెళ్ళాను. ఆపట్టణంలోని అనేకుల్తో నాకు పరిచయమైంది. ఎన్నోప్రదేశాల్ని వాడు నాకు చూపాడు.

మనం అన్నీ చూశాం.... మరొక్కటి మాత్రమే చూడాలి. దాంతో చూడాల్సిన వన్నీ పూర్తవుతవే అనేభయం మాత్రం వుంది !" అన్నాడువాడు.

వాడి ఓపికకు నాకు నిజంగా ఆశ్చర్యం కలిగింది. కాని వాడి ఉత్సాహాన్ని పాడు చేయకుండా, నేను ఓపికతోనే వాణ్ని అనుసరించాను.

"ఆశాపగ్రస్థను నువ్వుతప్పకచూడాలి !" అన్నాడు మళ్ళీ.

ఏదో మానవత్వానికి సంబంధించిన విషయాన్నిగూర్చి తెలుసుకునేందుకు నాలో కొత్తరకం కుతూహలం చెలరేగింది. అన్నాను: "ఎవరూ ? శాపగ్రస్థ అంటావేమిటి?"

"ఆమెపరమ అసహ్య కరమైన జీవి. ఇక్కడ అందరూ 'ఆడదెయ్యం' అంటారామెను. ఆమె సంతానమంతా—ఎంతో అసహ్య కరంగానూ, భయంకరంగానూ, చూస్తే రక్షరేకు కట్టించుకోవాలేమోనని పించేట్టుగా వుంటారు. ఐతే యీరకం పిల్లలకు ఆమెతల్లి ఐనందుకు ఆమెమీద జాలి చూపాల్సిన అవసరంలేదు. ఎందుకనంటే ప్రజల వినోదం కోసం ప్రదర్శనాల్ని ఇస్తూ

దేశమంతటా తిరిగే ప్రదర్శననిర్వాహకులు. కొంతమంది మనుషుల అంగవైకల్యాన్ని మాత్రం ప్రదర్శించి, ప్రేక్షకుల్ని నవ్వించి, ఆ అంగవైకల్యం తమకు లేనందుకు గర్వపడేట్టుచేసి డబ్బుచేసుకొంటారు. అదే పద్ధతిలో ఆమెకూడా డబ్బుచేసుకోగలుగుతోంది."

"ఆడవిజాతి మనిషల్లేవుందే!.... లేక ఆపిల్లల్ని ఇంకో విధంగా ఉపయోగించుకోలేనంత బీదదేమో?"

"అది కాదురా అబ్బీ! ఇదంతా తెలిసే, చాలా పట్టుదలతో కేవలం డబ్బుసంపాయించేందుకని ఆపిల్లల్ని కంటుందంటే నువ్వునమ్మవు. నేను ఎగతాళికి చెప్పటం లేదు; ఆమె యీఅంగ వైకల్యాల్ని కనటాన్ని వినోద ప్రదర్శనాల మేనేజర్లు ఎంతైనా అభినందిస్తారు; ఆమెకు ఎంతో డబ్బిచ్చి యీసత్కార్యానికి మహారాజపోషకులుగా కూడా వుంటారు."

"చాలా భయంకరంగా వుందే!" అన్నాను.

"యీసంగతి అందరికీ తెలిసిందే.... ఐతే చాలాకొద్దిమందే దీన్నిగూర్చి ఆలోచిస్తారు. విషయాన్ని వున్నది వున్నట్టుగా చూడటంకూడా అరుదే! ఆమె పదకొండు మంది పిల్లల్నికన్నది. ఆమె ప్రస్తుతస్థితిలో భాగ్యవంతురాలనే చెప్పవలసి వుంటుంది. యీ రకం మనుషులు బాగాడబ్బుచేసుకుంటారు.... నువ్వేచూద్దువు కాని.... మనం వెళ్ళేదారిలోనేలే!"

నడక ప్రారంభిస్తూ అన్నాను: "చెప్పు! వినాలని నాకెంతో కుతూహలంగా వుంది. ఆమె చిన్నతనమంతా విచిత్ర సంఘటనలతోనూ. అసాధారణమైన పరిసరాల్లో పెరగటంలోనూ గడిచి వుండాలి."

ఇద్దరమూ నడక సాగించాం.

• • •

ఆమెఇల్లు చిన్నదైనా ఎంతోపరిశుభ్రంగా వుంది. ఇంటిముందున్న పూలతోట ఎంతో ఆకర్షణీయంగా వుంది. రోడ్డుమీదికే ఉండటంవల్ల ఆఇంటికి ఒక ప్రత్యేకత వున్నదని చూడగానే తోస్తుంది.

దాసీది మమ్మల్ని లోనకూర్చోబెట్టి, తన యజమానురాల్ని పంపేందుకు వెళ్ళింది.

ఆమె....వయస్సు: నలభై ఏళ్లుంటవి. పొడుగ్గా, బలంగానేవుందికాని ఆమెలో సౌకుమార్యత చాలాతక్కువని తోస్తుంది. ఆరోగ్యంగానేవుంది. కాని ఆమెనుచూస్తే సగం మానవలక్షణాలూ, సగం జంతులక్షణాలూ వున్నట్టు తోస్తుంది. అవుళ్లో తనంటే ఎంతోజుగుప్స, అసహ్యంప్రజల్లో వుందని ఆమెకు తెలుసనుకుంటాను. అందుకనే ఆమె మమ్మల్ని ఒకరకంగౌరవంతోనూ, ఒకరకం నిర్లక్ష్యంతోనూ చూసింది.

అతాత్తుగా, "మీకేంకావాలి?" అందామె.

నాస్నేహితుడుకూడా యీ ప్రశ్నకు ఇదివరకే జవాబు సిద్ధంగా వుంచుకున్నట్టు వెంటనే అన్నాడు: "నీచివరిబిడ్డ చాలా సాధారణంగా—ఇతరబిడ్డలవలెగాక, అంగవైకల్యాలేమీ లేకుండా వున్నాడని విన్నాను. అదినిజమేనా? తెలుసుకోవాలని వొచ్చాను."

ఇంతవరకూ నేనుజీవితంలో ఎరగని ఒక చూపును ఆమె ప్రసరించింది. ఆమెలో కొద్దిగా కనిపించిన గౌరవం మాయమైంది.

వాళ్ళుతెలియనికోపం ఆమె శరీరాన్ని కమ్ము కొని, దురాశా, జానిసత్వం, మొదలైనవి స్పష్టంగా బైటపడినవి.

"లేదు....మిగతా వాళ్ళకన్న వాడుమరీ అందవిహీనంగా వున్నాడు. నేనుచాలా దుర దృష్ట వంతురాల్ని ! నాబిడ్డలందరూ వికృ తాకారులే / నిరాధారమైన నాలాటిస్త్రీకి యీ వికలాంగుల్నీ. వికృతరూపుల్నీ ఇవ్వటం భగవంతు డికి న్యాయమంటారా ?" అం దామె, పదునైన కంఠధ్వనితో.

ఆమెమాటల ధోరణి—ఏదో పెద్దనేరాన్ని చేసి, కేవలందాన్ని కప్పిపుచ్చేందుకు ధర్మ పన్నాలు ఏకరువుపెట్టే నేరస్తు రా లి వ లె తోచింది. తోడేలల్లే మీదపడి కరిచేట్టుగా మాట్లాడుతుందను కున్నానుకాని. ఏదోమా సానుభూతిని సంపాయించేందుకల్లే, తన నేరానికి భయపడి, బలవంతాన తగ్గి మాట్లా డింది.

"నీబిడ్డను చూడాలని వుంది" అన్నాడు అతను.

క్రమంగా ఆమెముఖం ఎర్రబడ్డది. కాస్త ఆగి "అందువల్ల ఏంప్రయోజనం ? "అని ముఖంపైకెత్తి, నిప్పులు కురిసే చూపులతో మా మొహాల్లోకి చూసింది.

"మేంచూడటం నీకెందుకు ఇష్టంలేదు? నీబిడ్డల్నీ ఇదివరకు చాలామందికి చూపావు ....ఆసంగతి నీకు తెలుసుకదా! "అన్నాడు అతను, చాలాధైర్యంతో.

ఆమెదెబ్బతిన్నట్టుగా కుంచుకుపోయింది. ఆమెకోపంతో వాణికిపోతూ — "ఐతే మీ రిక్కడికి వొచ్చింది ఇందుకన్నమాట ! నన్ను అవమాన పరిచేందుకు / మీరువాణ్ని చూసేందుకు వీల్లేదు. తిరిగి వొచ్చిన దారినే వెళ్ళండి" అని రెండుచేతుల్నీ నడుంమీద బిగించి ఆమె మావైపు రాసాగింది.

పెద్దగా, తీక్షణంగావున్న ఆమెగొంతుకు జవాబుగా కాబోలు—అవతలి గదిలోనుంచి చిన్నమూలుగు, ఆతరువాత ఎంతో బాధా కరమైన ఏడుపు వినబడింది. దానికి మే మిద్దరమూకూడా వొణికిపోయాం.

"జాగర్త ! శాపగ్రస్థురాలివి ! కల్మ షాత్మతో యీపని నీవు చేయలేవు. ఒకనాటి కైనా అది నీదురదృష్ట దేవతేనని గ్రహి స్తావు !" అన్నాడు, అతను.

యీ మాటలకు ఆమె కోపం మరింత హెచ్చింది, చేతులుముడిచి గా లి లో కి విసురుతూ అంది : "పోండి .... ఇద్దరూ పోండి....నాకు దురదృష్టం వొస్తుందా ? మీతరంకాదు....నాకన్న మీరంతా అదృష్ట వంతులాయేం ? ...."

యీసమయంలో మేమెలాగో దూసుకొని బైటపడక పోయినట్టయితే, ఆమె మామీద దూకేదే /

రోడ్డుమీదికి వొచ్చాక "ఆమెను గూర్చి నీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడుఅతను.

నుదురు తుడుచుకుంటూ జవాబిచ్చాను.

"ఇలాటి ప్రదేశాలు ఇం కా లేవను కుంటాను. కుతూహలమంతా తీరేందుకు ఇదొక్కటే / చాలు....ఆమె కథచెప్పటం మరిచిపొయ్యావ్"

"లేదు....చెప్తాను"

అతను చెప్పనారంభించాడు:

• • •

"పూర్వం ఆమె పొలంలో ప ని చే సే

కాలీదిగా వుండేది. దారుఢ్యంగానూ, ఎంతో కష్టించి పనిచేసేదిగానూ, మితవ్యయగానూ జీవితాన్ని గడిపేది. ఆమె జీవితానికి రెండే రెండు లోపాలు ఉండేవి; అవి— ఒకటి ఆమెకు ఒకప్రియుడు లేకపోవటం; రెండు: కనీసం, తనకోప్రియుడు కావాలనే వాంఛ ఆమెకు లేకుండటం.

కాని ఒక సాయింత్రాన ఆమెతన శీలపు శిఖరాన్నుంచి కిందపడింది. కోతలుసమయం—అన్ని వైపులా గాలి బిగిసిపోయింది. ఒక పక్క ఆకాశమంతా మేఘావృతమై వుంది; ఉరుములూ మెరుపులూ ప్రారంభమైనవి. వాతావరణమంతా ఎంతో వేడిని విడుదల చేయసాగింది. శరీంలోని మూల మూలలా దాగివున్న చెమటంతా వెనువెంటనే బైటికి రాసాగింది. ఆ వాతావరణంలోనే ఆమె తన కన్యాత్వాన్ని కోల్పోయింది.

త్వరలో నేతానుగర్భవతి అనిఆమెతెలుసుకుంది. ఆమె సిగ్గుతో, భయంతో కుంగిపోయింది. చివరకు తన యీ అవస్థ బైటపడకుండా దాచేసేందుకే నిర్ణయించుకుంది. ఆమె బీదత్వంలో, అమాయకత్వంలో ఆమెకు ఒకే ఒక్క ఉపాయం తోచింది. పెరిగే గర్భం పైకి పొక్కకుండా వుండేందుకుగాను, దాన్ని గట్టిగా బిగించి కట్టెయ్యటం—అదెంతో బాధగానే వుండేది; ఏమైనా ఆమె ఆబాధకు సిద్ధమైందనే చెప్పాలి. దీనిగ్గాను ఆమె చాలా గట్టిగా వుండే ఒకబెల్టును తయారు చేసుకుంది; దానిపనల్లా గర్భాన్ని బలవంతాన తొక్కిపట్టటమే!

గర్భం పెరిగేకొద్దీ ఆమె బెల్టును మరెంత బిగించి కట్టసాగింది. ఆమె బాధతో గిలగిలా తన్నుకునేది; ఐనప్పటికీ ధైర్యంతోదాన్ని ఎదుర్కొంది. తన స్థితి ఇతరులకు తెలియకుండా వుండేందుకు, ఎప్పుడూ చిరునవ్వుతో, ఇంకా కష్టించి పనిచేసేందుకు సిద్ధంగా వుండేది. ఇన్ని జాగర్తలు తీసుకోవటంవల్ల ఆమెను ఎవ్వరూ అనుమానించలేదు.

యీవిధంగా ఆమె కనిపెట్టిన క్రూరమైన ఆ ఆయుధంద్వారా, తన గర్భస్థ శిశువును వికార స్వరూపుడుగా తయారు చేసింది. దానిఫలితంఏమిటో నాకు తెలియదు; పుట్టిన బిడ్డనుకూడా నేనువర్ణించి, నీకు అర్ధమయేట్టు చేయలేను: వైద్యశాస్త్రజ్ఞులు పరిశోధించే 'మానవరాక్షస శిశువులు'-అన్నారు. వినోద ప్రదర్శనాల్లో హాస్యగాళ్ల వికృత రూపాలూ, మొదలైనవి చూసివున్ననీకు, ఆమె బిడ్డ ఎలావుండేవాడో వూహించుకోవటం కొంతతేలిక! ఆమెబిడ్డ—అబ్బ! —తలుచుకుంటేనే వొళ్లుగగుర్పుడుతుంది!

వసంత ఋతువు ప్రవేశంలో, పొలాల్లో పనిచేస్తూండగా ఆమెకు పురుడు వొచ్చింది. పొలాల్లో పనిచేసే ఇతరులంతా ఆమె సహాయానికి వొచ్చారు; ఆమెకన్న బిడ్డనుచూసి, భయపడి ఒకరొక్కరే పొలాలకు అడ్డంపడి పరుగెత్తారంటే నమ్ము!

ఆమె యీలోకంలోకి ఒక భయంకర మానవుణ్ని కొని తెచ్చిందనేమాట, దేశమంతటా పాకిపోయింది. అదేదో గొప్ప విచిత్ర మన్నట్టు ప్రజలే ఆవార్తను పాకించేశారు. అందుకనే ఆనాటినుంచే ఆమెను 'ఆడదెయ్యం' అని పిలవసాగారు.

ఆమె పనిలోనుంచి తొలగించబడింది.

ఆమె లోకుల చందాల మీదా, ఆడదానిప్రత్యేక ఆయుధాన్ని జీవనాధారంగా ఉపయోగించి బతకసాగింది. చూపులకు ఆమె బాగానే వుంటుంది, యీ మొగాళ్ళందరూ పవిత్రులు కాదుగా! కనుకనే ఆమె అనుకున్నంత అధ్వాన్నం కాలేదు.

ఆమె జుగుప్సతోనే, అసహ్యంతోనే ఆపిల్లవాణ్ని పెంచింది. యీప్రభుత్వ చట్టాలే అడ్డంరానట్టయితే, ఆమె తన ఆ రాక్షసరూపుణ్ని పుట్టిన క్షణానే చంపిపారేసేది! ఆసంగతి ఆమే అనేకసార్లు బహిరంగంగా అనేకమంది దగ్గరఅంది.

ఇక్కడికి దగ్గర్లో వినోదప్రదర్శనాల్నిచ్చేందుకని వొచ్చిన ఒక సర్కస్ తాలూకు మేనేజర్ — మెలికలుతిరిగి, అతి అసహ్య కరంగావున్న ఆమె కొడుకును గూర్చి విన్నాడు. ఆమెదగ్గరకు వెళ్ళి, ఆ బిడ్డనుచూసి, తనకాబిడ్డను ఇచ్చేసినట్టయితే, ఐదువందలఫ్రాంకులు ఇస్తానన్నాడు

అసలు మొదట్లో ఆబిడ్డను చూపేందుకు ఆమెసిగ్గుపడ్డది; కాని తాను అసహ్యించుకొనే ఆబిడ్డద్వారా కొంతడబ్బు ముట్టుతుందని గ్రహించగానే అన్నిటికీ ఆమె ఒప్పుకుంది. తనకు ఆబిడ్డ జీవితాంతంవరకూ వొదిలిపోవటమేగాక, డబ్బుకూడా బాగా వొచ్చినందుకు ఆమె ఆనందించింది; ఆ బేరాన్ని వెంటనే ఖాయం చేసుకొని, బిడ్డను అమ్మేసింది.

తానుఅనుకున్న దురదృష్టం, రంగు మార్చుకొని అదృష్టంగా మారటంతోఆమె బుర్రతిరిగిపోయింది. ఆ క్షణంనుంచే — మొదటిబిడ్డను పోలిన రెండోబిడ్డను కనాలనేవాంఛ ఆమెలో అతితీవ్రంగా పనిచేయసాగింది.... యీసారి పుట్టబొయ్యే బిడ్డను ఇంకా ఎక్కువధరకు అమ్మెయ్యాలనీ, ఒక్కసారిగా డబ్బుగుంజుకోకుండా ఏదాదికి నాలుగువందల ఫ్రాంకులచొప్పున తీసుకుంటూవుండాలని నిశ్చయించుకుంది. రూపవతిఐన యువతి, ఆకర్షణీయమైన, విలువైన దుస్తుల్ని ధరించి వ్యభిచారపు విలువను పెంచి, విలాస పురుషులనుంచి ఎక్కువ డబ్బుగుంజేందుకు ఎలాప్రయత్నిస్తుందో — అదేవిధంగా యీ తల్లి — తనసంతానంలో ఏర్పడే వికృత, వికలాంగాలమీద ఎక్కువ డబ్బు గుంజుకునే అవకాశం వున్నదనే సత్యాన్ని అమలు జరిపేందుకు ప్రయత్నించింది. సౌందర్యానికి యీలోకంలో ఎంత విలువవుందో వికృతానికికూడా అంతే విలువ వుండేమో?

ఆమె యీ ప్రయత్నంలో విజయాన్ని సాధించగలిగింది; తనకు కలిగే బిడ్డల్లో వివిధవికృతాల్ని సృష్టించేందుకని, ఆమె తన పటకాను రకరకాలుగా, స్థానాల మార్పుతో బిగించసాగింది. దురదృష్ట వశాత్తూ ఒకబిడ్డ చనిపోయాడు: ఎంతో ప్రేమతో పెంచేతల్లి తనబిడ్డను పోగొట్టుకున్నప్పుడుకూడా, యీమెవలె ఏడ్చి వుండదు! తనకు పోయిన డబ్బుకోసమే ఆమె భోరున ఏడ్చివుంటుందనుకో! యీ సంగతులన్నీ తెలిసిన ప్రజలు, యీ భయంకర మాతృత్వానికి ప్రయత్నించే ఆడదెయ్యాన్ని గూర్చి హడలిపోయారు; కోపోద్రిక్తు లయ్యారు. చట్టం ఏమైనా సహాయం చేయగలుగుతుందేమోనని ప్రయత్నించారు; కాని

చట్టం ఏనేరాన్నీ రుజూచేయలేక పోయింది. ఆమెకు మనశ్శాంతి నిలబడిపోయి, వ్యాపారంలో కొత్తరకం ఉత్సాహంకూడా వొచ్చి పడింది.

ఆమెబిడ్డల్లో ఎంతమంది ఇప్పుడు బతికి వున్నారో నాకు సరిగ్గా తెలియదు. కాని ఆమెఆదాయం ఏడాదికి ఐదారువేల ఫ్రాంకులకు తక్కువలేకుండామాత్రం వుంటుంది. ఇంకా అమ్మకంకాని ఆమె చివరి బిడ్డనే చూసేందుకు మనం ఇందాక ప్రయత్నించాం. ఆబిడ్డను ఆమె ఎక్కువకాలం తన దగ్గరవుంచుకోదు. యీ లోకంలో వికృత మానవులమీద వ్యాపారం చేయగలిగిన వాళ్ళందరికీ ఆమె తెలుసు !"

♦ ♦ ♦

నాస్నేహితుడు మౌనంగా వున్నాడు. ఆమెమీద అసహ్యంతోపాటు, ఆమె యీ క్షణంలో నాఎదుటేవుంటే పీక నులిమేద్దామన్నంత కోపంకూడా వొచ్చింది.

అన్నాను : "చుట్టూ యీ సముద్రము నీలాకాశము, యీ అందమైన పూలతోటలు, ప్రకృతిలో పెరిగే అనేక సుందరజీవులు —వీటన్నిటిమధ్యా, జంతుజాలంలోకల్లా చక్రవర్తయిన మానవుడే యీ వికృత రూపాల్ని సృష్టించేందుకు ప్రయత్నించటం ఎంతదారుణం !"

"ఆపాఠాల్నే యీప్రకృతి నేర్పుతుందా? యీఆడవాళ్ళు—కావాలని బిగించి గర్భం కనిపించకుండా వుండేందుకని చేసే యీ సాహసాలు—కాదు ఘోరాలు ! గర్భాన్ని ధరించేందుకు స్త్రీత్వమే చాలుననే న్యాయం కాకుండా, వివాహంకావాలని, అంతవరకూ బలవంతాన్నైనా ప్రకృతివాంఛలకు లొంగ కూడదని—దానికివ్యతిరేకిస్తే సాంఘిక పతనమే శిక్షని నమ్మినంతకాలమూ — యీ అవస్థ తప్పదేమో ? యీవిధంగా చేయటం వల్ల ఒకనాటికి మానవులంతా తిరిగి కోతులుగా మారాల్సి వుంటుందేమో! అందులోనూ దీన్ని వ్యాపారంగా చేసేవాళ్ళే అధికమైతే ఇంకచెప్పనక్కర్లేదు"

మధ్యలో అడ్డుతగిలి "ఐతే యీ బిడ్డలందరికీ తండ్రి....? " అన్నాను.

"నాకు తెలియదు; ఆమెకుతప్ప ఇంకెవరికీ తెలియదనుకుంటాను. తండ్రి ఒకడో .... కొంతమందో ? వాళ్ళకు స్త్రీ ఐన ఆమె కన్న, ఎక్కువ సిగ్గు వుందనుకుంటాను; అందుకనే వాళ్ళు బైట పడకుండా తెర చాటునే వుండిపొయ్యారు- వాళ్ళల్లో వాళ్ల యీ లాభాలు పంచుకుంటారనుకుంటాను.... కాని, నా అనుమానం ఏమిటంటే ఆ బిడ్డలందరికీ ఒక్కడే తండ్రిని; ఎందుకంటే— యీ లాభాల్ని ఎక్కువమందికి పంచుతే, భాగాలు తక్కు అవుతయ్ కదా ! "

♦ ♦ ♦

కొన్ని సంవత్సరాల తరువాత, ఒకనాడు నా డాక్టర్ స్నేహితుడితో సముద్రపు వొడ్డునే నడుస్తున్నాను. ఇద్దరుయువకులతో చేతులు కలిపి, ఎంతో ఆనందంగా, కులాసాగా అందమైన ఒక యువతి సముద్రపు అంచులమీద నడిచి వెళ్తూవుంది. ఆమె ఆనందాన్ని చూస్తుంటే నాకే ఆనందం కలిగింది. ఆమె డాక్టర్ వైపు చూసి చిరునవ్వు వొలక బోసింది.

మరి కొంత దూరం నడిచాక, ఒక దృశ్యం నన్నాకర్షించింది. ఒక నర్స్ పర్యవేక్షణలో ముగ్గురు పిల్లలు ఇసుకలో ఆడుకుంటున్నారు. ఆ ముగ్గురూ ఎంతో వికృతంగా, చూసేందుకు భయంకరంగా, మానవ శిశువులేనా అన్నట్టు వున్నారు.

"ఇంతకు ముందు మనకు ఎదురైన—ఆ అందమైన యువతి బిడ్డలు!" అన్నాడు. డాక్టర్,

"పాపం! యీ బిడ్డల్ని గూర్చిన బాధ భరించ లేకనే, ఆమె తన మనస్సును వేరు విధాలుగా తిప్పుకునేందుకు ఇదంతా మరిచి పొయ్యేందుకు గాను షికారు వెళ్ళిందనుకుంటాను" అన్నాను.

డాక్టర్ అన్నాడు: "నిజమే! కాని ఆమెను 'పాపం' అని జాలి తలవ కూడదు. ఆమె చిరునవ్వు కావాలని తెప్పించుకున్నది కాదు; దానంతటదిగా, లోనిదురాశ ప్రదర్శించే ఒక ఆనందాన్ని నిరూపించేదిగా సముద్రపు అలల్లే వొచ్చి పడుతోంది.... కాని ఆజాలిని యీ బిడ్డలమీదచూపు. నిజానికి వీరే సానుభూతికి అర్హులు .... ఆమె కావాలని, తన అందం, ఆకర్షణ చెడకూడదనే దురుద్దేశంతో, తన గర్భం ఇతరులెవరికీ తెలియకూడదనే దురాశతో — కాన్పు జరిగే వరకూ కూడా గర్భాన్ని బిగించి కట్టివేస్తుంది. పురుషులకు ఆకర్షణను కల్పించి డబ్బు సంపాయించేందుకని ఆమె తన ప్రాణాన్నే వొడ్డి యీ అపాయకరమైన పని చేస్తుంది .... వ్యాపారం బాగా సాగేందుకు యీ బిడ్డల్ని అమ్ముకున్నా మంచి ధరకు కొనే వాళ్ళున్నారు....ఇలాటివాళ్ళు దేశంలో చాలా మంది వున్నారు!"

యీ శాపగ్రస్థ స్త్రీలను గూర్చిన ఆలోచనలు కొన్ని క్షణాలపాటు నన్ను నిశ్చేష్టుణ్ని చేసినయ్.



# సందేహాలకు... సమాధానాలు.


ఈ శీర్షిక పాఠకుల సందేహాలను ఆహ్వానిస్తుంది. సెక్సుకూ శారీర శాస్త్రానికీ సంబంధించిన సమస్యలు ఎన్నో సమాధానాలు లేకుండానే చాలా కాలంగా మానవుల మనస్సుల్లో ఉండిపోయినవి. వాటిని తీర్చేందుకే ఇక్కడ ప్రయత్నం జరుగుతుంది.

అనుభవశాలియైన ఒక డాక్టర్ శరీరతత్వ రీత్యానూ, మానవ మనస్తత్వ శాస్త్రరీత్యానూ యీ జవాబుల్ని ఇస్తున్నాడు. ఒక్కొక్క చోట, జవాబు సూచన మాత్రంగానే ఉండిపోతుంది. ఇతర కారణాలు ఎన్నో వున్నా, ఒక వ్యక్తి నమ్మగలిగే కారణం మాత్రమే ఇవ్వబడుతూంది. శాస్త్ర స్వరూపం పరిపూర్ణరూపం దాల్చనంత వరకూ ఇలాటిది తప్పదు.

పాఠకులు పంపే ప్రశ్నలన్నిటికీ జవాబులివ్వటం కష్టం. స[illegible]మైనన్ని ప్రశ్నలకు జవాబులు ఇవ్వబడుతవి. మీరు త్వరపడినందువల్ల లాభంలేదు. క్రమపద్ధతిలో ఇదిజరుగవలసివుంటుంది. [సం॥ అభిసారిక]

1. మానవ రక్తం శరీరంలో చేసే పనేమిటి? రక్తం ఎర్రగా వుండేందుకు కారణం ఏమిటి? ఇతర జంతువుల రక్తకణాలకూ, మానవ రక్తకణాలకూ భేదమేమిటి?

మానవరక్తం ఎర్రగానూ, కిరణాభేద్యంగానూ, జిగటగానూ, వుంటుంది. హృదయం నుంచి రక్తాన్ని తీసుకొని వెళ్లే నాళాల్లోని రక్తం అతికాంతివంతమైన ఎరుపు రంగును కలిగి వుంటుంది; నరాల్లోని రక్తం కొంచెం ఊదారంగుతో కూడిన ఎరుపు రంగులో వుంటుంది. మైక్రాస్కోప్ కింద చూసినట్టయితే—రక్తం దాదాపు వర్ణహీనమైన ద్రవపదార్థంలో—అత్యధిక సంఖ్యలో వున్న చిన్న చిన్న ఎరుపురంగు రక్తకణాలు, చిన్నచిన్న తెలుపుకణాలు (చీము) కలిసి తేలుతూన్నట్టు కనిపిస్తుంది.




యీపక్క బొమ్మలో అనేక రెట్లు పెద్దవిగా చూపబడిన మానవ రక్తకణాలు కన్పిపిస్తవి. వీటిలో A అనేవి ఎరుపు వర్ణపు కణాలు; B అనేవి తెలుపుకణాలు. ఒక్కోదాని అడ్డకొలత అంగుళంలో 3000 వ వొంతు వుంటుంది. మొత్తం శరీరంలో 3300 కోట్ల కణాలు వుంటవి. తెల్ల కణాలసంఖ్యకన్న ఎర్రకణాల సంఖ్య 500 రెట్లు వుంటుంది. శరీరంలోని ఎర్రకణాల్లో 20వ వంతు కణాలు ప్రతి24గంటలకూ నాశనమౌతూ వుంటవి. కనుక అవి వెను వెంటనే తిరిగి తయారు చేయబడవలసి వుంది.

ఈఎర్రకణాల్లో అతిముఖ్యమైనది. 'హెమోగ్లోబిన్' (haemoglobin) అనబడే పదార్థం. దీనిలో ఎరుపు రంగు వున్న 'ఇనుము' ఇమిడి వుండటంవల్లనే యీకణాలకు ఎరుపురంగు వొచ్చింది.


పీల్చబడ్డ గాలిలోని ప్రాణవాయువును (oxygen) శరీరంలోని ప్రతిభాగానికీ అందివ్వటానికి ఉపయోగ పడటం యీహెమోగ్లోబిన్ మీద ఆధారపడి వుంటుంది. ఊపిరితిత్తులలోని గాలి తిత్తులగుండా యీరక్తం ప్రవహించేప్పుడు గాలిలోని ప్రాణవాయువు హెమోగ్లోబిన్‌తో కలిసి ఆక్సీహెమోగ్లోబిన్ (exyhaemoglobin)గా మారుతుంది. ఇది శరీరంలోని వివిధ tissues కు వెళ్లినప్పుడు అక్కడ ప్రాణవాయువును వొదిలేస్తుంది. ప్రాణవాయువు కలవటం వల్ల హెమోగ్లోబిన్ వర్ణంబాగా ఎరుపెక్కుతుంది. అందుకనే నరంలోని రక్తాన్ని తీసుకొని గాలిలో కాస్త కదిపినట్టయితే, అది వెనువెంటనే ఎరుపురంగును పుంజుకొని మరింత కాంతివంతంగా తయారవుతుంది.

హెమోగ్లోబిన్ కార్బన్ మోనాక్సైడ్ (carbonmonoxide)తో కూడా కలుస్తుంది. అప్పుడది కార్బాక్సీ హెమోగ్లోబిన్ (carboxyhaemoglobin) అనబడుతుంది. ఇది ప్రాణవాయువుతో కలిసిన హెమోగ్లోబిన్ వలెగాక, త్వరగా విడివడని మిశ్రమపదార్థంగా తయారౌతుంది. అందుకనే ఎక్కువగా బొగ్గు

పులుసుగాలిని (carbondioxide) లోనికి పీల్చినట్టయితే, అదిహెమోగ్లోబిన్‌తో కలుస్తుంది; హెమోగ్లోబిన్ దాన్నిచప్పున వొదిలించుకోలేకపోతుంది; బొగ్గు పులుసుగాలి వుండగా, హెమోగ్లోబిన్ ప్రాణవాయువును మరితీసుకోలేదు; అంటే శరీరంలోని వివిధభాగాలకు ప్రాణవాయువు సరఫరావుండదు. కనుకనే బొగ్గు పులుసుగాలి మానవప్రాణానికి చాలాహానికరమైనది.

రక్తంలోని ఎర్రకణాల్లో చాలాతక్కువగానే ఇనుమువుంటుంది; మొత్తం శరీరంలోని రక్తంతాలూకు ఇనుముకూడా లెక్కలోదికాదు. కాని ప్రతిరోజూ ఒక లక్షకోట్లు ఎర్రకణాలు శరీరంలో నాశనమౌతుంటవికనుక, అవన్నీ తిరిగి సరఫరాకావాల్సినందుకుగాను ఎంతో ఇనుము అవసరమౌతుంది. ఇదంతా మనకు ఆహారరూపంలో వెళ్తుంది. అదితక్కువైతే మందురూపంలో వెళ్తుంది. లివర్‌లో యీ పనికిరాని ఎర్రకణాలతాలూకు ఇనుము జాగ్రత్తగా దాచబడి, కొత్తకణాలకు ఇవ్వబడుతుంది. యీవిధంగా బహుకొద్ది ఇనుమే బైటనుంచి అవసరమౌతుంది.

జంతువుల తాలూకు రక్తంకూడా, మానవరక్తంవలెనేఎర్రగావుండి అలాగే పనిచేయటం, అవేవర్ణాలకణాల్ని కలిగివుంటవి. ఐతేఅవి పరిమాణంలోనూ, ఆకారంలోనూ భేదిస్తవి. ఉదాహరణకు యీపక్క బొమ్మ చూడండి.




మొదటి వరుస 'A' సస్తనజాతి (Mammals) తాలూకు రక్తంలోని ఎర్రకణాలు: 1. మానవుడు 2. ఎలుక 3. ఒంటె

రెండో వరుస 'B' — పక్షులతాలూకు రక్తంలోని ఎర్రకణాలు: 1. చిన్నపిట్ట 2. నిప్పుకోడి.

మూడోవరుస 'C' పాము తాలూకు ఎర్రరక్తకణం.

నాలుగోవరుస 'D' ఉభయచరాల తాలూకు ఎర్ర రక్తకణం: గోదురు కప్ప

ఐదోవరుస : జలచరాల

తాలూకు ఎర్రరక్తకణం: 1. పైక్ జాతిచేప 2. పార్క్ చేప.

యీ కణాల పరిమాణం అనేకరెట్లు పెద్దదిగా చూపబడింది. గమనించదగ్గ విశేషాలుఇవి: సస్తనజాతుల ఎర్రరక్తకణాలు గుండ్రంగావున్నవి. పక్షులు, పాములు మొదలైనవాటి ఎర్రరక్తకణాలు కోడిగుడ్డు ఆకారంలోవున్నవి. సస్తనజాతుల ఎర్రరక్తకణాలకు న్యూక్లియస్ (nuecleus) లేదు; ఇతరజంతువుల రక్తకణాలకు న్యూక్లియస్ వుంది.

### 2. శాస్త్రజ్ఞులు రోగ నిర్ణయాన్ని ఎలా చేయగలుగుతారు? ఒక వ్యాధికీ, ఇంకోవ్యాధికీ ఎన్నో పోలికలు వున్నప్పుడు, వ్యాధి నిజస్వరూపం ఎలా తేలుతుంది?


నిజానికి వ్యాధుల్లో చాలా పోలికలు వున్నవి. పైకి కనిపించే లక్షణాల వల్ల వ్యాధిని నిర్ణయించటం సాధ్యంకానప్పుడు ఆవ్యాధి తాలూకు సూక్ష్మాతిసూక్ష్మమైన జీవులు పెరగటంవల్ల వ్యాధి పెరుగుతుందని తెలుసుకోబడింది.

యీ జీవులు తమంతట తాముగా కదలగలవు; కొద్దికాలంలో సంఖ్యలో మితిమీరి పెరగగలవు. శరీరంలోని అనేక భాగాల్లో ఇవి రసాయన పదార్థాల్ని సంపాయించి వాటిని ఆహారంగా తీసుకుంటవి; వాటి చుట్టుపక్కల లభ్యమయే ప్రాణవాయువును (oxygen) హరించుకుంటవి. ఒక్కో జీవి అంగుళంలో 25, 000వ భాగం దళసరిలో వుంటుంది. వీటిల్లో అన్నీ చెడ్డవనే చెప్పలేము. కొన్ని బాధకలిగించి, చెరుపుచేస్తవి. మరికొన్ని శరీరం పెరుగుదలకు ఎంతో సహాయ పడుతవి. యీ మేలు చేసేవి గాలిలోని నైట్రోజన్‌ను తీసుకొని పునర్నిర్మాణానికి అనువైన రసాయనిక పదార్థాల్ని తయారు చేస్తవి. మరికొన్ని అనవసరమైన పదార్థాల్ని ఛేదించి, అవసరమైన పదార్థాలకు అందించి, పెరుగుదలకు సహాయపడుతవి. ఇలాటి వాటిని, అనవసరమైన మైలపదార్థాలు కడిగి ఆరోగ్యాన్ని కాపాడే సూక్ష్మజీవులుగా చెప్పవలసి వుంటుంది.

ఇక వ్యాధి నిర్ణయం విషయంలో, మైక్రోస్కోప్ కింద చూచినప్పుడు ఆ సూక్ష్మజీవుల ఆకారాన్నిబట్టి వ్యాధి నిర్ణయించ బడుతుంది. ఇలాటిది నేత్రానికి సాధ్యపడదు. మైక్రోస్కోప్ కింద స్పష్టంగా తెలుస్తుంది. ఉదాహరణకు యీ పక్క పేజీలో బొమ్మ చూడండి.

యీ బొమ్మ అసలు స్వరూపానికి కొన్ని వేలరెట్లు పెద్దదిగా చూపబడింది. దీనిలో—

1. సిఫిలిస్ తాలూకు సూక్ష్మజీవులు.
2. కలరావ్యాధిని విస్తరింపజేసే సూక్ష్మజీవులు.
3. డిఫ్తీరియా (diphtheria) వ్యాధి తాలూకు సూక్ష్మజీవులు



4. టైఫాయిడ్ (సన్నిపాతజ్వరం) తాలూకు సూక్ష్మజీవులు
5. బాస్యలస్ కాలీ (bacillus coli)

6. ఏంథ్రాక్స్ తాలూకు సూక్ష్మజీవులు
7. క్షయవ్యాధి తాలూకు సూక్ష్మజీవులు
8. నిమోనియా వ్యాధి సూక్ష్మజీవులు
9. ధనుర్వాతం (tetanus) తాలూకు సూక్ష్మజీవులు

మైక్రోస్కోప్ సహాయంతో యీ బొమ్మలోవలెనే చూడగలగటంవల్ల ఆసూక్ష్మజీవులు ఏవ్యాధి తాలూకువో తెలుసుకో బడుతవి. యీ విధానంలో వ్యాధి నిర్ణయించ బడుతుంది.

**3. మావూళ్లో ఒక అమ్మాయి ఐదోఏటనే రజస్వలయిందని అమ్మలక్కలందరూ ఆశ్చర్యంగా చెప్పుకుంటున్నారు. ఇలాటిది సాధ్యమేనా? ఐనట్టయితే శాస్త్రీయ కారణాలు తెలియపరుస్తారా?**

ఆడపిల్ల 5-వ ఏటనే రజస్వల కావటం కొంతమందికి అత్యాశ్చర్యంగా వున్నా, అందులో అబద్ధమేమీ వుండదు; ఎందుకనంటే ఇలాటి కేస్‌లు వైద్య శాస్త్రానికి ఏమాత్రమూ కొత్తకావు. ఇక కారణాలు ఆలోచిద్దాం.

ఆడపిల్ల పుట్టినప్పుడే ఆమె ఓవరీలలో గుడ్లు వుండటం, అవి క్రమంగా పెరగటమూ, వాటిలో కొన్ని శరీర పునర్నిర్మాణానికిగాను ఉపయోగించ బడటమూ, లోగడమనం ఏప్రిల్ సంచికలో తెలుసుకున్నాం.

గొప్పశాస్త్రవేత్తలందరూ, ఆడపిల్లలు రజస్వలకు పూర్వమే. బహిష్ఠుస్రావం కనిపించక పోయినప్పటికీ, సరిసమాన కాలపరిమితిలో ఒక విశిష్ట భేదాన్ని ప్రవర్తనలో నిరూపిస్తారనీ, దానికీ బహిష్టు క్రమానికీ చాలాదగ్గరి సంబంధంవున్నట్టు కనిపిస్తుందనీ అంటున్నారు. (చూ॥ హేవలాక్ ఎల్లీస్, ఋతు ధర్మాలు)

ఇక బహిష్టుస్రావం కనిపించటం ఏవయస్సులోనైనా రావొచ్చు. ఇలాటిది వంశ పారంపర్యతమీదా, తీసుకునే ఆహారంమీదా, వాతావరణంమీదా, పెరుగుదలమీదా—ఇలాటి అనేక విషయాలమీద ఆధారపడి వుంటుంది. వీటిల్లో ఏవొక్క కారణంవల్ల ఇంత చిన్నవయస్సులో రజస్వల కావటం సంభవించిందో శాస్త్రకారులు ఇదమిద్ధంగా తేల్చలేని స్థితిలో వున్నారు.

ఒకటిమాత్రం నిజం; చిన్నవయస్సులో రజస్వలైనప్పటికీ ఆమె సాధారణ జీవితాన్నే గడుపుతుంది కాని, పెద్ద విశేషమేమీ వుండదు. కనుక దాన్ని ఒక జబ్బుగానో, అసాధారణతగానో భావించవలసిన పనిలేదు.

ఆడపిల్ల పుట్టినప్పుడే రజస్వలైన కేసులుకూడా వైద్యశాస్త్రంలో ఉన్నవి. 12 సం. ల లోపునే బిడ్డనుకూడా కన్న 30 కేసులు అమెరికాలో రికార్డయి వున్నవి. వీటిల్లో ఒక కేసు పూర్తివివరాలు బొమ్మలతోసహా అభిసారిక ఆగష్టు సంచికలో లోగడ ప్రచురించాము.

**4. మనిషిలోని కామవాంఛ ముఖంద్వారా తెలుసుకొనే అవకాశంవుందా? స్త్రీ పురుషుల్లో ఏవయస్సులో కామవాంఛ తీవ్రతమంగా వుంటుంది?**

ముఖంచూసి కామోద్రేకం ఎక్కువవున్న మనిషో, తక్కువవున్న మనిషో నిర్ధారణగా చెప్పటం సాధ్యపడని విషయం. 'ఆమె నన్ను కోరుతున్నట్టు కనిపిస్తుంది.' అనుకునే అనేక కేసుల్లో అదంతా అబద్ధమని తెలుసుకునేందుకు ఎక్కువకాలం పట్టదు; ఒకవేళ అదే నిజమైతే, ముఖంలోలేని కొన్ని కామకళల్ని ఎదుటివ్యక్తి కావాలని వ్యక్తంచేయటంవల్లనే కాని, సాధారణ స్థితిల్లో వున్నప్పుడు మాత్రం కాదని అనుభవజ్ఞులకు తెలియక పోదు.

కామవాంఛ ఎక్కువ తక్కువలకు మెదడు, శరీరంలోని రహస్యాంగ ప్రదేశం తాలూకు పెరుగుదలలోని బలాతిశయమూ, ఇతర సెక్స్ గ్రంథులు చేసే పనీ కారణాలు. వాటితాలూకు లక్షణాలేవీకూడా వాటంతటవిగా ముఖంలో ప్రతిఫలించవు. ఏవోకొన్ని జబ్బుల్లోతప్ప ముఖభావాన్ని బట్టి వైద్యులు తెలుసుకోగలిగిందేమీలేదు.

ఏవయస్సులో స్త్రీ పురుషులకామవాంఛ తీవ్రతమంగా వుంటుందో నిర్ధారణగా చెప్పలేము. ఒకవ్యక్తితాలూకు కామవాంఛ, ఇంకోవ్యక్తి కామవాంఛకు ఎలా కొలబద్ద అవదో, అదేవిధంగా ఒకవ్యక్తి ఒకవయస్సులో తీవ్రతమ వాంఛను కలిగివుంటే, ఇంకో వ్యక్తికికూడా అదేవయస్సు అనువర్తించదు. ఐతే ఒకటిమాత్రం నిజం: ఏవయస్సులో వ్యక్తి సెక్స్ క్రియలను పూర్తిగా అర్థంచేసుకోగలిగి వుంటాడో, ఆవయస్సులోనే అతని కామవాంఛ తీవ్రతమం అయ్యే అవకాశంవుంది. ఇది ఆవ్యక్తిపొందే శిక్షణమీదా, విజ్ఞానంమీదా, పరిసరాలమీదా, ఆధారపడి వుంటుంది.





# త్యాగం

రచన: దాసరి సుబ్రహ్మణ్యం.

"ఆమెలో నిన్ను ఆకర్షించింది—ఏది?"

వెంకటరత్నం యింతవక్రంగా ప్రశ్నిస్తాడని నేననుకోలేదు. బహుశా యీప్రశ్నని ఇంగ్లీషులో వూహించి, తెలుగు తర్జుమా నామీద విసిరివుంటాడు. అదే యింగ్లీషులో ఐతే చక్కగా సున్నితంగా అడిగివుండేవాడు. ఏదో ప్రేమకొద్దీ ప్రొఫెసర్ అని పిలిచేనాకు, ఆనిమిషంలో నిజంగా ప్రొఫెసర్‌లానే కనిపించాడు.

రత్నం, టేబిల్ మీద పత్రిక తీసుకుని చదవడంలో మునిగిపోయాడు. 'పంధొమ్మిది వందల యాభై సంవత్సరమంతా ఆలోచించినా, నీకు యీ ప్రశ్నకు జవాబుదొరకదు' అన్నట్టుంది అతడి ధోరణి. పత్రికపేజీలు వూరికే తిప్పేస్తున్నాడు. నన్నుప్రశ్నించాననే గమనమే అతడికి వున్నట్టులేదు.

రత్నం ప్రశ్నని మామూలు తెలుగు నుడికారంలోకి మార్చుకుని, ఆలోచించ సాగాను. 'ఆమె నన్ను ఎందుకాకర్షించింది?'

'దమయంతి అంగసౌష్ఠవం నన్నాకర్షించలేదు. అదినాకు తెలుసు! అట్లని ఆమె హృదయం, తెలివితేటలు, లోకజ్ఞానం ఆకర్షించినయ్యా అంటే; అవీకావని నాకు తెలుసు. 'ఆకర్షించడం' అన్నమాటకొస్తే సరోజినికళ్లు నన్నాకర్షించినై. శాంతపెదాలు నన్ను మైమరిపించినై. మహాలక్ష్మిముక్కు నాముక్కుపట్టుకు నిలేసింది. తారాదేవితెలివితేటలూ, శేషమాంబ సన్నని నడుమూ, వనజాక్షి వక్షద్వయం—యీఅన్నీ నాకు వెర్రెత్తించి ఏడిపించినై. కాని..దమయంతిలో నన్ను ఆకర్షించిన, అంగభాగం....లేక ....లేక....

"ఏమోయ్! యింతసేపైనా చెప్పావు కాదే! ఊఁ!" అన్నాడు రత్నం పత్రికని టేబిల్ మీద గట్టిగాకొడుతూ.

నా ఆలోచన పుటుక్కుమని తెగిపోయింది. కానిఒకటిమాత్రం నాకు తెలుసు; దమయంతిలో ప్రతిదీనన్ను ఆకర్షించిందనీ; ఆమెపేరూ, సున్నితమైన హృదయం, అక్ళ్ల వెలుగూ, పెదాలవంపూ, మాటతీరూ, లోకజ్ఞానం, అన్నిటికంటే, నేనంటే కనబరచే గౌరవం, దయా, జాలీ, ప్రేమా-యింకా....

"యిప్పటికైనా చెప్పగలవా ?" రత్నం కిస్టువాచీ వంకచూస్తూ మళ్ళీరెట్టించాడు.

నేనువిజంగానే సిగ్గుపడి పోయాను. నా నిండు హృదయంతో, యీ లోకంలో ప్రేమించే ఓకేఒకవ్యక్తిని-ఎందుకు అంతగా ప్రేమిస్తున్నానో, ఆరాధిస్తున్నానో చెప్ప లేకపోవడం; తలవంపుగానే తోచింది. నా హృదయాన్ని నాలుక చివరకు గుంజుకుని అన్నాను,

"ప్రతిదీ—'ఆమె' అన్నప్రతిదీ నన్నా కర్షించింది."

రత్నంతలకొద్దిగావంచి, టేబిల్‌మధ్యగా చూస్తూ మెల్లిగా తలవూపాడు, నవ్వినట్టు కూడా నాకు తోచింది, నిజంగానే నవ్వాడు.

"అయితే ఆమెకోసం, నువ్వేమి త్యాగం చేయగలవ్ ?"

"ప్రతిదీ ! నా అన్నప్రతిదీ !"

రత్నం 'ఫ్' అన్నట్టు చప్పరించేశాడు. మళ్ళీ రిస్టువాచివంక ఓమారుచూసిఅన్నాడు.

"బహుశా నువ్వు త్యాగం చేసేందుకు, నీదగ్గిర ఏమీలేదనుకుంటాను."

ఆమాటలునాకు కోపంకలిగించినై, అవ మానంగాకూడా కనబడినై. కొంచెం తీవ్రం గానే అనేశాను.

"నాజీవితాన్ని, నాతెలివితేటల్ని, నా...."

"ఆగవోయ్ ! ఆగు" ఠక్కుమని మధ్యలో అడ్డుపడ్డాడు. నేనుకోపాన్ని అణిచి పెడుతూ, సూటిగా అతడికళ్ళల్లోకి చూశాను. రత్నంకొంచెం సీరియస్‌గా కొంతహాస్యంగా ప్రారంభించాడు.

"నీజీవితాన్ని త్యాగంచేయమని ఎవరూ అడగబోవడంలేదు. ప్రస్తుతం నీ ఆరోగ్యం కనబడే ధోరణిచూస్తే—అదేనిన్ను త్యాగం చేసి ఏనాడైనా వదిలిపోవొచ్చు. యికతెలివి తేటలు; వాటిసంగతి నాకూ, దమయంతి క్కూడా తెలుసు, పోతే నువ్వుత్యాగంచేయ గలిగిందల్లా అదనుకుంటాను."

రత్నం, తనచూపుడువేలిని బాగాచాచి గదికి ఓమూలగాచూపుతూ నవ్వాడు. నేను కోపాన్ని యింకాతొక్కిపడుతూనే ఆవైపుకు చూశాను. కాని అతడు చూపదలుచుకున్న వస్తువేదో అర్థంకాలేదు.

"అంటే ! ఏమిటి నువ్వుచూపేది ?" గొంతుజీరగాపలికింది. "అదే—అది ! ఆ ట్రంకుపెట్టె ! నువ్వుత్యాగం చెయ్యగలిగిన అన్నివస్తువుల్లో, అదేవిలువగలదనుకుంటాను. అదికూడా ఎరువుకాదుగదా ?"

నాతల తిరిగిపోయింది. బీదతనంపాప మని నేనెప్పుడూ భావించలేదు. పైగా నా ప్రాణప్రదంగా ప్రేమించే స్నేహితుడి నోటినుంచి అలాంటి మాటరావడం నాకు చాలా దారుణంగా తోచింది,

"చాలామందిలాగా — నాతెలివి తేటల్ని సంపాదనకుమాత్రమే వుపయోగించి వున్న ట్టయితే—యీపాటికి గదినిండుగా అలాంటి ట్రంకుపెట్టెలు విలువగల వస్తువులతో కూడా తయారైవుండేవి, కాని నా తెలివి తేటల్ని అంతచౌకగా వినియోగించలేదు."

"ఐతే-మరెందుకు వుపయోగించినట్టు?" రత్నం పెదాలమీద అదేచిరునవ్వు—చిలిపి నవ్వు. నాకు అదిచాలా క్రూరంగా కన బడింది. పైగా—అసలు విషయంనుంచి

సంభాషణ పక్కదార్లకు పాకుతోన్నట్టు తోచింది. చాలా హాస్యాస్పదంగా కూడా కనబడింది. అనేశాను.

"ప్రొఫెసర్ రత్నంగారూ! మీరు యీవిషయంలో సహాయం చేయదలిస్తే చేయండి; లేకపోతేమానేయండి. కాని— నాతెలివితేటలచర్చా, దమయంతిని ఎందుకు ప్రేమిస్తున్నానో, ఆమెఎందుకుఆకర్షించిందో అదంతా అనవసరం."

రత్నంతిరిగి టేబిల్ మీదనుంచి పత్రిక చేతిలోకి తీసుకున్నాడు. నామాటలు కొంత వాడిగానే తగిలినట్టు గ్రహించాను. ఓరెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచినై. పేపర్ని జాగర్తగా టేబిల్ మీద పెడుతూ అతడు నా ముహంలోకి ఓమారు చూసి- వ్యవహార ధోరణిలో అన్నాడు.

"ఐతే అసలు విషయానికి వస్తాను. దమయంతి నీకోసం చెయ్యవలసిన త్యాగంనీకూ తెలియందికాదు. వర్ణాశ్రమ ధర్మాలు పోయినా వాటివాసనలు పోలేదని నీకూ తెలుసు! అవన్నీ వదిలేద్దాం. ఆమెను కోరడంలో నీఅర్హత?"

అనిమిషంలో నాలో ఏశక్తులు, ఏ అనుభూతులు, ఏవూహా చిత్రాలుకదుల్లాడినయ్యో, కలతపెట్టి కదిలించినయ్యో నాకుతెలీదు. కాని, నాకు మాత్రం నాఆశాసౌధం కనుచూపుమేరనుంచి, కాలికీ-చేతికీ తగిలేంత దగ్గిరకు జరిగినట్టు కనబడింది. హృదయం రెక్కలు పెంచుకుని గాలిలో తేలుతూ పల్టీలు కొట్టింది. నాలోనించి ఓపెద్ద నవ్వు —ఎండిన చెట్లనూ, యింకిన నదుల్నీ; చిగిరించేట్టూ, వరదలైపారేట్టూ చేయగల పెద్దనవ్వు, కొండంతగా కదుల్లాడి, సూర్య—చంద్ర మండలాల్లో ప్రతిధ్వనించేంత పెద్దగా బయటపడింది.

"అర్హత! అర్హత!" మాటలుమాత్రం ఆరెండే అనగలిగాను. రత్నం నావంక ఆశ్చర్యం, జాలీ, దయా మేళవించి మరీ చూశాడు. నిజంగా అతడిమీద జాలికలిగింది. ఎంత స్నేహితుడైనా వయసులో నాకంటె చిన్నవాడేగదా!

"అర్హత విషయంలో నువ్వంత బాధపడబోకు. నేను పురుషుణ్ణి—ఆమె స్త్రీ! అంతకంటె కావలసిన అర్హతేమిటి?"

నామాటలు వింటూనే, నావంక అదోమోస్తరుగా చూశాడు.

"నువ్వుసీరియస్‌గా మాట్లాడుతున్నావా?"

"సీరియస్‌గానే మాట్లాడుతున్నాను. యికముందు, గడ్డుసీరియస్‌గా మాట్లాడుతాను. నాయోగ్యత లేక అర్హత—అదంతా, చదవనేర్చిన ప్రతి తెలుగువాడికీ తెలుసు."

"అంటే?" కళ్లుచిట్లించి టేబిల్‌మీద అరచేతిని గట్టిగారాస్తూ రత్నం అన్నాడు.

"రచయితగా మనకున్న పేరూ, ప్రఖ్యాతీ—ఆకారణంగా రాబోయే అమరత్వం, అందులో భార్యగా దమయంతి పంచుకోపోయేపాలూ...."

రత్నం కొంచెం పెద్దగానే నవ్వాడు. నేను మాటమధ్యలో ఆపాను.

"యింతకీ నువ్వురాసిన రచనలెన్ని? అందులో అచ్చయిన వెన్ని?"

"యింతవరకు ఏడుకథలు రాశాను.

నాలుగు ఆచ్చయినై. మూడుకథలు తిరిగి వచ్చినై. ఫరవాలేదు! మళ్ళీ రాయబోతున్నాను.''

''ఆనాలుగుకథలకే, అంతకీర్తి—ఆపైన అమరత్వం! ఆఁ!'' అతడిమాటల్లో హేళనా, యీసడింపూ నాకు కనబడింది.

''ఒక్కరచనచాలు, మనకీర్తి చిరస్థాయి అయేందుకు! ఒక్కరచన! ఒక్క ....''

యీసారి రత్నంబాగా ముఖం చిట్లించి, ఏట్టికా టేబిల్‌మీద అరిచేతిని రుద్దాడు. వెగటుగా, వికారంగా నావేపుచూస్తూ—

''ఆవిషయం నాకేమీతెలీదు. స్నేహితుడుగా నాసహాయం అడిగావు గనక చెపుతున్నాను. నీకోసం దమయంతి చేయవలసిన త్యాగం చాలాపెద్దది. నీకోసం వొచ్చినా నేనుచేసేదేమీలేదు. చెపుతున్నాను. ఆర్థికంగా ఆమెచాలా త్యాగంచెయ్యవలసి వుంటుంది, కుటుంబాన్నీ. పెద్దల్నీ ఎదిరించవలసి వుంటుంది. ఆరోగ్యంలో, అందంలో—యింకా సాంఘికంగా అన్నివిధాలా నీకన్న అధికురాలు. కాని నువ్వు చేసే త్యాగం?''

పాఠంచెప్పేధోరణిలో రత్నం యింతా అనేశాడు. అంతావిన్నతరవాత నామనస్సు చివుక్కుమన్నది, గుండెల్లో ఏదో కలకవేసినట్టయింది. దీనంగానే అన్నాను.

''రత్నం! నువ్వుచెప్పినదంతానిజం! కాని నన్నేంత్యాగంచెయ్యమంటావ్? నువ్వేచెప్పు''

నాగొంతు బొంగురుపోయిందని నాకు తెలుస్తూనేవుంది. ఆనిమిషంలో బావురుమని పెద్దగా ఏడ్వాలనీ, తలను ఆ ప్రాణమిత్రుడి చేతుల్లో పెట్టి వెక్కివెక్కి మరీ ఏడ్వాలనీ అనిపించింది. కాని, వయసూ, పక్కభాగంలో కాపరం వున్నవాళ్ళూ, నన్నునిరుత్సాహపరిచారు.

''ప్రేమత్యాగాన్ని కోరుతుంది. అది ఒక్కొక్కప్పుడు నిండుప్రాణాన్నికూడా అడగొచ్చు. దమయంతి నీకోసంఎన్నోత్యాగాలు చెయ్యాలి. కాని నువ్వుమాత్రం ఆమెకోసం ఆఖరికి సిగరెట్టుకూడా మానవలసినంతపాటి త్యాగంకూడా చేయనవసరంలేదు. నీకు—కనీసం సిగరెట్టు తాగేంత చిన్నపాటి దురభ్యాసంకూడా లేదాయె!''

రత్నం ఓస్టువాచీవంక ఓమారు చూశాడు. నావంక సాభిప్రాయంగా చూసి కుర్చీలోనుంచి లేచినిలబడ్డాడు, 'యీరోగి బతకడు. లాభంలేదు.' అనుకుని చేతులుదులుపుకొనే డాక్టరు ధోరణీ, ఆచూపూ నాకు అతడిలో కనబడినై.

నాలో దుఃఖంపొంగులువారింది, ఏ దురభ్యాసం, కనీసం సిగరెట్టు తాగేంత చిన్న దురభ్యాసంకూడా లేకుండా ముఫైసంవత్సరాలు బతికిన నాదురదృష్టానికి గుండెచెరువైపోయింది. నేను ప్రేమించినస్త్రీ—నాకోసం అంతంత విపరీతత్యాగాలు చేస్తూంటే —, నావైపునుంచి పీసమెత్తుత్యాగంకూడా చేయలేని నికృష్టజీవిగా వున్నందుకు నన్ను నేనే, అతికఠినంగా శపించుకున్నాను.

రత్నం ఏదో అన్నాడు. నేను గుడ్లప్పచెప్పి చూస్తూ వుండిపోయాను, అతడు డాబామీదినుంచి ఒక్కొక్కమెట్టే దిగుతున్నాడు. ఏదోఅందామనీ, దారికి అడ్డంగా నిలబడి, మార్గాంతరం చెప్పమని బతిమాలాలనీ బలమైన యిచ్ఛకలిగింది. కాని,

నాకాళ్లు స్వాధీనంలోకి రాలేదు. గొంతు తడారిపోయింది. నాలుక సీసంముక్కలా బరువుగా-భారంగా-కదలా-మెదలక వుండి పోయింది.

నాలో భావసంచలనం మాత్రం తీవ్రాతి తీవ్రమౌతోంది. దమయంతినితప్ప మరెవ్వరినీవివాహం చేసుకోలేను. అదినిశ్చయం. కాని, నేను ఏత్యాగం చెయ్యలేని నిస్సహాయ స్థితిలోవున్న కారణంగా, అబాధనీ, నిరాశనీ, నిస్పృహనీ, శ్మశానం వరకూ మోసుకు పోవలసిన దీనస్థితి—ఆ నిమిషాన నన్ను కుంగతీసింది. రత్నం ఆఖరిమెట్టు దిగేలోపల ఏదోఒహాటి అనాలనీ, నేను దమయంతి కోసం—ఆమెమీద నాప్రేమను రుజువు చేసుకునేందుకు—ఏదో ఒహాటి చెప్పాలనీ నాలోవిపరీతమైన బాధ. వేగిరపాటూ బయలుదేరినై.

రత్నం ఆఖరిమెట్టు దిగేశాడు. నాలోని ప్రతిశక్తినీ, జీవకణాన్నీ వుపయోగించి—ఎంతో ప్రయత్నంతో అనేశాను. అప్పటి నాప్రయత్నం ఏదోఒహాటిఅనాలని. అంతే! ఏమంటున్నాననే జ్ఞప్తే. మెలకువేలేదు. అన్నాను. చాలాపెద్దగానే—రత్నం తక్కున నిలబడి పైకి, నావేపుకు చూచేంత బిగ్గరగానే అన్నాను.

"నాప్రాణంగా కాపాడుకునే యీగిరజాల జుట్టును, ఆమెకోసం త్యాగం చేస్తాను. యీనిమిషాన సమ్మర్‌క్రాపు చేయిస్తాను."

రత్నం వింతగా నావంక చూశాడు. ఏదోఒహాటి అనగిలిగినందుకూ, అతణ్ణి అక్కడ ఆపగలిగినందుకూ, నాకు విపరీతమైన సంతృప్తి కలిగినా. అన్నహా[illegible]లకి కొంత సిగ్గుకూడా కలిగింది. నా లు[illegible] కొరుక్కున్నాను—

రత్నం మళ్ళీ నడుస్తున్నాడు. యీసారి వొళ్లు తెలియని మైకంలో అనేశాను—

"రత్నం! రేపుకనబడు. నేను చెయ్యగలిగిన త్యాగంకూడా చాలావుంది. దమయంతికోసం, యింతకాలం ఎంతో రహస్యంగా దాచిన కటిక దురభ్యాసాల్ని మానేస్తాను, తాగుడు, వ్యభిచారం, సిగిరెట్లు...."

రత్నంకళ్లు తాటికాయల్లాచేసి నావంక చూశాడు. 'ఆఁ! నిజమా?' అన్న ప్రశ్న స్ఫుటంగా అతడి మొహాన నాకుకనబడింది. కాని ఎందువల్లో ఏమీఅనకుండానే—అతడు తలవంచుకుని వెళ్ళిపోయాడు.

నేను నిస్పృహతో కుర్చీలో కూలబడ్డాను జీవితంలో—సమయస్ఫూర్తి లోపంగా నేను పోగొట్టుకున్న అనేక అమూల్యావకాశాలు నా కళ్ళముందు కదుల్లాడినై. కాని యీ సారైనా.......

ఏబలమైన ప్రేరణ, సృష్టిశక్తి, ప్రకృతి ప్రభావం నన్ను కదిలించిందో నాకుతెలీదు. నిబ్బరంగా, నిర్వికారంగా, ఓబలమైన నిశ్చయంతో డాబామెట్లు దిగేశాను. మొదటగాకనబడిన కిల్లీషాపులో మూడు సిగరెట్ పెట్టెలూ, ఒక అగ్గిపెట్టా కొనేశాను. అక్కడినుంచి అవిచ్ఛిన్నంగా సిగరెట్ మీద సిగరెట్టు—కాదు సిగరెట్టుకు సిగరెట్టుముట్టిస్తూ పక్కసందులో జొరపడ్డాను. విపరీతమైన దగ్గువస్తోంది, గుండెకాయ గొంతులోనుంచి

బయటకు దూకుతుందేమో అన్నంతభయం వేసింది. కాని లెక్క చేయలేదు—

నాగులు, నన్నుచూసి నిర్ఘాంతపోయాడు. కళ్ళుమూసుకుని ఓగుక్క వేసి, మిగిలినదంతా చొక్కామీదా, పంచమీదా పోసుకున్నాను. చలిజ్వరానికి ఏకధాటిగా మూడు సంవత్సరాలు క్వినైన్ తాగిన నాకు అదేమంత వెగటనిపించలేదు, తిరిగి రోడ్డు మీదికివచ్చాను. నాగులు వెనకనుంచి అరుస్తున్నాడు 'కొంపారుతుంది. జైలు! జైలు!' అంటూ. నేను విన్నాను. అంతే! వూరుకున్నాడు,

గొంతులోనుంచి ఏదోరాగం. వెంటనే పాటా ఒక దానితో ఒకటి కుస్తీపట్టినై. ఎప్పుడో విన్న సినిమాపాటలు ఒక్కొక్కటే మనసులో మెదుల్లాడినై, ఆసమయానికీ-సందర్భానికి ఏపాట తగింది?

రోడ్డువెంట నడుస్తూ సన్నగా ప్రారంభించాను. 'దుఖ్ కే దునియా!' కాని పాట సొంతం గుర్తుకురాలేదు. పైగా ఆపాటరక్తి కట్టాలంటే, రోడ్డుపక్కన ఏగోడకో వీపు ఆనించాలి. పక్కలకు చూశాను. అన్నీ సైడుకాలవలు, మురుగు.

నాపక్కన నడుస్తున్న ఒకడు అంటున్నాడు. "ఛా! చాలాపెద్ద మనిషి. ఏదో సామర్లకోటగ్యాన్ ఐవుంటుంది." కాదురా అబ్బాయిలూ! 'ఫలానా' అందామనుకున్నాను. కాని పోలీసులవరకూ పోకుండా ముందుగానే నన్ను పెద్దమనిషి కిందకట్టి, ఏగదిలోనో పెట్టి తాళం వేస్తారని భయపడ్డాను. ఎర్రిబుట్టకోసం అన్నివైపులకీ చూస్తూ నడుస్తూనే వున్నాను. విపరీతమైనదగ్గూ, మధ్యమధ్య పాటా—'యాదు హై ఓకహానీ' బాగా గొంతెత్తాను. 'వహ్వా నూర్జహాన్! క్యాకహీ!' ఆగొంతుదారు కుచ్చుటోపీచూసి నవ్వుకున్నాను.

అదృష్టదేవత మానవుణ్ని ఒకోసమయంలో, గాడిదరూపంలోవచ్చి పొడవడమే కాదు; దున్నపోతు ఆకారంతాల్చి తన్ననూవొచ్చు! నిరాశతో, యిక పోలీసుస్టేషనుకు సరాసరివెళ్ళి నాకునేనే చెప్పుకోవలసిన కర్మపడుతుందని భయంకలగగానే, నావీపుమీద బలమైన లాఠీపోటూ, భుజం మీద గట్టిగుప్పెటపట్టూ ఒకేసారి పడినై. నేను ఎక్కువగా ఏమీ మాట్లాడలేదు. సబ్ యినస్పెక్టరు దగ్గిర నన్నునిలబెట్టి నప్పుడు; ఆయన అడిగేవాటికి నాతోచిన జవాబులు చెప్పాను.

ఆరాత్రిల్లా ఆచీకటికొట్లో నాకు నిద్దర పట్టలేదు. వుదయానే రత్నంవస్తాడని నాకు తెలుసు. బహుశా నాకోసంకళ్ళనీళ్లకూడాపెడతాడు. అప్పుడు దమయంతికోసం, యీ దురభ్యాసాలని త్యాగం చెయ్యగలననీ, జీవితంలో ఓభాగంగా తయారైన తాగుడూ, వ్యభిచారం, సిగరెట్లూ—యివన్నీ ఆమె కోసం త్యజించి—నాప్రేమను ధృవపరచుకోగలననీవిశ్వసించాను. హృదయంతృప్తితో, ఆనందంతో గంతులు వేసింది. భవిష్యత్తు స్వర్ణమయంగా కనబడింది—

ఎనిమిదింటికల్లా రత్నం రానేవచ్చాడు. అతడి ముఖకవళికలు ఎంతో వ్యాకులపాటునీ, ఆదుర్దానీ, ఆశ్చర్యాన్నీకనబరిచినై.

“ఏంపనిది? యింతఘోరం! యింతనీచస్థితి....” అతడికి మరి మాటలు పెగలలేదు. నేను, ఏంతోభారం దిగిపోయినవాడిలాచెప్పాను.

“నిన్నసాయంత్రం నేను చెపితే నువ్వు నమ్మలేదు. ఎంతోకాలంగా యీ దురభ్యాసాల్ని దాస్తూవచ్చాను. దమయంతికోసం నేను చేయగలిగిన త్యాగం ఎంతగొప్పదో నీకు యిప్పుడు అర్థమై వుంటుంది — ఎన్నోఏళ్ళుగా వస్తున్న యీ అలవాట్లన్నిటినీ....తాగుడూ....వ్యభి....”

రత్నం కుడిచేతిని ముఖానికి అడ్డంగా పెట్టుకుని పక్కకు తిరిగాడు.

“యికమాట్లాడకు. యీనిమిషంతో మనిద్దరి స్నేహం అంతమైనట్టే! ప్రాణస్నేహితుడుగా భావించాను; నమ్మాను. యింత మోసకారివనీ, నీచుడివనీ ఎప్పుడూ అనుకోలేదు. ప్రాణస్నేహితుడుగానటిస్తూ, యింతకుళ్ళుని దాచుకున్నావ్? ద్రోహివి!”

అతడు నావైపుకూడాతిరిగిచూడకుండా వెళ్ళిపోతున్నాడు. నాగుండెలుగరిసెపడినై, కాళ్లు తేలిపోయినై, నిస్త్రాణనన్ను కప్పేసింది; ముంచెత్తింది. కథఅడ్డంతిరిగిందో— నిలువుతిరిగిందో నాకు తెలియడంలేదు. అంతాచీకటి. చిమ్మచీకటి. కారుచీకటి. చీకటి!

ఆచీకట్లో గొంతెత్తి గట్టిగా అరిచాను. జైలు గోడల్ని అన్నివైపులాతాకి, యినపచువ్వలగుండా బైటపడలేక ఆశబ్దం తిరిగి నాచెవుల్లోనే, నాలోనే ప్రతిధ్వనించింది.

“త్యాగం! దమయంతి త్యాగానికిసరితూగగల త్యాగం! ప్రేమకోసం త్యాగం! త్యా-గ-ం!”

విశాఖపట్నం ప్యాసింజర్ ఎన్నింటికని, నాసెల్ముందు ఎవరో యింకొకరిని ప్రశ్నించడంవిని అదిరిపడి, ముందుకుదూకి జైలుగదిచువ్వల్ని బలంగా గుంజసాగాను.



Edited and Published by Dhanikonda Hanumanta Rao at Abhisarika Office Tenali, & Printed by him at Sree Parasakti Printing Works, Tenali.



రేగిన ముంగురుల్ నుదుట ప్రేమ సుధా మధురైక భావముల్
ప్రోగులు వోయగా నిదురవోవు దయామయి ! నా యెదందలో
అగక పొంగు స్వాప్నిక రహస్యము లెవ్వియొ—నీదుగుండెతో
దాగుడుమూతలాడ సరదాపడుచున్నవి కన్నులెత్తుమా !

—'కరుణశ్రీ'

ఆంధ్రా, నైజాం, బెంగుళూరు, మద్రాసులలో
వేలకొలది ప్రజలు చూచి ఆనందించుచున్నారు



విజయ వారి..

# షావుకారు

[ఇరుగు పొరుగుల కథ]

డాక్టర్ జి. వి. సుబ్బారావు ఎన్. టి. రామారావు
వి. శివరామ్ ఎస్. వి. రంగారావు శ్రీవత్సవ
రేలంగి జోగారావు వంగర కె. వి. సుబ్బారావు
శాంతకుమారి జానకి కనకం సీత బేబీ భాను

కథ: చక్రపాణి : పాటలు: సముద్రాల : సంగీతం: ఘంటసాల

నిర్వాహకులు - నాగిరెడ్డి :: చక్రపాణి... దర్శకుడు - ప్రసాద్...

WRAPPER PRINTED AT THE B. N. K. PRESS, MADRAS-1